నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:16 సంచిక:3 181 జూలై-ఆగష్టు 2026 హైదరాబాద్

- భిన్న భాషలు ఒకే గొంతుక
- “అ(గ్రాసు కథల స్వభావం లచ్చువ్వది, స్వరూపం రాజవ్వది”
- నదితో పెనవేసుకుపోయిన ఒక రైతు ఆత్మకథాచిత్రం
- నేటికీ వర్తించే నడుస్తున్న చరిత్ర
- పాయగా కాదు ప్రవాహంగానే తెలంగాణ భావకవిత్వం
- 'తెలంగాణ భాష' అవసరం తీరిందా?



నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

జూలై-ఆగస్టు 2026
సంచిక : 03
సంపుటి : 16

గౌరవ సంపాదకులు
ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహా మండలి
అల్లం నారాయణ
చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ చింతా గణేష్
ప్రిన్సిపాల్ (పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
ప్రొఫెసర్ చింతకింది కాశీం

సంపాదకురాలు
స్నేహలత ఎం.

సంపాదకవర్గం
ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్, ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
డా॥ చంద్రయ్య, ఎస్. అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
డా॥ శివరాత్రి సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
డా॥ ఇమ్మిడి మహేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి

రచనలు పంపాల్సిన చిరునామా
స్నేహలత ఎం.,
ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
మెయిల్: nadusthunnatelangana@gmail.com
ఫోన్ నెం.: 9290745490

సంపాదకుని ఉత్తరం

ఆకాశం గర్భసంచికి
చిల్లులు పడ్డాయి
నీరు నిలువదు
వర్షం కురువదు

మనిషి జీర్ణాశయానికి
ఆకలి ఎక్కువ
నీలిమబ్బులను కూడా
నమిలి మింగారు

ఇప్పుడు
భూమి కడుపునిండా
పిల్లలే
ఆకలి దప్పిక తీరే దారేది...!

సెప్టెంబర్ 2, 2026

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

తెలంగాణ తొవ్వ

సంపాదకీయం

భిన్న భాషలు ఒకే గొంతుక | **డా. చంద్రయ్య శివన్న** | 5

సమకాలీనం

భవిష్యత్తుకు భరోసా ఏది? | **క్రాంతి** | 6

తొవ్వ ముచ్చట

అగ్రాసు కథా స్వభావం లచ్చువ్వది, స్వరూపం రాజవ్వది – రాజీ కన్నా
ఇంటర్వ్యూయర్: చుక్కవంశీ | 7

సాహిత్య పరిశోధన

పాయగా కాదు ప్రవాహంగానే తెలంగాణ భావకవిత్వం | **డి.ప్రకాష్** | 13

తెలుగులో నవలా వికాసం | **బొడ్డుపల్లి అఖిల్** | 17

చెరబండరాజు విప్లవ నాటకాలు–పరిశీలన | **హెచ్.మధుసూదన్** | 21

యాది–సదాశివ | **వెంకన్న** | 24

సాహిత్య విమర్శ

ఉద్యమకవి దాశరథి | **డా. ఇమ్మిడి మహేందర్** | 28

తెలంగాణ భాష అవసరం తీరిందా? | **డా. చంద్రయ్య శివన్న** | 33

సాహిత్య సమీక్ష

అణగారిన వర్గాల జాడలు–చైతన్యప్రకాశ్ (రేణ) కథలు | **డా. ముత్యంపేట గంగాధర్** | 36

జీవన వాస్తవికత–సిద్దెంకి యాదగిరి 'తప్ష'కథలు | **అరిగె కమలాకర్** | 40

మానవ నాగరికతతో పెనవేసుకున్న రైతు ఆత్మకథా చిత్రం | **బాల సుధాకర్‌మౌళి** | 43

నేటికీ వర్తించే 'నడుస్తున్న చరిత్ర' | **బాషిపాక నవీన్** | 45

విత్తనాలు అక్షరాలై మొలకెత్తుతాయ్...! | **డా. ఎ.రవీంద్రబాబు** | 47

పరిశోధన పరిచయం

తెలుగులో యుద్ధతంత్ర శాస్త్రకావ్యాలు–అనుశీలన | **డా.కె.రమేశ్** | 49

సంపాదకీయం

భిన్న భాషలు ఒకే గొంతుక

డా. చంద్రయ్య శివన్న

ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా బెంగుళూరులో ఆగష్టు 21-23 తేదీల్లో "బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్-2026" మూడో ఎడిషన్ జరిగింది. ప్రముఖ కన్నడ సాహితీవేత్త సతీష్ చప్పరికె డైరెక్టర్ గా ఉన్న ఈ ఉత్సవం మొదటిసారిగా 2024లో ప్రారంభమైంది. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ ఉత్సవం, ద్రావిడ భాషాసంస్కృతుల సంగమానికి ప్రతీకగా నిలిచింది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ సాహితీవేత్తలతోపాటూ ఈసారి బెంగాలీ భాషాసాహితీవేత్తలను కూడా ఆహ్వానించడం విశేషం. తెలుగు భాషనుంచి కొంతమందిమి పాల్గొనే అవకాశం కలిగింది. ఈ ఉత్సవంలో ఏర్పాటుచేసిన వివిధ వేదికలు సాహితీవేత్తలతో, సాహిత్యాభిమానులతో ఎంతో ఉత్సాహంగా కనిపించాయి. వందల మంది సాహితీవేత్తలతో కోలాహలంగా గడిచింది. కొత్త ఆలోచనల కలపోత, భిన్న స్వరాల వలపోత ఈ సాహిత్య ఉత్సవం సాధించిన విజయం. ఓ వైపు కన్నడ, మలయాళాలు, ఇంకోవైపు తెలుగు, తమిళాలు, మరో వైపు బెంగాలీ భాషాధ్వనులు మనల్ని చుట్టిముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఒకే భాషాధ్వనులకు అలవాటుపడ్డవారికి ఒకేసారి ఆ మధురమైన భాషాధ్వనులు లయాత్మకతో శ్రవణసుభగత్వాన్ని కలిగిస్తాయి. వీటికితోడు భిన్న వేషధారణలతో కొత్త సాంస్కృతిక ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. వేదికలమీద, చెట్లకిందా, క్యాంటిన్ లో, మెస్ లో, గదుల్లో, ఎక్కడచూసినా సాహిత్య జ్ఞాపకాలను తవ్విపోసుకోవడం కనిపించింది. సీనియర్ రచయితలతో ఆయా భాషాసాహిత్యాల జూనియర్ రచయితల ఎప్పుడూలేని దగ్గరితనం, ఎడతెరపిలేని సంభాషణలు కొత్త సాహిత్య వాతావరణాన్ని సృష్టించాయి. ముఖ్యంగా, జూనియర్ రచయితల్లో ఒక కొత్త విశ్వాసాన్ని కలిగించాయి. అదే వేదికమీద జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

ద్రవిడ భాషాసాహిత్య, సామాజిక భావన అంతస్సూత్రంగా సాగిన ఈ సాహిత్య ఉత్సవంలో ప్రాంతీయ భాషలు ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చకు పెట్టింది. వీటికి తోడు 'మంటప' అనే ప్రధాన వేదికమీదనుంచి ఆంగ్లం భాషలో చర్చలు జరిగాయి. భాషాధిపత్యంపై జరిగిన విస్తృతమైన చర్చ ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం, జాతీయంగా హిందీ భాషల ఆధిపత్యం కేంద్రంగా సాగింది. ఈ చర్చ భాషకుండే శక్తిని, దాని ఆధిపత్యాన్ని ఆవిష్కరించింది. తొలిరోజుల్లో ఆంగ్లం, బెంగాలీ, హిందీ భాషలనుంచే అనువాదాలు తెలుగులోకి ఎక్కువగా ఉండేవి. ద్రవిడ భాషల మధ్య అనువాదాలు తక్కువేనని చెప్పొచ్చు. ఈ ఉత్సవం ఈ అవసరాన్ని గుర్తించింది. కొత్త ఆలోచనలు కలిగినవారు ముఖ్యంగా యువత ఇటీవల తెలుగు పబ్లికేషన్ రంగంలోకి రావడంతో ద్రవిడ భాషాసాహిత్యాల మధ్య అనువాదాలు ఊపందుకున్నాయి. ఈ విషయంలో ఛాయా పబ్లికేషన్స్ చేస్తున్న అనువాద కృషి మెచ్చుకోదగింది. వారు యువ అనువాదకులకు అనువాదంలో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేయించి మరీ అనువాదాలకు ప్రోత్సహిస్తున్నారు. దీని ఫలాలు బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవంలో పుస్తకాల షాపుల్లో మెరిసాయి. ఈ సాహిత్య ఉత్సవంలో విభిన్న అంశాలకు సంబంధించి 16 తెలుగు సాహిత్య కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో దాదాపు 50 మంది రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. కవిత్వ పఠనం, పుస్తకావిష్కరణలు, ప్యానెల్ డిస్కషన్స్, ముఖాముఖి వంటి కార్యక్రమాలు ముఖ్యంగా జరిగాయి.

బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవం గురించి తెలుగు రాష్ట్రాలనుంచి ఒక చిన్న విమర్శా లేకపోలేదు. వాటిల్లో ముఖ్యమైనవి: ఇది బుక్ 'బ్రాహ్మణ' ఫెస్టివల్ అని, మరొకటి: కార్పోరేట్ ఉత్సవం అని. అక్కడికి వెళ్లివస్తే, అలాంటి ఛాయలున్న 'బ్రాహ్మణ' వాతావరణం ఇసుమంతైనా కనిపించదనేది వాస్తవం. వెళ్లకపోయినా, ఆ ఉత్సవ ప్రోగ్రాం షీటు చూస్తే ఎవరికైనా చాలా సులభంగా అర్థమయ్యే విషయం. కాబట్టి, ఈ మొదటి విమర్శ పెద్దగా చర్చకు నిలిచేది కాదు. ఇంకో రెండో విమర్శ, సామాజిక ప్రయోజనాన్ని అభిలషించేలా ఉండాల్సిన సాహిత్యం, కార్పోరేటీకరణకు గురౌతుందన్న ఆవేదన ఉంది. దాంట్లో నిజాయితీ ఉంది. కానీ, అన్ని కాలాల్లో, అన్ని సందర్భాల్లో సాహిత్యం ఒకేలా ఉండాలా? ఒక ఉత్సవంలా ఎందుకు జరుపుకోకూడదు? ఈ కొత్తతరం యువతతో ఈ ఉత్సవ రూపంలో ఎందుకు చేరకోకూడదు? అనే ప్రశ్నలను మనం ఇకనైనా వేసుకోవాల్సిందేనేమో! ఇటువంటి కొత్త పద్ధతులను అన్వేషించవల్సిందేనేమో!! T

భవిష్యత్తుకు భరోసా ఏది?

క్రాంతి

విశ్వగురువుగా చెప్పుకునే దేశంలో విద్యా వ్యవస్థ వద్యశిలపై నిలుచుంది. వేలాది పాఠశాలలు దయనీయస్థితిలో ఉన్నాయి. సీజేపీ ప్రారంభించిన స్కూల్ రీక్ కరో క్యాంపెయిన్‌లో నివ్వెరపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వాస్తవాలను కప్పిపెట్టేందుకు అధికార బీజేపీ నేతలు నానా పాట్లు పడుతున్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు వ్యక్తులను ప్రభుత్వ పాఠశాలల్లోకి అనుమతించొద్దని ఆంక్షలు విధించాయి.

నీట్ ప్రశ్నాపత్రాల లీక్ వ్యవహారం తరువాత, కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఈ ప్రచారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సీజేపీ ఆగస్టు 15న స్కూల్ రీక్ కరో క్యాంపెయిన్‌ని ప్రారంభించింది. క్యాంపెయిన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా యువత, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను వెలుగులోకి తెస్తున్నారు. సోషల్ మీడియాలో కనిపిస్తున్న వీడియోలు ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని కళ్లకు కడుతున్నాయి. దేశ వ్యాప్తంగా మెజార్టీ పాఠశాలలకు పక్కా భవనాలు లేవు. ఉన్నా అవి శిథిలావస్థలో ఉన్నాయి. బాల, బాలికలు చదువుకోవడానికి అవసరమైన కనీస సదుపాయాలు లేవు. టాయ్‌లెట్లు, మంచినీళ్లు కూడా అందుబాటులో లేవు. ఇది దేశ ప్రజలందరినీ కలచివేస్తున్న దృశ్యం. ఢిల్లీ జంతర్ మంతర్ ఆందోళన తరువాత దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థులు (జెన్ ఆల్ఫాలు) సైతం తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్లమీదికి వస్తున్నారు.

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని The Unified District Information System for Education Plus (UDISE) గణాంకాల ప్రకారం, 2024-2025 విద్యా సంవత్సరంలో దేశంలో 24.69 కోట్ల మంది పాఠశాల విద్యార్థులు ఉన్నారు. వారిలో సుమారు 12.16 కోట్లమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. అంటే సగం మంది ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. అందుకే, స్కూల్ రీక్ కరో క్యాంపెయిన్ దేశంలోని పన్నెండు కోట్లకు మంది విద్యార్థుల భవితవ్యానికి సంబంధించినది.

అయితే, ఒక పౌరుడు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి అక్కడ వసతులు సరిగ్గా లేవని నిలదీస్తే, ప్రభుత్వం సమస్యల్ని పరిష్కరించి, విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలి. కానీ... ప్రశ్నించిన వారిని నేరస్తులు చేయడం ప్రజాస్వామ్యం కాదు. ఒక వ్యక్తి తమ గ్రామంలో ఉన్న పాఠశాల దుస్థితిని ప్రపంచానికి చూపిస్తే, అతడు ప్రభుత్వ అధికారి కానందున వాస్తవం అబద్ధం అయిపోదు. ఈ వాస్తవాన్ని దాచిపెట్టేందుకు సోషల్ మీడియా యాక్టివిస్టులు, సీజేపీ కార్యకర్తలపై దాడులు చేయడం సరికాదు. రాజస్థాన్‌లోని బగ్రూలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలించడానికి వెళ్లిన సీజేపీ బృందంపై బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డడం ప్రభుత్వ అసహనానికి నిదర్శనం. అంతకు ముందు పశ్చిమ బెంగాల్‌లో బంకురా జిల్లాలో సీజేపీ కార్యకర్త అబ్దుల్ హఫీజ్ తన గ్రామంలోని పాఠశాలను పరిశీలించాలనుకున్నందుకు, అతని తండ్రిని హత్యచేశారు.

ప్రభుత్వ పాఠశాలలు ప్రజల డబ్బుతో నడుస్తాయి. అక్కడ చదువుతున్న పిల్లలే దేశ భవిష్యత్తు. కాబట్టి పాఠశాలల పరిస్థితిపై ప్రశ్నించే హక్కు సమాజానికి ఉంది. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఆ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎంతమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు, ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎన్ని తరగతి గదులు ఉన్నాయి, తాగునీరు అందుబాటులో ఉందా, టాయిలెట్లు పనిచేస్తున్నాయా, విద్యుత్ ఉందా, ఫ్యాన్లు పనిచేస్తున్నాయా, కంప్యూటర్లు పనిచేస్తున్నాయా, ఇంటర్నెట్ ఉందా, పాఠశాలకు ఎన్ని నిధులు వస్తున్నాయి, ఎంత ఖర్చుచేస్తున్నారు, ఏ మరమ్మతులు పెండింగ్‌లో ఉన్నాయి లాంటి వివరాలు తెలుసుకునే హక్కు ప్రజలకుంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తే, సీజేపీయే కాదు, ఏ రాజకీయ పార్టీకి కూడా బయపడాల్సిన అవసరముండదు. కానీ వాస్తవాలను దాచిపెట్టేందుకు భౌతిక దాడులకు దిగడం, పాఠశాలల్లోకి ఎవరినీ అనుమతించకుండా ఆదేశాలు జారీచేయడం వల్ల జవాబుదారీతనం నుంచి తప్పించుకుంటున్న ప్రభుత్వాలపై ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశముంది.

సీజేపీ ఆరంభించిన ఈ క్యాంపెయిన్ ప్రభుత్వాలకు గొప్ప అవకాశం. స్కూల్ రీక్ కరో ప్రచారాన్ని అడ్డుకోవడం కంటే దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలపై స్వతంత్ర సామాజిక ఆడిట్ నిర్వహించవచ్చు. అధికారులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, నిపుణులతో కూడిన బృందాలతో పరిశీలన చేయించవచ్చు. UDISE Plus గణాంకాలను వాస్తవాలతో పోల్చుకోవచ్చు. ఎక్కడ సమస్యలున్నాయో గుర్తించి, వాటిని నిర్ణీత గడువులోపల పరిష్కారించాలనే సంకల్పం తీసుకోవచ్చు. అప్పుడు రాజకీయ ఆరోపణలకు బదులుగా ప్రజల ముందు వాస్తవాలు ఉంటాయి.

ఇది రాజకీయ పార్టీల పెత్తనానికి సంబంధించిన వ్యవహారం కాదు, దేశంలో పన్నెండు కోట్లకు పైగా పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నప్పుడు వాళ్లకు చదువుకోవడానికి సరైన వాతావరణం ఉందా అన్నదే అసలు ప్రశ్న. ఒక పాఠశాలకు భవనం ఉండే సరిపోదు. ఆ భవనం సురక్షితంగా ఉండాలి. టాయిలెట్ ఉంటే సరిపోదు. అది పనిచేయాలి. ఇలా విద్యార్థి స్వేచ్ఛగా చదువుకోవడానికి కావల్సిన వాతావరణాన్ని కల్పించాలి.

అందుకే ఇప్పుడు స్కూల్ రీక్ కరో అనే నినాదాన్ని ఎవరు ఎత్తుకున్నారనే దానికంటే, దాని లక్ష్యమేంటనేదే ప్రధానం. ప్రభుత్వాలు జవాబుదారీతనం ప్రదర్శించాలి. పాఠశాలల వాస్తవ పరిస్థితిని స్వతంత్రంగా పరిశీలించాలి. లోపాలను అంగీకరించాలి. అవసరమైన నిధులు కేటాయించాలి. అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని ఎన్నికల ప్రచారానికి మాత్రమే పరిమితం చేయకుండా తమ రాజకీయ అజెండాలో భాగం చేయాలి. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి.

దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతుందంటారు. అందుకే ఆ తరగతి గదిలో అనువైన విద్యా వాతావరణం ఉన్నప్పుడే అక్కడ ఆశావాహమైన భవిష్యత్తు రూపొందుతుంది. అలాంటి వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది.

రచయిత:సీనియర్ జర్నలిస్ట్

అర్రాసు కథా స్వభావం లచ్చవ్వది, స్వరూపం రాజవ్వది

– రాజీ కన్నా

● ఇంటర్వ్యూయర్: చుక్కవంశీ

(సాహిత్య పరిశోధనలో రచనను మాత్రమే విశ్లేషించడం కాకుండా, ఆ రచన వెనుక ఉన్న రచయిత ఆలోచనలు, అనుభవాలు, రచన నేపథ్యం, సామాజిక దృక్పథం వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఎంతో అవసరం. అర్రాసు కథల ఆవిర్భావం, కథల వెనుక ఉన్న ప్రేరణ, పాత్రల నిర్మాణం, తెలంగాణ మాండలిక వినియోగం, స్త్రీ, దళిత జీవిత చిత్రణ, రచయిత్రి సాహిత్య దృక్పథం వంటి అనేక అంశాలపై విలువైన సమాచారం లభించింది. ఈ ఇంటర్వ్యూ అర్రాసు కథాసంపుటిని మరింత లోతుగా అర్థంచేసుకోవడానికి తోడ్పడుతుందనే ఉద్దేశంతో నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక తరపున చుక్క వంశీ నిర్వహించిన ఇంటర్వ్యూ విశేషాలివి...)

1. నమస్కారం మేడమ్. మీ నూతన కథా సంపుటి అర్రాసు గురించి మీతో చర్చించడం చాలా సంతోషంగా ఉంది. సాధారణంగా ఒక పుస్తక ప్రచురణకు ముందు విభిన్న శీర్షికలను పరిశీలిస్తారు. ఈ పుస్తకానికి అర్రాసు కాకుండా మరేదైనా ప్రత్యామ్నాయ శీర్షికను ముందే నిర్ణయించారా? లేదా ప్రారంభం నుండి ఇదే మీ మొదటి ఎంపికా?

నమస్కారం. లేదండీ, ఈ పుస్తకానికి ప్రారంభం నుండి అర్రాసు అనే శీర్షికను మాత్రమే అనుకున్నాం. వేరే ఏ ఇతర పేర్లను మేము పరిశీలించలేదు. ఇదే పేరును ఖరారు చేశాము.

2. మీ జననం, విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం గురించి కొన్ని వివరాలు తెలియజేస్తారా?

తప్పకుండా. నా స్వస్థలం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం, తాళ్లపేట నా సొంత గ్రామం. మాది గిరిజన ప్రాంతం. మా నాన్నగారి పేరు భూమయ్య, అమ్మ పేరు లక్ష్మి. నేను డిసెంబర్ 31, 1989 పుట్టాను. పాఠశాలలో చేర్చే సమయంలో మా నాన్నగారికి తెలియక ఆ రోజు తేదీనే నమోదు చేయించారు. మా కుటుంబంలో ఎవరికీ సాహిత్య నేపథ్యం లేదు. మా నాన్నగారు చాలా సంప్రదాయబద్ధంగా ఉండేవారు. మాది వ్యవసాయ కుటుంబమే. మా నాన్న రోడ్లు, భవనాల శాఖలో గ్యాంగ్ మజ్దూర్ గా పని చేసి పదవీ విరమణ చేశారు. ఉద్యోగం ఉన్నప్పటికీ ఆయన వ్యవసాయాన్ని వదల్లేదు. నా విద్యాభ్యాసం విషయానికి వస్తే, నేను ఎమ్మెస్సీ జువాలజీ పూర్తి చేశాను. ఆ తర్వాత ఫిజికల్ ఫిట్‌నెస్, న్యూట్రిషన్, థియేటర్ కోర్స్, ఎల్.ఎల్.బి. వంటి కోర్సులు చేశాను. పదవ తరగతి మా ఊరి (తాళ్లపేట) ప్రభుత్వ పాఠశాలలో చదివాను. ఇంటర్మీడియట్(Bi.P.C) వరంగల్ లోని ఎస్.వి.ఎస్. కళాశాలలో చదివాను. మా మేనమామ డాక్టర్ కావడంతో నేను కూడా డాక్టర్ కావాలని బైపీసీ తీసుకున్నాను, కానీ కుదరలేదు. డిగ్రీ (B.Sc) లక్సెట్టిపేటలో పూర్తి చేశాను. పీజీ (M.Sc. Zoology) హైదరాబాద్ నారాయణగూడలోని భవాన్స్ న్యూ సైన్స్ కళాశాలలో చేశాను.

3. చాలా సంతోషం. అయితే ఈ సంపుటిలోని అన్ని శీర్షికల కంటే, కేవలం ఈ అర్రాసు అనే పేరునే శీర్షికగా ఎంపిక చేయడానికి గల ప్రత్యేక కారణం లేదా సాహితీ నేపథ్యం ఏమిటి?

నేను ఈ సంపుటిలో రాసిన కథలన్నింటిలోకి అర్రాసు నాకు వ్యక్తిగతంగా చాలా నచ్చిన కథ. అంటే, ఒక కథకు ఉండాల్సిన సరైన ప్రారంభం, సరైన ముగింపు ఇవన్నీ ఈ కథలో చాలా పర్‌ఫెక్ట్‌గా, సంపూర్ణంగా కుదిరాయనే సంతృప్తి నాకు కలిగింది. అంతేకాకుండా, పబ్లిషర్స్ కూడా ఈ కథాంశం, పేరు చాలా బాగున్నాయని, దీన్నే పుస్తక శీర్షికగా పెడదామని సూచించారు. అలా అందరి సహకారంతో ఈ పేరు ఖరారైంది.

4. ఈ పుస్తకంలో మీకు బాగా నచ్చిన కథ ఏది? ఎందుకు?

ఇందులో నాకు బాగా నచ్చిన కథ అర్రాసు. ఎందుకంటే అర్రాసు నాకు వ్యక్తిగతంగా చాలా నచ్చిన కథ. అంటే, ఒక కథకు ఉండాల్సిన సరైన ప్రారంభం, సరైన ముగింపు ఇవన్నీ ఈ కథలో చాలా పర్‌ఫెక్ట్‌గా, కుదిరాయనే సంతృప్తి నాకు కలిగింది. అలాగే కథాసారాంశం, ఆ రోజుల్లో ఒక మనిషిని అర్రాసు పాడడం విచిత్రంగా అనిపించింది. అదే ఆ రోజున పెద్ద శిక్షగా ఉండడం, కథనశిల్పం ఇలా ఉండడం వల్ల నచ్చింది.

5. ఈ సంపుటిలో "ఇంకాస్త మెరుగ్గా రాసి ఉంటే బాగుండేది" అని మీకు అనిపించిన కథ లేదా మీకు కొంత అసంతృప్తిని మిగిల్చిన కథ ఏదైనా ఉందా?

నేను రాసిన కథలలో ఇంకాస్త మెరుగ్గా, మరింత లోతుగా రాసి ఉండాల్సింది అనిపించిన కథ నా మొదటి కథ అయిన భీమి. ఆ కథను ఇంకా బాగా విస్తరించి రాసి ఉంటే బాగుండేదనే భావన నాకు ఎప్పుడూ ఉంటుంది. బహుశా అది నా తొలి కథ కావడం వల్ల ఆనాటి పరిణతికి అలా వచ్చిందేమో తెలియదు కానీ, ఆ అసంతృప్తి కొద్దిగా ఉంటుంది.

6. మీ అర్రాసు పుస్తకంలో మీరు గ్రామీణ, ప్రాంతీయ మాండలికాన్ని చాలా అద్భుతంగా, సహజసిద్ధంగా ఉపయోగించారు. ఈ పుస్తకం ఖచ్చితంగా అవార్డుల రేసులో నిలవదగినదే. అయితే, మీ సాహిత్య ప్రయాణంలో దాదా (బ్రహ్మంగారు) గారి పాత్ర చాలా కీలకమైనదని ఒక యూట్యూబ్ పోడ్‌కాస్ట్‌లో కూడా మీరు వారి గురించి ప్రస్తావించారు. వారిని గురించి చెప్పండి?

నేను పెరిగిన గ్రామీణ వాతావరణం పూర్తిగా పితృస్వామ్య ధోరణులతో కూడుకున్నది. ఉన్నత చదువుల కోసం నేను హైదరాబాద్ వస్తానని ఎప్పుడూ ఊహించలేదు. కేవలం వివాహ బంధాల నుండి విముక్తి పొంది, చదువుకోవాలనే లక్ష్యంతోనే ప్రవేశ పరీక్ష రాసి ఇక్కడికి వచ్చాను. అయితే, సాహిత్య సృజనలో నాకు బ్రహ్మంగారి పరిచయం ఒక సరికొత్త దృక్పథాన్ని ఇచ్చింది. ఒక తండ్రి అందించే ఆదరణ, ప్రోత్సాహం ఎలా ఉంటాయో ఆయన వ్యక్తిత్వంలో నేను చూశాను. మన మనసులో ఉండే ఒక ఆదర్శవంతమైన పితృమూర్తి భావనకు ఆయన ప్రతీకగా నిలిచారు. అందుకే నేను ఆయనను ఆత్మీయంగా డాడా అని సంబోధిస్తాను.

7. ఈ కథా సంపుటిని పుస్తక రూపంలోకి తీసుకురావాలనే ఆలోచన ఎవరిది?

నిజానికి ఈ ఆలోచన పూర్తిగా మా డాడాదే. నేను ప్రారంభంలో రాసిన రెండు మూడు కథలను చూసి, ప్రాంతీయ మాండలికంలో రచనలు బాగా రాస్తున్నావని ఆయన నన్ను అభినందించారు. "కథలన్నీ పూర్తయ్యాక నాకు తెలియజేయి, మనం ఒక సంపుటిగా ప్రచురిద్దాం" అని ప్రోత్సహించారు. చివరికి నా జన్మదినం సందర్భంగా ఆయనే స్వయంగా ఐదు కాపీలను ప్రత్యేకంగా ముద్రించి నాకు సర్ప్రైజ్ గిఫ్ట్‌గా అందించారు. ఆ రకంగా ఈ గ్రంథం వెలుగుచూసింది.

8. ఈ సంపుటిలోని అర్రాసు, అగ్గిపూల దారి వంటి కథల చారిత్రక నేపథ్యం ఏమిటి? అవి నిజాం కాలం నాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తాయని విన్నాము కదా?

అవును, ఇవన్నీ చారిత్రక సత్యాలే. అర్రాసు కథ నాటి నిజాం పాలన, పోలీస్ వ్యవస్థల నేపథ్యంలో సాగుతుంది. మా అమ్మమ్మ చిన్నతనంలో (దాదాపు 1930-40 ల కాలంలో) చూసిన సంఘటనలను మా అమ్మ (లచ్చవ్వ) ద్వారా నేను తెలుసుకొని, కథగా మలిచాను. అలాగే అగ్గిపూల దారి కథ 1976లో తపాలాపూర్‌లో జరిగిన చారిత్రాత్మక ఎన్‌కౌంటర్ సంఘటనను రాశాను. నాటి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను బేస్ చేసుకొని రాశాను. అలాగే ముగింపును వాస్తవ సంఘటనతో రాశాను.

9. అసలు మీరు తెలుగు సాహిత్య రంగంలోకి, ముఖ్యంగా ప్రాంతీయ మాండలిక రచనల్లోకి ప్రవేశించడానికి గల ప్రేరణ ఏమిటి?

నేను సాహిత్య రంగంలోకి అనుకోకుండానే ప్రవేశించాను. కానీ చిన్నప్పటి నుండి పుస్తకాలు చదవడంపై నాకు ఆసక్తి ఉండేది. తెలంగాణ ఉద్యమ కాలంలో మన మాండలికాన్ని ఒక రకమైన తక్కువ చూపుతో చూసేవారు. అయితే నా మిత్రుడు అఖిల్ తన రచనలలో ప్రాంతీయ మాండలికాన్ని అద్భుతంగా ఉపయోగించడం చూసి, నేను కూడా మన భాషలోనే రాయాలని నిశ్చయించుకున్నాను. ఆ తర్వాత కొలిమి పత్రిక నిర్వాహకులు శివరాత్రి సుధాకర్ గారు (తెలుగు లెక్చరర్) నన్ను ప్రోత్సహించి కథ రాయమనడంతో, మా అమ్మ చెప్పిన జ్ఞాపకాల ఆధారంగా నా తొలి కథ భీమిని రాశాను. ఆ రకంగా టిఎల్‌సి (తెలుగు లిటరరీ కాంగ్రెస్), ఉస్మానియా విశ్వవిద్యాలయం సభలలో డా. చంద్రయ్య శివన్న, ప్రొఫెసర్ సి. కాశీం ఆహ్వానం మేరకు పాల్గొనే అవకాశం లభించింది. శాతవాహన విశ్వవిద్యాలయాలు నిర్వహించిన సాహిత్య సదస్సులలో పాల్గొన్నాను. మొదటగా నేను వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్నాను. ఆ తర్వాత కర్ణాటక నుండి కూడా ఆహ్వానించారు. కానీ ఇతర కారణాల వల్ల పోలేధు.

10. సాహిత్య పుస్తకాలు చదివిన మిమ్మల్ని ఎక్కువగా ప్రభావితం చేసిన కథా సంపుటి లేదా కథ ఏది?

నన్ను ప్రభావితం చేసిన అద్భుతమైన నవల అడవి బ్యాక్‌గ్రౌండ్ లో సాగే అతడు అడవిని జయించాడు. ఎందుకంటే నా ప్రాంతం ఆటవీప్రాంతం. అలాగే వనవాసి కూడా నాకు చాలా ఇష్టం. కథల పరంగా చూస్తే, అల్లం రాజయ్య గారి విప్లవాత్మక రచనలు, ముఖ్యంగా మునిశాంతంపల్లె, వంటి కథలు నన్ను సాహిత్యపరంగా, మాండలిక అధ్యయనం పరంగా ఎంతగానో ప్రభావితం చేశాయి. అప్పటి నుండి మాండలికం చదవడం ప్రారంభించాను.

11. ఈ సంపుటిలోని ఏడు కథలు కేవలం మంచిర్యాల ప్రాంతీయ జీవనాన్ని మాత్రమే ప్రతిబింబిస్తాయా? అలాగే ఇందులో దొరల అణచివేతను చూపించే క్రమంలో అక్కడక్కడా ఉపయోగించిన కఠినమైన లకార పదాలు (తిట్లు) లేదా దూషణల వెనుక ఉన్న సాహిత్య ఆంతర్యం ఏమిటి?

ఇందులో మెజారిటీ కథలు మంచిర్యాల ప్రాంతానికి చెందినవే అయినప్పటికీ, వంద నోటు అవమానం కథ నెల్లూరు హాస్టల్ నేపథ్యంలో సాగుతుంది. ఇక మీరు అడిగిన లకార పదాల (భాషా ప్రయోగాల) విషయానికి వస్తే సమాజంలో నాటి భూస్వామ్య దొరల వ్యవస్థలో అణచివేతకు గురైన నౌకరులను లేదా శ్రామికులను వారు గౌరవప్రదమైన పదాలతో సంబోధించేవారు కాదు. నాటి సామాజిక యథార్థాన్ని, క్రూరత్వాన్ని కళ్లకు కట్టాలంటే ఆయా పాత్రల చేత సహజమైన భాషను మాట్లాడించక తప్పదు. అందువల్లనే ఆ తిట్లను గ్రంథంలో యథాతథంగా ఉంచాను తప్ప, అది అశ్లీలత కాదు, కేవలం నాటి సామాజిక సహజత్వ ప్రతీక మాత్రమే.

12. ఈ కథలో కమ్యూనిస్టుల పాత్రను ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఏమిటి మేడం?

నిజం చెప్పాలంటే, అవి వాస్తవంగా జరిగిన సంఘటనలు. నేను ఆదిలాబాద్ జిల్లా అడవి ప్రాంతంలోనే పెరిగాను. కథలో అడవికి వెళ్లినప్పుడు లేదా పొలాల వద్ద ఉన్నప్పుడు వారు కనిపిస్తూ ఉండేవారు. ఒకప్పుడు అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లే వారికి వారు తరచూ ఎదురవుతుండేవారు. ఆ వాస్తవికత ఆధారంగానే ఆ పాత్రలను తీసుకున్నాను.

13. అగ్గిపూల కథ ద్వారా పాఠకులకు మీరేం చెప్పాలనుకుంటున్నారు? దొరలను చంపింది ఎవరనేది కథ ప్రారంభంలో స్పష్టంగా పేర్కొనలేదు కదా?

అవును, ఆ సంఘటన జరిగిన తర్వాత చాలామంది నన్ను ప్రశ్నించారు. తపాలాపూర్ సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ కథ రాశారా అని అడిగారు. నేను ప్రత్యేకంగా ఎటువంటి సందేశం ఇవ్వాలని అనుకోలేదు, సమాజంలో జరిగినటువంటి యథార్థ సంఘటనల ఆధారంగా దొరలను ఎలా ఎదిరించారనేది మాత్రమే కథగా రాశాను.

14. రాటిబాయి కథ చివర్లో "ఇప్పుడు ఏ దేవునికి బుద్ధి పుట్టిందో, ప్రాజెక్టులు, కాలువలు, పొద్దంతా కరెంటు" అని రాశారు కదా! ఆ సమయంలో తెలంగాణ ప్రాంతంలో ఏ రాజకీయ/నాయకులు అధికారంలో ఉన్నారో వివరిస్తారా?

అది నేను ఇటీవలి కాలంలో, అంటే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాసిన కథ. అంటే టీఆర్ఎస్ పార్టీ ఉన్నది. అంతకుముందు ఆ ప్రాంతంలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం సరిగా ఉండేవి కావు. కడెం ప్రాజెక్టు ద్వారా కేవలం ఒక పంటకు మాత్రమే నీరు అందేది. ఆ తర్వాత కాలంలో వచ్చిన మార్పులను మా అమ్మగారితో సాధారణంగా మాట్లాడుతున్నప్పుడు ఆమె వివరించారు. ఒకప్పుడు మిరపకాయల కోసం ఎక్కడికో వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇక్కడే అన్ని వసతులు లభిస్తున్నాయని ఆమె చెప్పిన విషయాల ఆధారంగా 2019 లేదా 2021 ప్రాంతంలో ఆ కథను రాశాను.

15. మీ పుస్తకావిష్కరణ రోజున అర్రాసు పుస్తకంపై అతిథులు ఎటువంటి సందేశాలు ఇచ్చారు మేడం?

గోరేటి వెంకన్న గారు నా కథలపై ఎంతో ప్రశంసలు కురిపించారు. నేను ఇంత లోతైన సామాజిక అంశాలను కథలుగా రాస్తానని వారు ఊహించలేదని అన్నారు. పుస్తకం చదివిన తర్వాత, ఆరాటంతో కన్నీళ్లు వచ్చాయని ఫోన్ చేసి మాట్లాడారు. అలాగే రాటిబాయి కథలో బుచ్చవ్వ కొడుకు అన్నల్లో కలిసినది చదివి అల్లం రాజయ్య గారు కూడా వారి పాత జ్ఞాపకాలను, అండర్‌గ్రౌండ్ ఉద్యమ రోజులలో వారి కుటుంబాలు పడిన బాధలను గుర్తుచేసుకున్నారు.

16. మీరు పనిచేస్తున్న పత్రికలోనే మీ పుస్తకానికి సంబంధించిన సమీక్షలు లేదా విమర్శలు రావడం పట్ల మీ స్పందన ఏమిటి?

అక్కల చంద్రమౌళి గారు పుస్తకాన్ని పూర్తిగా చదివిన తర్వాత సమీక్షను పంపారు. నాగేంద్ర గారు ఈ మధ్య కాలంలో, అంటే పుస్తకం విడుదలైన రెండు నెలల తర్వాత విమర్శను వ్రాసి పంపారు. ఎందుకంటే అక్కల చంద్రమౌళి గారికి నా నేపథ్యం, నేను ఎక్కడి నుండి వచ్చానో తెలుసు కాబట్టి వారు ఆ కోణంలో వ్రాశారు. నేను ఎవరినీ ప్రత్యేకంగా వ్రాయమని అడగలేదు. ఒకరోజు ఉదయం నేను లేచేసరికి సోషల్ మీడియాలో నా పుస్తకానికి సంబంధించిన పోస్టులు కనిపించాయి. అది చూసి నేను కొంత ఆశ్చర్యానికి, ఆనందానికి లోనయ్యాను.

17. మీరు భవిష్యత్తులో మరికొన్ని పుస్తకాలు వ్రాయాలనుకుంటున్నారు కదా, అవి ఎటువంటి వస్తువు లేదా కథాంశంతో కూడి ఉంటాయి?

నేను సూర్పనకు సంబంధించిన ఒక కథ రాయాలనుకున్నాను. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అటువంటి సున్నితమైన అంశాల జోలికి ఇప్పుడు వెళ్ళకూడదని నిర్ణయించుకున్నాను. మరికొన్ని ఇతర రచనలు చేసిన తర్వాత దాన్ని పూర్తి చేయమని కొందరు సూచించారు. అందువల్ల ప్రస్తుతం గ్రామీణ నేపథ్యంతో కూడిన మరొక నవలను వ్రాయడం ప్రారంభించాను.

17. తెలుగు సాహిత్యంలో మీకు బాగా నచ్చిన రచయితలు లేదా కవులు ఎవరు? వారి గురించి పంచుకోగలరా?

తెలుగు సాహిత్యంలో నాకు నచ్చిన వారు చాలా మంది ఉన్నారు. ముఖ్యంగా మాండలికంలో రచనలు చేసిన వారంటే నాకు చాలా ఇష్టం. రాయలసీమ మాండలికం అయినా, ఇతర ప్రాంతాలదైనా సరే, ఆ రచనలు చదువుతుంటే మనం నేరుగా ఆ ప్రాంతానికి వెళ్ళినట్లు, ఆ పాత్రలతో మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. ఇటువంటి మాండలిక రచనలు చదివినప్పుడు అవి కేవలం కథలా కాకుండా, ఆ వాతావరణాన్ని మన కళ్ళముందు ఉంచుతాయి. ఇవి కాకుండా, నేను మాండలిక రచనలు చదవడానికి ముందు నన్ను బాగా ఆకట్టుకున్న పుస్తకం స్వరూప్ తోటడ గారి అన్ టైటిల్డ్ అనే వచన కవిత్వం. ఆ పుస్తకం నాకు చాలా ఇష్టం. అంతకుముందు కూడా చాలా మంది రచనలు చదివినప్పటికీ, నేను వ్యక్తిగతంగా కొనుగోలు చేసి భద్రపరుచుకున్న పుస్తకం అది. ఇంకా మైదానం, అతడు అడవిని జయించాడు, ఎండపల్లి భారతి గారివి ఇలా అనేక పుస్తకాలు చదివాను. సాహిత్యంలో నాకు చాలా మంది రచయితలు ఇష్టం.

18. మేడం, అర్రాసు కథా సంపుటిలో యాభైకి పైగా పాత్రలు ఉన్నాయి కదా. ఈ పాత్రలన్నీ వాస్తవ జీవితం నుండి సేకరించినవా లేక కల్పితాలా?

అవును, అందులో చాలా పాత్రలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన పాత్రలన్నీ వాస్తవ జీవితంలో ఉన్న వ్యక్తుల ఆధారంగా రూపుదిద్దుకున్నవే. అయితే, కొన్ని పాత్రల పేర్లు నాకు స్పష్టంగా గుర్తులేకపోవడం వల్ల వాటి పేర్లు మార్చవలసి వచ్చింది. కానీ, ఆ పాత్రల స్వభావం, ప్రవర్తన అంతా నిజ జీవితంలో జరిగినవే. ఇంకా కొన్ని పాత్రలను చేర్చవలసి ఉంది, కానీ కథల

పరిమాణం పెద్దదవుతుందనే ఉద్దేశంతో వాటిని తీసుకోలేదు.

19. మేడం, మీరు చలనచిత్ర రంగంలో ఆర్టిస్ట్‌గా, అలాగే పరేషాన్ వంటి సినిమాల్లో డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా పనిచేశారు కదా! ఆ రంగంలోకి మీ ప్రవేశం ఎలా జరిగింది?

గోపీకృష్ణ, మైన షార్ట్ ఫిలిం తీసిన విజయ్ వంటి మిత్రులు షార్ట్ ఫిలిం తీస్తున్నప్పుడు వారితో పరిచయం ఏర్పడింది. మైనకి ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం అవార్డులు వచ్చినయ్. పరేషాన్ సినిమా పూర్తిగా తెలంగాణ, ముఖ్యంగా మంచిర్యాల పరిసర ప్రాంతాల నేపథ్యంలో సాగుతుంది కాబట్టి, ఆ మాండలికంపై పట్టు ఉన్నవారి కోసం వారు చూశారు. ఆ సమయంలో కరోనా కారణంగా ఇతర ఆర్టిస్ట్‌లు అందుబాటులో లేకపోవడంతో, నాకు తెలిసిన మిత్రుల ద్వారా ఆ అవకాశం వచ్చింది.

20. మీరు కొంతకాలం ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఆ తర్వాత జర్నలిజం వైపు వచ్చారు కదా. ఈ మార్పుకు గల కారణం ఏమిటి?

నేను కేవలం కొంతకాలం కాదు, దాదాపు ఏడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేశాను. జర్నలిజం వైపు రావడం విషయానికి వస్తే, జర్నలిజం చేయాలని డిగ్రీ నుండి ఉంది. నేను పి.జి ఎంట్రన్స్ వ్రాయడానికి ముందే ఈనాడు జర్నలిజం స్కూల్‌కు దరఖాస్తు చేసుకున్నాను. అయితే ఆ ప్రక్రియ ఆలస్యం కావడంతో, నేను పి.జి పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. ఆ తర్వాత ఆ అవకాశం వచ్చింది. నిజానికి నాకు డిగ్రీ చదువుతున్నప్పటి నుంచే జర్నలిజం చేయాలనే ఆసక్తి ఉండేది. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు ప్రైవేట్ కళాశాలల్లో మహిళా అధ్యాపకులకు, పురుష అధ్యాపకులకు మధ్య ఉండే అసమానతలు, పని గంటల ఒత్తిడి నన్ను చాలా ఇబ్బంది పెట్టాయి. సమాన పనికి సమాన వేతనం లేకపోవడం, అదనపు బాధ్యతలు అప్పగించడం వంటి కారణాల వల్ల నేను ఆ వృత్తిని వదిలిపెట్టాను. ఆ తర్వాత కొంతకాలం ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యాను. మా వారికి ఫిట్‌నెస్ సెంటర్ ఉండటంతో, నేను కూడా ఫిట్‌నెస్‌లో ఒక కోర్సు పూర్తి చేసి అందులో ఫిట్‌నెస్ ట్రైనర్ గా చేశాను. ఆ తర్వాత ఆదాన్ ఇండియా ద్వారా నా జర్నలిజం ప్రయాణం ప్రారంభమైంది. అలాగే దిశా పేపర్లో కూడా పనిచేశాను. నాకు జర్నలిజంలో ప్రత్యేక అర్హత లేనప్పటికీ, భాషపై ఉన్న పట్టు, రాజకీయాలపై ఉన్న అవగాహన కారణంగా నాకు ఆ అవకాశం లభించింది. నేను జర్నలిజం కోర్సు ఏదీ ప్రత్యేకంగా చేయలేదు. రాజకీయ ఇంటర్వ్యూలు, వార్తా కవరేజ్ చేయడం వల్ల నాకు ఆ రంగంలో పనిచేయడం సులభమైంది.

21. సరే మేడం, గతంలో మీరు దిశ పత్రికలో పని చేశారని తెలిసింది. ప్రస్తుత వార్తాపత్రికలు రాజకీయ కరపత్రాలుగా మారాయనే వాదన ఉంది. ఇది నిజమేనా? మీ అభిప్రాయం ఏమిటి?

వార్తాపత్రికలు రాజకీయ కరపత్రాలుగా మారాయనే విషయంలో కొంత నిజం ఉంది. కొన్ని పత్రికలు మారాయి, కానీ కొన్ని పక్షపాతం లేకుండా తటస్థంగా ఉన్నాయి. ప్రస్తుతం వార్తాపత్రికలు చదివే వారి సంఖ్య తగ్గింది. దీనివల్ల పత్రికలకు పూర్వంలా ఆదాయం రావడం లేదు. పత్రికలు నడవాలంటే ప్రకటనలు చాలా అవసరం. ప్రభుత్వం నుండి లేదా రాజకీయ నాయకుల నుండి వచ్చే ప్రకటనల కోసమే కొన్ని పత్రికలు వారి అనుకూల వార్తలు రాస్తున్నాయి, మరికొన్ని వార్తలను విస్మరిస్తున్నాయి. ఇటీవల ఓ మంత్రి గారి విషయంలో కూడా ఇదే జరిగింది. ప్రధాన స్రవంతి మీడియా దీనిపై ఎందుకు పెద్దగా దృష్టి పెట్టలేదంటే, ఆయన అన్ని పత్రికలకు, అన్ని మీడియా సంస్థలకు ప్రకటనలు ఇస్తారు. అందుకే వారు ఆ విషయాన్ని ప్రముఖంగా తీసుకోలేదు. కాబట్టి, పత్రికలు కరపత్రాలుగా మారాయనే మాటను నేను పూర్తిగా కాదనలేను. అందులో కొంత నిజం ఉంది.

22. మీరు రచయిత్రిగా, ఆర్టిస్‌గా, ఉపాధ్యాయురాలిగా, జర్నలిస్టుగా, కాబోయే న్యాయవాదిగా బహుముఖ ప్రజ్ఞను చాటుతున్నారు. భవిష్యత్తులో మీరు ఏ వృత్తిలో కొనసాగాలని అనుకుంటున్నారు? ఎందుకు?

నేను ఉపాధ్యాయురాలిగా అయితే వెళ్ళను. జర్నలిజం లేదా చలనచిత్ర పరిశ్రమలో కథా రచయిత్రిగా, దర్శకత్వ విభాగంలో స్థిరపడాలనే ఆలోచన ఉంది. అయితే దానికి కొంత సమయం పడుతుంది. ఈ రెండింటిలో ఏదో ఒక రంగాన్ని ఖచ్చితంగా ఎంచుకుంటాను.

23. మీరు న్యాయశాస్త్రం కూడా చదివారు కదా, మరి ఆ వృత్తిపై ఆసక్తి లేదా?

నిజానికి నాకు న్యాయశాస్త్రం చదవాలని మొదట్లో ఆసక్తి లేదు. మా జీవిత భాగస్వామి నన్ను లా చదవమని

ప్రోత్సహించారు. ప్రవేశ పరీక్ష రాశాను, మంచి ర్యాంక్ రావడంతో కళాశాలలో చేరాను. కానీ, చదవడం ప్రారంభించిన తర్వాత నాకు న్యాయశాస్త్రంపై గౌరవం, ఆసక్తి పెరిగాయి. చట్టాలు సమాజానికి ఎంత అవసరమో, ప్రజలు వాటిని ఎలా ఉపయోగించుకుంటున్నారో అర్థమైంది. ఇప్పుడు నాకు ఒక ఆశయం ఉంది. మా ప్రాంతంలో గిరిజనులు ఎక్కువ. వారికి తమ కనీస హక్కుల గురించి కూడా అవగాహన లేదు. వారి కోసం ఒక ఉచిత న్యాయ సహాయ కేంద్రం (Legal Aid Centre) ఏర్పాటుచేయాలనుకుంటున్నాను. గిరిజనుల సమస్యలు ఎక్కువగా భూములకు సంబంధించినవి ఉంటాయి. కాబట్టి, రాజకీయ నాయకుల నుండి అనేక సవాళ్లు ఎదురవుతాయని కొందరు చెప్పారు. అయినా సరే, నేను ఖచ్చితంగా ఆ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాను.

24. మీరు ఇన్ని కోర్సులు చేశారు, తర్వాత ఈ పుస్తకం రాశారు. దీని వెనుక మీ భర్త గారి పాత్ర, ప్రోత్సాహం గురించి మాతో పంచుకోండి.

అసలు ఆయన వల్లనే ఇన్ని కోర్సులు చేయగలిగాను. తను ఫిట్‌నెస్ ట్రైనర్. ఆయన మద్దతు లేకపోతే నేను ఏదీ చేయలేకపోయేదాన్ని. ఆయనే అన్ని ఫీజులు కట్టి, అన్నింటికీ ప్రోత్సహించారు. చివరికి నేను గొల్లరామవ్వ నాటకం, థియేటర్ కోర్సు చేసినప్పుడు కానీ, వీటన్నింటికీ కూడా తనే మా బాబును చూసుకునేవారు. తన ప్రోత్సాహం లేకుండా నేను ఇవేవీ చేయలేను. అన్నింటిలోనూ నన్ను ప్రోత్సహించేవారు. "నువ్వు బాగా చదువుతావు కదా, చదువుకో, నేను మద్దతు ఇస్తాను అని చెప్పేవారు. చదవమని ప్రోత్సహించేవారు. ఆయన గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే... నాకు మంచి స్నేహితుడు. నన్ను అంత బాగా అర్థం చేసుకున్న స్నేహితుడు ఎవరైనా ఉన్నారంటే మొదటి స్థానం తనదే.

25. మీ విజయానికి మీ తల్లి గారి పాత్ర ఎలాంటిది?

మా అమ్మకు చదువుకోవడం అంటే చాలా ఇష్టం. తను చదువుకోలేదు. ఆమె పాఠశాలకు వెళ్ళలేదు కానీ, వాళ్ళ అన్నదమ్ములు చదువుకుంటున్నప్పుడు వాళ్ళ దగ్గర కూర్చొని అన్నీ నేర్చుకుంది, పుస్తకాలు చదవడం నేర్చుకుంది. మాండలికమైనా సరే చదివేది. ఇంగ్లీష్ పదాలు చెప్పేది. ఇంగ్లీష్‌లో "హౌ ఆర్ యు?", "వాట్ ఆర్ యు డూయింగ్?" ఇట్లాంటివి కొన్ని చిన్న చిన్న వాక్యాలు చెప్పేది. ఇంకా లెక్కలువచ్చు ఆమెకు. తను చదువుకోలేదు కదా, అందుకే నన్ను బాగా చదువుకోవాలని చెప్పేది. నా పుస్తకం, ఒకరోజు నేను ఆమె ఇంటి దగ్గర ఉన్నప్పుడు... ఇక్కడే హైదరాబాద్‌లో... నేను ఆఫీస్‌కు వెళ్ళి వచ్చేసరికి నా పుస్తకం చదివి ఏడ్చింది. "నువ్వు అలా ఎలా రాయగలిగావు? నాకు ఎంత దుఃఖం వచ్చిందో తెలుసా" అని చెప్పి రాగానే చాలా ఏడ్చింది. "నువ్వు చెప్పిందే కదా నేను రాశాను, ఇందులో నేను కొత్తగా ఏం రాయలేదు, నువ్వు చెప్పిన కథలే ఇవి" అని చెప్పాను. తను చాలా సంతోషపడింది. అలాగే మా కుటుంబంలో ఎవరికీ సాహిత్య నేపథ్యం లేదు. మా నాన్నగారు చాలా సంప్రదాయబద్ధంగా ఉండేవారు. నా పుస్తకం విడుదలయ్యే వరకు నేను రాస్తాననే విషయం మా నాన్నగారికి తెలియదు, కానీ మా అమ్మకు తెలుసు. పుస్తకం చూశాక మా నాన్నగారు చాలా ఆశ్చర్యపోయారు.

26. గోండు - దండారి ముచ్చటలో ఆదివాసుల గురించి రాశారు కదా! ఆదివాసుల గురించి మీ మాటల్లో చెప్పండి.

అవును, విజయ్ కుమార్, సంతోష్ కుమార్ అని నిజామాబాద్‌లో ఉంటారు. ఆయనకు అక్కడ ఒక అంతర్జాతీయ పాఠశాల ఉంది. వాళ్ళు నాగోబా జాతరకు వెళ్ళారు. ఆయన నెల్లూరుకు చెందినవారు. నెల్లూరు వ్యక్తికి అది మొదటిసారి ఇదంతా కూడా. అప్పుడు తను చాలా బాగుందన్నారు. "గోండులు అనేవాళ్ళు చాలా భిన్నంగా ఉంటారు" అని చెప్పాను. ఎందుకో నాకు గోండులంటే అంత ఇష్టమో తెలియదు కానీ, నాకైతే చాలా చెప్పలేని మమకారం ఉంటుంది వాళ్ళంటే.

ఇంటర్వ్యూయర్:
ఎం.ఏ. తెలుగు విద్యార్థి, నిజాం కళాశాల

నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.
వెబ్ పేజీ: https://nadustunnatelangana.com

సాహిత్య
పరిశోధన

పాయగా కాదు ప్రవాహంగానే - తెలంగాణ భావకవిత్వం

డి. ప్రకాష్

పరిశోధన పత్ర సంక్షిప్తి:

ఇవాల్టికి తెలంగాణా ఆధునిక సాహిత్యంలో భాగంగా, వరుసగా అన్ని కవిత్వోద్యమాల పేర్లు ప్రస్తావన వచ్చినప్పటికీ, తెలంగాణ భావ కవిత్వం గూర్చి ఊసే ఎత్తరు. ఒకవేళ వచ్చినా తమది కానట్టుగా గాలికొదిలేస్తారు. పైగా తెలంగాణాలో భావ కవిత్వ నిర్మాణం జరిగిందా? అని, తెలంగాణలో భావ కవిత్వం లేదని లేవదియ్యడం? అపప్రచారం చెయ్యడం, అబద్దాలు, అపోహలు ఇటువంటి ప్రశ్నలు తెలంగాణ భావ కవిత్వం చుట్టూ అల్లుకున్నాయి. అయితే ఈ ప్రశ్నలకు జవాబుగా తెలంగాణలో భావ కవిత్వం ముమ్మాటికి ఉందని చెప్పడానికి ఈ వ్యాసం కేవలం పరిచయంగానే రాయబడింది. సీమాంధ్ర, కోస్తాంధ్రలో వచ్చిన భావ కవిత్వాన్ని, ఇక్కడి సాహిత్య ప్రమాణాలతో బేరీజు వేయకూడదు. తెలంగాణ భావ కవిత్వానిది ఎప్పటికీ వైవిధ్యమైన నడకే. తెలంగాణలో భావ కవిత్వం పాయగా కాదు ప్రవాహంగానే వచ్చింది అని చెప్పడం నా పరిశోధన వ్యాస ఉద్దేశ్యం.

కీలక పదాలు: తెలంగాణ భావ కవిత్వం, భౌగోళికత, స్థానికత, కాల్పనికత, ప్రకృతి కవిత్వం, కర్షక కవిత్వం.

పరిచయం:

కాలం మారినప్పుడు సాహిత్యంలో రచనా సూత్రాలు మారడం అనివార్యం. మార్పుని కోరే భావాలు సాహిత్యంలో ప్రతిఫలించడం అంటే, సమాజ పురోగమనంలో ప్రజాస్వామిక ఆలోచన ప్రమాణాలు, పరిణామం చెందుతున్నాయని అర్థం చేసుకోవాలి. ఏ సమాజం అయినా, ప్రకృతి అయినా ప్రతీదీ అలాగే ఉండిపోదు, మారుతూ ఉంటుంది. ఆ మార్పులో భాగమైన మనిషి కూడా చైతన్యం పొందకుండా ఉండలేదు. ఇంగ్లీష్ రొమాంటిక్ కవిత్వ ప్రభావంతో వచ్చిన ఆధునిక కవిత్వోద్యమం భావకవిత్వం. పద్య రచనా సౌష్ఠవం మీద, ప్రతిభా పాండిత్యం లేనిదే పైకి రావడానికి వీలులేని రోజులవి. ఐరోపా దేశాల్లో పారిశ్రామిక విప్లవానికి హార్ధిక ప్రతిబింబప్రాయంగా మొదలైన కాల్పనికోద్యమ తాలూకూ ప్రభావం ఇక్కడి కవులను, రచయితలను ఆకర్షించింది.

తొలినాళ్లలో పరిహాసానికి గురై, నెమ్మదిగా కావ్య గౌరవాన్ని పొంది, ప్రాచీన సాహిత్య రీతులకి సర్జరీ చేసింది భావ కవిత్వం. కఠిన ఛందస్సులతో సుదీర్ఘ వర్ణనలకు, అలంకారాల వాసనలద్దడంతో మునిగిపోయిన, ప్రాచీన కావ్య సిద్ధాంతాలకు మర్యాదలు చేయడం భావకవులకు బొత్తిగా నచ్చలేదు. ప్రబంధ కావ్యాల్లో ఉండే అశ్లీల సంయోగ వర్ణనలకు పుల్‌స్టాప్ పెట్టి, అలంకారాలని పరిత్యజించి , అనుభూతిని అందిపుచ్చుకుని, భౌతిక నైసర్గిక విషయాల నుండి అంతరంగ భావన వైపు అడుగులేస్తూ, స్వేచ్ఛా ప్రవృత్తితో గతానుగత కవిత్వాన్ని ధిక్కరించి, నడిచింది భావ కవిత్వం. ప్రబంధాల కాలమంతా ఆధిపత్య బ్రాహ్మణీయ భావజాల వారసత్వ రచనల వాతావరణమే కొనసాగింది. పైగా ప్రబంధాలలో బ్రాహ్మణులు, క్షత్రియులే హీరోలు, అస్పృశ్యులు కావ్య పాత్రలవడానికి అర్హత లేనివారు. మనుచరిత్రలో ప్రవరుడు బ్రాహ్మణుడు, ఇలా వరుసగా అన్ని ప్రబంధాలలోని పాత్రలు, చాతుర్వర్ణ వ్యవస్థ నుంచి అసలు కిందకు దిగవు. కానీ భావకవిత్వం అస్పృశ్యతని, అంటరానివాడికి, గొల్లవానికి ఇతర సామాజిక శ్రమ చేసే కులాల వారికీ కావ్య గౌరవం కల్పించింది. అయితే తెలంగాణ భావకవిత్వంలో పాత్రలకి, కులం పేరు కనిపించకపోవడం వస్తు విషయంలో గొప్ప విప్లవమే. ఇదే వస్తు నవ్యత. నిజానికి కవిత్వానికి ప్రాణ స్పర్శయే ఇతివృత్తం. వస్తువు బాగుంటే శైలి, శిల్పము కాస్త అటుఇటు అయినా కవిత్వంలో లోపమంటూ కనిపించదు. వస్తువును బట్టి అభివ్యక్తి శైలి ఉంటుంది.

భావకవిత్వాన్ని భావ విప్లవమని పిలవొచ్చా? అంటే పిలవొచ్చు. సాంప్రదాయ సాహిత్యంలో లాక్షణికులు ఏర్పరచిన నియమాల్ని కవి ఉల్లంఘించడానికి ఏ మాత్రం వీలులేదు. కానీ, భావకవి కథని పరిత్యజించి అనుభూతినే కావ్య వస్తువుగా మలుచుకున్నాడు. ఇక్కడ కవిత్వానికి అవసరమైన వస్తు, భావరూప నిర్మాణంలో మార్పు వచ్చింది. ఏ సాహిత్యంలోనైనా ముందున్న కవిత్వం కంటే తరువాతి కవిత్వం వస్తువులోను, భావాల్లోను విభిన్నతను ప్రదర్శిస్తుంది. ఇలా భావకవిత్వ ధోరణి సాహిత్యంలో వస్తువులోను, భావాల్లోను సాంప్రదాయక కవిత్వానికి భిన్నమైంది. కనుకనే వేల్చేరు నారాయణరావు భావకవిత్వమనకుండా భావవిప్లవమన్నారు. త్రిపురనేని మధుసూదనరావు కూడా భావకవిత్వాన్ని భావ విప్లవమనడం ఆమోదయోగ్యమేనని అన్నారు. "వస్తువులో, రూప నిర్మాణంలో,

అభివ్యక్తిలో భావకవిత్వం విప్లవం తెచ్చిందంటూనే మీరు భావకవిత్వాన్ని విప్లవం కాదంటున్నారు. ఈ మార్పులు నిజంగా మీరు అంగీకరిస్తే భావకవిత్వంలో గుణాత్మకమైన మార్పు వచ్చినట్టు అంగీకరించినట్టే" (ప్రసాద్, సి. యస్. ఆర్. చెంచయ్య (సంపా), త్రిపురనేని మధుసూదనరావు సాహిత్య సర్వస్వం. 2018: 19) గర్భ, బంధ ఛందో నియమాల్ని, దీర్ఘ సమాస ప్రబంధ బాహుళ్యాన్ని, అలంకార అడ్డుగోడల్ని బద్దలు కొట్టిన weapon భావకవిత్వం. భావకవులు ఒకరిని మించి మరొకరు సుతి మెత్తని, పదబంధాలతో కావ్యాలను రచించారు.

తెలంగాణ భావకవిత్వం ఐడెంటిటీ:

తెలంగాణ ఆధునిక కవిత్వానికి ముఖద్వారం భావకవిత్వం. ఇక్కడి భావకవిత్వం ఎంత వైభవోపేతమైందో, ఎంత వైవిధ్యమైన ప్రతీకలతో, కొత్త పంథాలను త్రొక్కిందో, నూతన ఆధునిక స్వేచ్ఛా భావజాలానికి ఏ రకంగా చోటునిచ్చిందో, తెలంగాణ భావకవిత్వంలో పుష్కలంగా తెలుస్తుంది. తెలంగాణ భాష, యాసను, సంస్కృతిని, తెలంగాణ మట్టి వాసనను దేదీప్యమానంగా సాహిత్యంలో గౌరవంగా ప్రతిష్టించారు. తెలంగాణలో భావకవిత్వం ఆవిర్భవించడానికి వీలులేదని అపోహపడి, 'భావకవిత్వం పాయగానే' వచ్చిందని, తెలంగాణలో భావకవితా యుగం లేదని, శంకిస్తూ వచ్చారు కొందరు సాహిత్యకారులు. ఇలా భావకవిత్వం లేదని లేవదీయడం, అపప్రచారం చేయడం సాహిత్య నేరం. తెలంగాణలో వెలువడిన భావకవిత్వం "పాయగా కాదు, ప్రవాహంగానే వచ్చింది. భావ కవిత్వం లేదన్న వారికి జవాబుగా 'సామిడి జగన్ రెడ్డి 'తెలంగాణలో భావకవితా వికాసం' అనే గ్రంథాన్ని తీసుకొచ్చారు. దీనితో అనేక వివాదాలకు కత్తెర పడింది.

ఆంధ్రాలో భావకవిత్వం 1910లో మొదలై, 1940 ఆగిపోయింది. అయితే తెలంగాణలో 1940లో ఆగిపోలేదు. అభ్యుదయ కవిత్వానికి పోటీ ఇచ్చి, మళ్ళీ 1948 నుండి 1966 వరకు భావకవిత్వ ప్రవాహం కొనసాగింది. 1) 1900 నుండి 1943 వరకు ఒక దశ, 2) 1948 నుండి 1966 దాకా రెండోదశ. ఇలా రెండు దశలుగా భావకవిత్వం వచ్చిందని 'సామిడి జగన్ రెడ్డి తన 'తెలంగాణలో భావ కవితా వికాసం' పరిచయంలో పేర్కొన్నారు. తెలంగాణలో భావకవిత్వం ఆలస్యంగా ప్రచారంలోకి వచ్చినప్పటికీ, తర్వాత పుంజుకున్న తీరు కన్పిస్తుంది. సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ కవుల సంచిక (1934)లో అనేక భావకవిత్వాన్ని ప్రచురించారు. అనుమండ్ల భూమయ్య 'తెలంగాణ భావ విపంచిక' గ్రంథంలో భావకవుల గూర్చే చర్చించారు. ఇవేం పరిశీలించకుండా భావకవిత్వం లేదనడం శోచనీయం. సాహిత్యంలో అపప్రచారాలు చొరబడకూడదు. వివాదాలుండకూడదు. ఈ రకమైన ధోరణి కొనసాగితే సాహిత్య ప్రమాణాలు విలువలేనివై విధ్వంసకరంగా తయారవుతాయి.

ఇక్కడ గమనించాల్సిందేమిటంటే తెలంగాణలో ఉబికి వచ్చిన భావకవిత్వం వేరు. సీమాంధ్రలో వచ్చిన భావకవిత్వం వేరు. అక్కడి సాహిత్య ప్రమాణాలతో ఇక్కడి సాహిత్యాన్ని బేరీజు వేయకూడదు. భాష ఒక్కటైనంత మాత్రాన కవిత్వం ఒకేరకంగా ఉండదు కదా! భాష ప్రాంతాన్ని బట్టి మారుతుంది. ఒక ప్రాంతానికి భౌగోళిక స్వరూపం ఎట్లైతే ఉంటుందో? అట్లనే కవిత్వానికి కూడా భౌగోళిక స్థానికత ఉంటుంది. కోస్తాంధ్ర భావకవిత్వం మీద ఇంగ్లీషు, సంస్కృత భాష సాహిత్యాల ప్రభావం ఉంటే తెలంగాణ భాష, యాస మీద ఉర్దూ, పార్శీ ప్రభావం కనిపిస్తుంది. ప్రాంతేతరులు ప్రామాణిక భాష పేరుతో వాళ్ల భాషని మనపై రుద్దే ప్రయత్నం చేశారు. ఇంకా తెలంగాణ భాషను అవహేళన చేయడం, గేలి చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడ్డారు. కోస్తాంధ్ర ప్రాంతం, తెలంగాణలో కంటే ముందే ఆధునికతని అవగాహన చేసుకోవడానికి తోడ్పడిన, ఇంగ్లీషు విద్య వంటి సంస్కరణ ఫలితాల్ని ముందుగానే రుచిచూసింది. "భావకవిత్వ యుగం ఆంగ్ల కవితా ప్రభావంతో ఆంధ్ర ప్రాంతంలో ప్రారంభమైనట్టు తెలంగాణలో తక్కువ. ఉర్దూ, పారశీక కవితలు ఇక్కడి కవులలో నూతన ఉత్తేజాన్ని కలిగించలేదు. ఆంధ్ర ప్రాంతంలోని భావకవిత్వ యుగం వలె నూతనోద్యమాన్ని ప్రారంభింపజేయలేదు" (దాశరథి. ఆంధ్ర వారపత్రిక స్వర్ణోత్సవ సంచిక: జనవరి 14, 1959) తెలంగాణ విషయానికి వస్తే సుదీర్ఘకాలంగా ఫ్యూడల్ శక్తుల అరాచకాలను, దొరల పెత్తనాన్ని, జాగీర్దార్ల దౌర్జన్యాలని భరిస్తూ, పాశవిక పటేండ్ల పాలనలో తెలంగాణ మగ్గిపోయింది. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఈ ప్రాంత కవులకు చదువుకున్నప్పటికీ కావ్యం అచ్చు వేయలేకపోయారు. వ్యవసాయ పనులు చేస్తూ, కాస్తో కూస్తో అక్షరాలు నేర్చి కవిత్వ దీపాన్ని ముట్టించారు. సామాజిక ఉద్యమాలు చేస్తూనే సాహిత్య సృష్టి సాగించిన కవులు తర్వాతి కాలంలో ఊళ్ళల్లో నుండి బయటపడి చదువుకున్న కవులు భావకవిత్వానికి అంకురార్పణ చేశారు. కాస్త ఆలస్యమైనప్పటికీ కవిత్వం రాకుండా ఉండలేదు. అయితే తెలంగాణ భావకవిత్వానిది ఎప్పటికీ వైవిధ్యమైన నడకే. అది వస్తువులోనూ, అభివ్యక్తిలోనూ, శైలి శిల్పాల్లోనూ, ఆ డిఫరెన్స్ స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ భావకవిత్వం మతతత్వాన్ని మంట గలిపింది. అంటరాని తనానికి అగ్గిపెట్టింది. మనిషి స్వేచ్ఛకు రెక్కలు తొడిగింది. వస్తువుకి కొత్త డైరెక్షన్ నేర్పింది.

తెలుగులో తొలి ''ఎలిజీ'' 1910లో రావిచెట్టు రంగారావు చనిపోయినప్పుడు, మైలవరపు నరసింహశాస్త్రి రాసిన ఎలిజీ మొదటిదని సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. తొలి స్మృతికావ్యం 'ఉదయ లక్ష్మి' కరుణశ్రీ 'పుష్ప విలాపం' 1932లో వచ్చింది. కానీ, దానికంటే ముందే 1927లో సుజాత పత్రికలో 'సుమ విలాసం' పేరుతో కోదాటి రామకృష్ణారావు కవిత్వం అచ్చయింది. తెలంగాణ భావకవిత్వంలో తమ గ్రామీణ ప్రజల, తాత ముత్తాతల భాషను నెమరువేసుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి 'ప్రణయిని ప్రార్థనము'లో పాలమూరు పటేండ్ల భాష, వెట్టి వాని పాట వంటి కవిత్వాలలో తెలంగాణ ప్రజల వ్యావహారిక భాషను, నుడికారాన్ని వాడిన తీరు కనిపిస్తుంది. గంగుల శాయిరెడ్డి తెలంగాణ రైతుల జీవితాన్ని సమగ్రంగా చిత్రీకరించారు. పస్పుల కోవూరు భరతయ్య, వెల్దుర్తి మాణిక్యరావు, కోదాటి రామకృష్ణారావు వంటివారు ప్రకృతి కవిత్వాన్ని రాశారు. ఋష్యాన్ పేట రత్నమ్మ, పులిజాల వెంకట రంగారావు, చాత్రాతి లక్ష్మీ నరసమాంబ వంటి వాళ్ళు సంఘ సంస్కరణ కవిత్వం రాశారు. సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు ముస్లింకవి సయ్యదలీ వంటి వారు ప్రణయ కవిత్వాన్ని అల్లినారు. భక్తి కవిత్వాన్ని రాసిన వారిలో ముద్దు బాలంభట్టు, శ్రీపతి సత్యనారాయణ శాస్త్రి, కొండపల్లి రామచంద్రరావు, యం. వై. జీవరత్నం (జీసస్ మీద) అహమ్మదుద్దీన్ ఖాజా (అల్లా మీద) కవిత్వం రాశారు. ఇలా అన్ని భావకవిత్వ శాఖలను చేపట్టారు. అటు దుఃఖాన్ని, ఇటు ఉరకలు వేసే ఉత్సాహాన్ని సమపాలల్లో రికార్డు చేశారు. తెలంగాణ భావకవిత్వంతో ప్రయాణిస్తున్నప్పుడు కవి పొందిన అనుభూతిని ఆయా సందర్భాల్లో కవితోపాటు పాఠకుడు సమానుభవం పొందుతాడు. తెలంగాణలో భావకవిత్వాన్ని ప్రచారం చేసిన పత్రికలో చెప్పుకోదగినవి భావకవిత్వంలో భాగమైనవి రెండు. 1926లో ప్రారంభమైన గోలకొండ పత్రిక, 1927లో సుజాత పత్రికలు వేదికగా నిలిచాయి.

తెలంగాణ భావకవిత్వం పద వివరణ:

రాయప్రోలు సుబ్బారావు కావ్యాల్లో 'భావపదం', 'భావగీతము', అని తొలిసారిగా వాడారు. ఆ తరువాత విశ్వనాథ సత్యనారాయణ 'గిరికుమారుని' ప్రేమగీతముల్లో, కృష్ణశాస్త్రి "ఊర్వశి"లో భావగీతము' అనే పదాలు ప్రయోగించారు. భావకవిత్వాన్ని రాయప్రోలు సుబ్బారావు "అభినవ కవిత్వం" అనీ, కృష్ణశాస్త్రి "కాల్పనిక కవిత్వం" అని దువ్వూరి రామిరెడ్డి "గీత కవిత్వం" అనీ, నోరి నరసింహశాస్త్రి "నవ్య కవిత్వం అని పిలిచారు. అయితే తెలంగాణకు చెందిన కవులు కూడా భావకవిత్వాన్ని వివిధ పేర్లతో ప్రయోగించారు. కాని ఇంత వరకు అవి ఎక్కడ రికార్డ్ కాలేదు. బూర్గుల రామకృష్ణారావు "ప్రణయ సంక్షోభము"లో "భావగీతి" అనీ, అజ్మతుల్లా 'భావకవిత' అనీ, గవ్వా అమృత్ రెడ్డి "నిర్వేదము"లో "భావలోకపు ప్రేమ రాజ్యము" అని, బుక్కపట్టణము తిరుమల నరసింహాచార్యులు "కన్నీరు"లో ''భావగీతం'' అని, దామరాజు వేంకటరమణ మూర్తి 'ప్రేమగానము' 'ప్రేమగీతం' అని ఉపయోగించారు. మమునూరు నాగభూషణరావు 'ప్రేమాంజలి'లో ప్రేమగీతం' అని, తమ కావ్యాల్లో భావకవిత్వాన్ని వివిధ పేర్లతో పిలిచారు. తెలంగాణ భావకవులంతా వస్తు, భావ రచనలో భావాన్ని ఎక్కువ జోడించి చెప్పారు. అందుకే భావ గీతం, ప్రేమగీతమంటూ పిలిచారు.

''భావ కవిత్వమను పదమును గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఆంధ్రపత్రిక సహాయసంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించేనని డా. గిడుగు సీతాపతిగారు తమ 'History of Telugu Literature (Part II)లో వ్రాసిరి'' (నారాయణరెడ్డి, సి.ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు. 1967: 302). గాడిచర్ల హరిసర్వోత్తమరావు భావకవిత్వం అనే పదం వాడిన తరువాత అందరూ "భావకవిత్వం" అని పిలవడం మొదలు పెట్టారు.

తెలంగాణ భావకవిత్వం-వస్తు, భావ, శైలిలో కొత్తదనం:

ఆధునిక ప్రపంచంలో సాహిత్యం తప్పనిసరిగా, సమకాలీన దృక్పథాన్ని కలిగి ఉండటం అవసరం. భావకవిత్వం ఆధునిక ప్రక్రియ, అలాంటప్పుడు కవి ఆధునిక భావజాలం కలిగి ఉండటం సహజం. కవి ఆధునికుడైనప్పుడు అతడి ఆలోచనలు సిద్ధాంతాలు ఆధునికం కాకుండా పోతాయా! పాత వస్తువు (ఇతివృత్తం), పాత పదజాలం పట్ల విముఖత చూపించడం కొత్త వ్యక్తీకరణలను సాహిత్యంలో చూపించాలను కోవడం ఆధునిక కవిత్వావసరం. ఉత్కృష్ట సాంప్రదాయ వస్తువు నుండి మోజు దులిపేసుకుని, ప్రజాస్వామ్య ఆలోచనలకు తావు నిచ్చారు. ప్రాచీన సాహిత్యంలో, ఆయా కాలాల్లో ప్రాబల్యం వహించిన వస్తువు ఇప్పుడు ఉండదు. వస్తువును ఎన్నుకోవడంలో మార్పు వచ్చింది. ఇక వస్తువు మారినప్పుడు శైలి మారకుండా ఉండదు కదా! కవి కాల్పనిక జీవి. కల్పనలు జోడించి చెప్పడం వీరి మౌలిక లక్షణం. ఎప్పుడైతే ఆధునిక సాహిత్యం మొదలైందో అప్పుడే సాహిత్య వస్తువు ఎక్కడో కాదు మనిషేనని తేలిపోయింది. అప్పుడు సొంత ఆలోచనల్ని, అనుభూతుల్ని, సమకాలీన వాస్తవిక జీవితాన్ని కవిత్వార్థంలో బోర్లించారు.

పెద్దన మనుచరిత్రలో కావ్య నాయకుడు బ్రాహ్మణుడు, వరూధిని వేశ్య, స్వరోచి క్షత్రియుడు. ఇలా ప్రాచీన సాహిత్యాన్నంతా తిరగేస్తే నాయకులు ధీరోదాత్త, ధీరశాంత,

ధీరలలితుడు వంటి వాళ్లే హీరోలుగా కనిపిస్తారు. కాని శూద్రులు, కాయకష్టం చేసుకునే బతికే శ్రమజీవులు, ప్రబంధ సాహిత్యంలో నాయకులుగా ఉన్నట్లు దాఖలాలేం లేవు. కనిపించవు. ప్రబంధయుగంలో పింగళి సూరన కొంచెం ధైర్యం చేసి, 'కళా పూర్ణోదయం' వంటి వినూత్నమైన కల్పిత ప్రబంధం రాయడానికి పూనుకోవడం సాహసమేనని చెప్పాలి. ఇందులో సుగాత్రి శాలీనుల వంటి సాంఘిక కథలో పాత్రలన్నీ అగ్రకులస్తులవే. ప్రబంధ సాహిత్యంలో పాత్రలన్నీ చాతుర్వర్ణ వ్యవస్థ పరిధి దాటి కిందకు దిగవు. కానీ తెలంగాణ భావకవిత్వంలో అట్లాకాదు. భావకవిత్వంలో ప్రాచీన వారసత్వ ఛాందస భావాలనుండి భయటపడి, పాత్రలకు కులం పేరు, మతం, పేరు పెట్టకపోవడం గమనార్హం. ఇంగ్లీష్ విద్య సంఘ సంస్కరణ ఉద్యమాల పుణ్యమా అని హైందవ సంప్రదాయాలను నిరాకరించడం, కులం, మతం వంటి కట్టుబాట్లను భావకవులు పూర్తిగా తెంపుకున్నారు. తెలంగాణ భావకవిత్వోద్యమంలో కుల భేదాలను నిరసించి కొత్త చైతన్యాన్ని ఆహ్వానించారు. సురవరం ప్రతాపరెడ్డి, "ప్రేమార్పణము"(1931)లో ముస్లిం పాదుషా కూతురు గొల్లవాన్ని ప్రేమిస్తుంది. సుల్తాను కోపంతో ఆ యాదవుడిని చంపేస్తాడు. ప్రియురాలు అతడి మీద తీవ్రమైన ప్రేమతో రాజ్య భోగాలు, సర్వసౌఖ్యాలను విడిచి, చనిపోయిన ప్రేమికుడి మాటకోసం గొర్రెలు కాస్తుంది. ఏ ప్రలోభాలకు లొంగని ఆదర్శ ప్రేమ తత్వాన్ని కవిత్వంలో నడిపించాడు సురవరం ప్రతాపరెడ్డి. అయితే అనుభూతిని అభివ్యక్తం చేయడంలోనే వస్తువు సార్థకత అర్థమవుతుంది. అలా వస్తువును బట్టి వర్ణనలు మెరుస్తాయి. మునుపటి కావ్యాల్లో వస్తువు అగ్రకులస్థులు. ఇప్పుడు సామాన్యమైన మనిషే కావ్య వస్తువు. ఇక్కడ గొల్లవాడికి కావ్య గౌరవం దక్కింది. ఇలా అస్పృశ్యులు కావ్య గౌరవం పొందడమే సాహిత్యంలో వస్తు నవ్యత. దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు', "పింగళి –కాటూరి" జొన్నచేను, మొదలైన ఇతివృత్తాలు తీసుకుంటే తెలంగాణ నుండి "గంగుల శాయిరెడ్డి" "కాపుబిడ్డ" ఆకెళ్ల సుబ్రహ్మణ్య కవి "కష్టజీవి" వంటి పల్లెటూరి రైతు జీవితాన్ని, కావ్య వస్తువుగా స్వీకరించారు. వస్తువుని, భాషని కొత్త డైరెక్షన్ ట్రెండ్ గా నడిపించింది

ముగింపు:

కవిత్వానికి వస్తువు, భావం రెండింటిలో భావం ఉన్నతమైనదిగా చెప్పుకొచ్చారు కవులు. ప్రాచీన పురాణ కావ్యాలు వస్తు ప్రధానములు. ఇవి కేవలం కథను చెప్పాయి. ఖండకావ్యములు భావ ప్రధానములు. ఇక్కడ భావకవికి కథతో పనిలేదు. అనుభూతిని కవితగా పాడుకున్నాడు. ఆత్మానుభూతి ద్వారా చూసిన వస్తువును, ఊహలతో అందంగా పోల్చాడు. "వస్తు పరమైన, భావ పరమైన నిగళాలను త్రెంచివేసి, పాఠకులకు అందుబాటులో ఉండే శైలిలో, భాషలో కళ సృష్టి చేసి, తన ప్రేరణను అనుభూతిని కవితా రూపంలో పాఠకులకు నేరుగా అందించడమే భావకవితా ఉద్యమం ముఖ్య లక్ష్యం". (రంగనాథాచార్యులు, కె. కె. (సంపా) ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, 1982:27). శైలిలో, భాషలో ఒక కొత్త సంచలనాన్ని సృష్టించారు వీళ్ళు. ఊపిరాడక అడుగుంటుకుపోయిన తెలంగాణ భాషని, యాసని తమ కావ్యాల్లో గౌరవంగా వాడారు. ప్రజలకు అర్థంకాని యమక శ్లేష అలంకారాలకు గుడ్ బై చెప్పారు. సుకుమారమైన పదాల లాలిత్యం, మాధుర్యం చిలకే పదబంధాలతో, అందంగా కవిత్వం అల్లారు. శైలి సరళంగా ఉంటే ప్రజలకి ఇంకాస్త దగ్గరవుతుంది కవిత్వం. భావకవులు అదే చేశారు. ప్రాచీనానికి చికిత్స చేశారు. తెలంగాణ భావకవిత్వం శీర్షిక నుండే మొదలవుతుంది. శీర్షికలు కవిత్వ స్థాయిని పెంచుతాయి. ఎదలోపలి నుండి ఉదయించిన దిగులు వెతల సంతోషానుభూతుల పొంగు భావకవిత్వం. భావకవుల గుండె చప్పుళ్ల స్టెతస్కోప్ (Stethoscope), భావ కవిత్వం.

ఉపయుక్త గ్రంథసూచి:

1. జగన్ రెడ్డి, సామిడి. 'తెలంగాణలో భావకవిత్వ వికాసం'. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమి. 2017.
2. జగన్నాథాచార్యులు, వానమామలై. 'రైతు రామాయణం'. హైదరాబాద్: స్వీయ ముద్రణ. 1980.
3. నారాయణరావు, వెల్చేరు. 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం'. హైదరాబాద్: తానా ప్రచురణలు. 2008.
4. నారాయణరెడ్డి. సి. 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు'. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 1977.
5. ప్రతాపరెడ్డి, సురవరం. 'గోలకొండ కవుల సంచిక'. హైదరాబాద్: స్వీయ ముద్రణ 1934.
6. భూమయ్య, అనుమాండ్ల. 'తెలంగాణ భావ విపంచిక'. వరంగల్లు: శ్రీ మనస్విని ప్రచురణలు. 2013.
7. మాధవ శర్మ, పాటిబండ్ల. 'ఆధునికాంధ్ర భావకవిత్వం'. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం. 2012.
8. యాదగిరి. కె. (సంపా) 'తెలుగులో కవిత్వోద్యమాలు'. హైదరాబాద్: తెలుగు అకాడమి. 2016.
9. రంగనాథాచార్యులు, కె. కె. 'తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు'. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్. 2015.
10. రామకోటి శాస్త్రి, కేతవరపు. 'ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు'. వరంగల్లు: జిజ్ఞాస ప్రచురణలు. 2002.

రచయిత: పరిశోధక విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ

సాహిత్య
పరిశోధన

తెలుగులో విప్లవ నవల వికాసం

బొడ్డుపల్లి అఖిల్

పరిచయం

తెలుగు ప్రాంతం సామాజిక సంచలనాలకు నిలయం. అనేక ఉద్యమాలకు, పోరాటాలకు, సామాజిక సంఘర్షణలకు ఈ ప్రాంతం స్పందించింది. ఆ స్పందన అంతా సాహిత్యంలో భిన్న ప్రక్రియలలో రికార్డ్ అయ్యి ఉంది. అనేక ప్రజా సమూహాలు విడివిడిగా తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించారు. దీంట్లో విద్యార్థులు మొదలు రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసులు, మహిళలు ఉన్నారు. ఈ విడివిడి పోరాటాలు తమ అంతిమ లక్ష్యం సాయుధ పోరాటం ద్వారానే సాధ్యమవుతుందని ఒక సంఘటిత ఉద్యమంలో భాగమయ్యాయి. ఈ ఉద్యమం వ్యవస్థలో సమూల మార్పును కాంక్షించి విప్లవోద్యమయింది. ఈ ఉద్యమమే సమాజానికి, సాహిత్యానికి విప్లవ దృక్పథాన్ని అందించింది. ప్రజల సామాజిక, ఆర్థిక సంఘర్షణల నుండి పుట్టిన విప్లవోద్యమం తెలుగు సాహిత్యంపై తీవ్రమైన ప్రభావం వేసింది. విప్లవ భావాల ప్రచారం కోసం అనేక కళారూపాలను ఎంచుకుంది. ప్రధాన ప్రచార సాధనాలుగా జానపద కళారూపాలను, పాటను ఎంచుకుంది. నిరక్షరాస్యులకు, శ్రామికులకు విప్లవోద్యమం దగ్గరవడానికి ఈ రూపాలు ఉపయోగపడ్డాయి. కానీ, ఈ ప్రక్రియలకు జీవితాన్ని చిత్రించే అంత విస్తృతి ఉండదు. అందుకే కథ, నవలల ప్రాధాన్యత ముందుకొచ్చింది. విప్లవోద్యమంలో నిర్మాణమవుతున్న విలువలను, జీవితాలను ప్రచారం చేయడానికి నవలా ప్రక్రియ కావాల్సి వచ్చింది. విప్లవోద్యమం సమాజంపై వేసే ప్రభావాన్ని, అది చేసే గుణాత్మక ప్రయాణాన్ని చిత్రించడానికి నవలా ప్రక్రియ ఉపయోగపడింది. తెలుగులో విప్లవ నవల పుట్టుకకు గల ప్రాతిపదికను చర్చించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం

కీలక పదాలు: మార్క్సిజం, నక్సల్బరీ, విప్లవోద్యమం, విప్లవ నవల

నవల- పుట్టుక

సమాజ చైతన్యం సాహిత్య ప్రక్రియను నిర్ణయిస్తుంది. సాహిత్యంలో ఆవిర్భవించిన ప్రతీ ప్రక్రియ ఆకాలం నాటి సామాజిక స్థితి నుండే ఉద్భవిస్తుంది. సమాజం దాటుకుంటూ వచ్చిన దశలన్నింటిలో సాహిత్య వ్యక్తీకరణ మారుతూ వచ్చింది. దానికి అనుగుణంగా వ్యక్తమయ్యే ప్రక్రియా రూపాలు కూడా మారుతూ వచ్చాయి. ప్రపంచమంతటా సాహిత్యంలో ఈ మార్పులు సంభవించాయి. రాజరిక వ్యవస్థ, ఫ్యూడల్ సంస్కృతి మహాకావ్యాలలో సాహిత్యంగా వ్యక్తమైంది. పారిశ్రామిక విప్లవం తర్వాత ప్రజాస్వామిక విలువలు ప్రపంచంలో నూతన భావాలుగా వ్యాప్తి చెందాయి. ఫ్యూడల్ ప్రభువులపై ఎదురుతిరిగి మధ్యతరగతి వర్గం ఏర్పడింది. ఈ వర్గం ప్రగతిశీల ఆలోచన విధానంతో సమాజంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది. ఆర్థిక, సామాజిక రంగాలతో బాటు సాహిత్య రంగంలో కూడా దీని ప్రభావం పడింది. ఫ్యూడల్ విలువల అనంతరం ఏర్పడే మధ్యతరగతి వర్గ పెట్టుబడిదారి సంస్కృతి వ్యక్తమవ్వడానికి ఒక ప్రక్రియ అవసరమైంది. తమ జీవిత శిల్పానికి, వ్యక్తీకరణకు అనువుగా నవల ప్రక్రియను సృష్టించుకున్నారు. మహాకావ్యాల లాంటి సంశ్లిష్ట రచన విధానానికి దూరంగా నవలా సాహిత్యం రూపొందింది. జపాన్ సాహిత్యంలో బీజంగా పడిన నవలా ప్రక్రియ యూరప్ సాహిత్యంలో వికసించింది.

ప్రపంచ సాహిత్యంలోలాగే భారతీయ సాహిత్యంలో నవలా ప్రక్రియ ఒక చారిత్రక దశలో ఏర్పడింది. అనేక దశలగుండా దాని ప్రయాణం జరిగింది. యూరప్‌లో పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామిక విలువలు నవల ఏర్పాటుకు కారణమైతే భారతదేశంలో సామాజిక సంఘర్షణ, పరిణామ క్రమం నుండి నవల బయటకు వచ్చింది. భారతదేశంలో జరుగుతున్న జాతీయ విప్లవోద్యమాన్ని అనుసరించి

బ్రాహ్మణీయ, భావవాద, భూస్వామిక విలువలతో భారతీయ నవల ప్రయాణం చేసింది. ఆంగ్ల సాహిత్య ప్రభావంతోనే తెలుగు సాహిత్యంలోకి నవలా ప్రక్రియ ప్రవేశించింది. బ్రిటీష్ కాలంలో ఆంధ్ర ప్రాంతంలో కొన్ని ప్రాంతాలలో సాగునీటి పరిస్థితి మెరుగైంది. ముఖ్యంగా గోదావరి ఆనకట్ట నిర్మాణం తర్వాత వ్యవసాయం అభివృద్ధి చెందింది. దీని మూలాన భూములు ఎక్కువగా ఉన్న భూస్వాములు సంపన్న వర్గాలుగా మారారు. బ్రిటిష్ పాలకులు విద్యపై దృష్టి పెట్టడం వలన చదువుకున్న తరం ముందుకు వచ్చింది. ఇంగ్లీష్ చదువు మూలానా ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం కలిగింది. ప్రపంచ సాహిత్యంతో జరిగిన ఈ సంపర్కం సమాజంలో, సాహిత్యంలో ఎన్నో సంస్కరణలకు కారణమైంది. సాంప్రదాయిక భావాలతో ఉన్న సమాజంలో ఆధునిక భావాలు ప్రవేశించాయి. ఆధునిక భావాలతో పాటు ఆధునిక సాహిత్యం, సాహిత్య విలువలు, ప్రక్రియలు కూడా ప్రవేశించాయి. అంతక మునుపు వరకు తెలుగు సాహిత్యం అంతా ఫ్యూడల్ వాసనలతో, ఆస్థాన పొగడ్తలతో నిండిపోయి ఉంది. వేల ఏళ్ల క్రితం విలువలను వర్ణనాత్మక, శృంగారాత్మక రచనలుగా నింపుకుంది.

తెలుగు నవల వికాసం

నవలా వికాసం భిన్న పాయలుగా, విభిన్న దృక్పథాలతో, వస్తువులతో సాగింది. ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి సంబంధాల పునాదిగా ఏర్పడే మానవ సంబంధాల కేంద్రంగా నవలా వికాసం జరిగింది. ఈ నవలా ప్రయాణంలో అనేక ధోరణులు వచ్చాయి. ప్రారంభంలో సమాజంలో ఉన్న భూస్వామిక విలువలను అనుసరించి నవలలు వచ్చాయి. తెలుగులో వచ్చిన రెండు నవలలు రాజశేఖర చరిత్రము, రంగరాజ చరిత్రము భూస్వామ్య వ్యవస్థ నుండి బయటపడిన వస్తువుతో వచ్చినవే. కూలిపోతున్న భూస్వామ్య సంబంధాలను అనుసరించి విశ్వనాథ సత్యనారాయణ నవలా రచన చేశాడు. భూస్వామ్య వ్యవస్థను, ఆది సృష్టించే అసమ సంబంధాల గురించి ఉన్నవ లక్ష్మీనారాయణ 1921లో మాలపల్లి నవల రాసాడు. తెలుగులో నవల ప్రయాణంలో, సాంఘిక నవల నిర్మాణంలో ఇదొక గొంతు. స్త్రీ, పురుషుల మధ్య ప్రజాస్వామిక సంబంధాల కోసం చలం రచనలు చేశాడు.

మార్క్సిజాన్ని, ప్రపంచ గమనాన్ని శాస్త్రీయ అధ్యయనం చేసి కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రిలాంటి నవలాకారులు మార్క్సిస్టు సాహిత్య అవగాహనతో నవలలు రాశారు. స్త్రీ విముక్తి దృక్పథంతో రంగనాయకమ్మ, ఓల్గా వంటి వారు రాసారు. తర్వాత కాలంలో ప్రజా పోరాట నేపథ్యంలో, విప్లవోద్యమ అవగాహనతో అనేక నవలలు వచ్చాయి. విప్లవోద్యమ ప్రభావంతో అస్తిత్వవాద సాహిత్యం వెలువడింది. ప్రధాన స్రవంతి సాహిత్యం పట్టించుకుని అస్తిత్వాలను, ప్రతీకలను, జీవితాలను అస్తిత్వవాద నవలలు బయటపెట్టాయి.

తెలుగు నవల– మార్క్సిజం

సంప్రదాయ, ప్రబంధ, భావ కవితా యుగాల అనంతరం తెలుగు సాహిత్యంలో సరికొత్త భావాలు ప్రవేశించాయి. అవి అప్పటివరకు సాహిత్యంలో ప్రచారంలో ఉన్న సాహితీ విలువలకు భిన్నమైనవి. భావ కవిత్వ గర్భం నుండే బయటికి వచ్చిన ఆ సాహితీ విలువలు, బయటికి రాగానే భావ కవిత్వంపై తిరగబడ్డాయి. సాహిత్య ప్రయాణాన్ని భావవాద విలువల నుండి భౌతికవాద విలువల వైపుకి తిప్పాయి. ప్రపంచ సాహిత్య సంపర్కంతో ఆ సాహితీ విలువల ధిక్కారమే అభ్యుదయ సాహిత్యోద్యమంగా కాలంలో నిలబడిపోయింది.

అభ్యుదయ సాహిత్య బీజాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. 1930వ దశకంలో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని కకావికలం చేసింది. ఈ కాలం ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక రంగాలలో పెనుమార్పులకు వేదికైంది. ప్రపంచ యుద్ధాల కాలంలో వర్గ సంఘర్షణ తీవ్రమైంది. ప్రపంచమంతా సంక్షోభంలో ఉన్న ఈ పరిస్థితులలో రష్యా మాత్రం వీటికి దూరంగా ఉంది. ఈ పరిస్థితి ప్రపంచ మేధావులను రష్యా వైపు, వామపక్ష భావజాలం వైపు చూసేలా చేసింది. భారతదేశంలో కూడా విద్యావంతులైన మేధావులు ఈ వామపక్ష విలువల పట్ల ఆసక్తి కనబరిచారు. ప్రపంచ వామపక్ష సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. ముఖ్యంగా కార్ల్ మార్క్స్ సిద్ధాంతం భారతీయుల అధ్యయన సాహిత్యంలోకి వచ్చింది. మార్క్స్ సిద్ధాంతం ప్రవేశించిన తర్వాత అక్కడ ఉన్న రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో బలమైన ప్రభావం వేసింది.

మార్క్సిజం అధ్యయన ప్రభావం వలనే 1935వ సంవత్సరంలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. అప్పటికే మార్క్సిజం సిద్ధాంతం వెలుగులో అనేక ప్రజా ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాలు జరుగుతున్నాయి. నజ్రూల్ ఇస్లాం, ముల్కరాజ్ ఆనంద్, ప్రేమ చంద్ లాంటి కవులు మార్క్సిజం ఇచ్చిన సైద్ధాంతిక దృక్పథంతో సమాజాన్ని సాహిత్యీకరించారు. ఈ ప్రభావంతోనే అనేకమంది తెలుగు కవులు కూడా అభ్యుదయ సాహిత్యోద్యమంలో భాగమయ్యారు. శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి, శిష్టా ముఖ్యులు. వీరిలో శ్రీశ్రీ, నారాయణబాబులు వస్తు కేంద్రంగా కొత్త దారులు వేస్తే, పఠాభి, శిష్టాలు రూపం కేంద్రంగా కొత్త మార్పులు తెచ్చారు. నవల, కథ, కవిత, పాట మొదలు అన్ని సాహిత్య ప్రక్రియలలో ఈ కొత్తదనం కనిపించింది. జానపద కళా రూపాలలో కూడా మార్క్సిజం తాలూకు ప్రభావం కనపడింది. సామ్రాజ్యవాద వ్యతిరేకత, జమీందారి వ్యవస్థ వ్యతిరేక పోరాటాలు, రైతు కూలీల కష్టాలు సాహిత్య వస్తువులైనాయి. బద్ధ భావ కవులు కూడా మేము అభ్యుదయ కవులమే అని చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భారతదేశంలో 1930 నాటికి కమ్యూనిస్ట్ పార్టీ తన కార్యక్రమాలను విస్తరించడం మొదలైంది. ప్రజలలో పని చేయడం, ప్రజా పోరాటాలలో భాగం అవడం చేసింది. అంతకు మునుపే ఆంగ్ల విద్య అభ్యసించిన కొంతమంది యువకులు మార్క్సిజం అధ్యయనం చేశారు. ఈ క్రమంలోనే ఉన్నవ లక్ష్మీ నారాయణ మాలపల్లి నవలను రాసారు. గాంధేయ భావాలతో నవల రాసినా, గ్రామాల్లో ఉన్న భూ సంబంధాలను, దోపిడిని ఈ నవలలో చిత్రించాడు. ఈ నవలను రెండు సార్లు నిషేధించారు. తర్వాత మార్క్సిస్ట్ అవగాహనతో కొడవటిగంటి కుటుంబరావు చదువు అనే నవలను రాసారు. ఈ నవల మూడు దశాబ్దాల జాతీయోద్యమాన్ని ఆధారంగా చేసుకుని రాసిన నవల. 'చదువు నవల ఒక తరం ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులను, ఆనాటి గ్రామీణ జీవితమును ప్రత్యక్షంగా వ్యాఖ్యానించిందని పుల్లాబోట్ల వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. (తెలుగు నవలా సాహిత్య వికాసం. పుట:172). కుటుంబరావు రాసిన మరో నవల 'అరుణోదయం'లో మధ్య తరగతి ప్రజల సమస్యలకు కమ్యూనిజం ఎట్లా పరిష్కారం అవుతుందో చిత్రించాడు. శారద కూడా రెండు నవలలు రాసారు. మహీధర రామమోహనరావు వంటి వాళ్ళు గాంధేయ మార్గంలోనే కొల్లాయి కట్టితేనేమి వంటి నవలలు రాసారు. అలాగే 1940 ల కాలంలో ఆంధ్ర ప్రాంతపు రాజకీయాలను గమనిస్తూ మార్క్సిస్ట్ దృక్పథంతో 'రథచక్రాలు' నవల రాసారు.

తెలుగు నవలపై మార్క్సిజం ప్రభావం పడటం వలన నవలలోకి ఉత్పత్తి సంబంధాల చిత్రణ, భూ సంబంధాల చిత్రణ, భౌతికవాద దృక్పథం ప్రవేశించాయి. జాతీయోద్యమ నేపథ్యంలోనే జాతీయ బూర్జువా ప్రయోజనాలు నెరవేర్చే నవలలు వచ్చాయి. గోపీచంద్ రాసిన చీకటి గదులు, అసమర్థుని జీవ యాత్ర లాంటి రచనలు ఈ కోవలోనికి చెందినవే. స్త్రీ, పురుషుల మధ్య నిర్మాణం జరగాల్సిన ప్రజాస్వామిక సంబంధాల గురించి ఉప్పల లక్ష్మీనారాయణ అతడు ఆమె నవల రాశాడు.

తెలుగులో విప్లవ నవల

భారతదేశంలో 1967లో నక్సల్బరీ ప్రాంతంలో విప్లవ రాజకీయాలు కీలకమైన మలుపు తీసుకున్నాయి. ఇక్కడ జరిగిన రైతాంగ పోరాటం, సాయుధ పోరాట రాజకీయాలను దేశ ప్రధాన స్రవంతి రాజకీయాల్లోకి తీసుకువచ్చింది. ఫ్యూడల్ వ్యవస్థను సామాన్య పేద రైతులు ఎదిరించిన కొత్త రాజకీయ వ్యవస్థ నిర్మాణం జరిగింది. చైనా విప్లవ స్ఫూర్తితో భారతదేశ కమ్యూనిస్ట్ ఉద్యమం రివిజనిస్ట్ రాజకీయాలను వ్యతిరేకించింది. సాయుధంగా వర్గ శత్రు నిర్మూలన లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ కాలాన్ని భారతీయ సాహిత్యం నవలలోకి తీసుకువచ్చింది. బెంగాల్ నుండి ఒక తల్లి, ప్రతిధ్వంది నవలలు వచ్చాయి. నక్సల్బరీ ప్రేరణతో వచ్చిన శ్రీకాకుళం తెలుగు సాహిత్యాన్ని ఒక్క సారిగా తన వైపు తిప్పుకుంది. విప్లవోద్యమాన్ని చిత్రిస్తూ తెలుగులో చాలా నవలలు వచ్చాయి.

విప్లవోద్యమం ఇచ్చిన సైద్ధాంతిక భూమిక మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానంతో వచ్చిన నవలలను స్థూలంగా విప్లవ నవలలుగా నిర్వచించవచ్చు. ఉత్పత్తి

సంబంధాల మధ్య ఘర్షణ వలన ప్రజల జీవితాలలో జరిగే మార్పులను విప్లవ నవల చిత్రిస్తుంది. ఆ ఉత్పత్తి సంబంధాలలో మార్పు కోసం అనివార్యంగా జరిగే పోరాటాన్ని, ఆ పోరాటంలో ప్రజల భాగస్వామ్యాన్ని విప్లవ నవల ప్రధాన వస్తువుగా తీసుకుంటుంది. నవల ఒక కాలంలో, ఒక ప్రాంతంలో నెలకున్న రాజకీయ, ఆర్థిక, తాత్విక పరిస్థితులను, ఆ పరిస్థితులలో మనుషుల భావోద్వేగాలను సాహిత్యీకరిస్తుంది. "ఊహాత్మక, కల్పిత, వైయక్తిక భావవాద, నిరాశవాద, రకరకాల వ్యాపార ధోరణుల నుంచి తెలుగు నవలను భూ మార్గం పట్టించి అట్టడుగు శ్రామిక వర్గ ప్రజల ఆరాట పోరాటాలను చిత్రించడం విప్లవ నవల ప్రత్యేకత" (రాజయ్య, అల్లం. విప్లవమే కళాత్మక రచన;2024, పుట:93)

ముగింపు

నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రయాణంలో నవల అనేక దశలను దాటుకుంటూ వచ్చింది. భారతీయ నవలా సాహిత్యం మొదలైన దగ్గరి నుండి నవల వస్తువుగా ఎంచుకున్న అన్ని విషయాలు ఈ దశలో భాగమైనవే. విప్లవ నవల ప్రయాణం ఒంటరిగా లేదు. భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవ ప్రయాణంతో జమిలిగా నడుస్తూ వచ్చింది. ఈ ప్రయాణంలో అనేక ఉద్యమాలు, ఆ ఉద్యమాలు ప్రజల జీవితాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేసిన ప్రభావాలు కనిపిస్తాయి. రకరకాల వ్యాపార ధోరణులతో వస్తున్న నవలతో పాటు విప్లవ నవల తన ప్రయాణాన్ని సాగించింది.

రైతాంగ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన నవలలు

1. కొలిమంటుకున్నది – అల్లం రాజయ్య
2. నర్రెంక చెట్టు కింద – నల్లూరి రుక్మిణి
3. ఊరు – అల్లం రాజయ్య
4. ఒండ్రు మట్టి – నల్లూరి రుక్మిణి
5. దారి పొడుగునా – చెరబండరాజు
6. మా పల్లె – చెరబండరాజు

కార్మికోద్యమ నేపథ్యంలో వచ్చిన నవలలు

1. నల్ల వజ్రం – రఘోత్తమ రెడ్డి
2. శేషగిరి – పి. చంద్
3. విప్లవాగ్ని – పి. చంద్
4. నెత్తుటి ధార – పి. చంద్
5. శ్రామిక యోధుడు – పి. చంద్

దళితుల పోరాట నేపథ్యంలో వచ్చిన నవలలు

1. నిషిధ – నల్లూరి రుక్మిణి
2. అంటరాని వసంతం –కళ్యాణ రావు
3. ఎల్లి – అరుణ

ఆదివాసీ పోరాట నేపథ్యంలో వచ్చిన నవలలు

1. సరిహద్దు – సాధన
2. రాగో – సాధన
3. కొండగాలి – భూషణం
4. పునరావాసం –అట్టాడ అప్పల్నాయుడు
5. కొమురం భీమ్ – అల్లం రాజయ్య, సాహు
6. అడవి – వసంతరావ్ దేశపాండే

మహిళల పోరాటాన్ని చిత్రించిన నవలలు

1. శృతి
2. మేరువు
3. అగ్ని కణం – అల్లం రాజయ్య
4. అడవి తల్లి – పులుగు శ్రీనివాస్

దళ జీవితాన్ని చిత్రించిన నవలలు

1. తెలంగాణ పల్లె – కౌముది
2. అనేక – పాణి
3. వసంత గీతం – అల్లం రాజయ్య
4. అడవి పుత్రిక – వనజ

ఆధార గ్రంథాలు:

1. పాణి. సృజనాత్మక ధిక్కారం. 2020. విరసం ప్రచురణలు, హైదరాబాద్

2. రాజయ్య, అల్లం. 2024. విప్లవమే కళాత్మక రచన. విప్లవ రచయితల సంఘం, హైదరాబాద్

3. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. నవలా శిల్పం. 2021. నవ చేతన పబ్లిషింగ్ హౌస్.

4. వెంకటేశ్వర్లు, పుల్లాభోట్ల. తెలుగు నవలా సాహిత్య వికాసం. 1994. తెలంగాణ సాహిత్య అకాడమి

5. వెంకటేశ్వర్లు, పంతంగి(సం). తెలంగాణ తెలుగు నవల. 2014. తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం.

★ **రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు**

సాహిత్య
పరిశోధన

చెరబండరాజు విప్లవ నాటకాలు-పరిశీలన

హెచ్.మధుసూదన్

వ్యాస సంగ్రహం:

నాటకం చాలా ప్రాచీనమైనది. నాటకాన్ని "ఋగ్వేదంలో మగవారు – నటులు యుద్ధ విషయాల్ని ప్రదర్శిస్తూ ఉండేవారని ఉన్నదట" అని కాకరాల వి. వి. సత్యనారాయణ ఉదహరించారు. పోరాట స్ఫూర్తిని రగిలించడంలో నాటకానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నదని మనకు అర్థమవుతుంది. రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేయడంలో ముఖ్య పాత్రను పోషించాయి. అదే విధంగా విప్లవ పోరాటంలో ప్రజా చైతన్యం, ప్రజా పోరాటం చాలా ముఖ్యమైనది. ఈ పోరాటంలో ప్రజలను చైతన్యవంతులుగా చేయడానికి నాటక ప్రక్రియ చాలా ఉపయోగపడుతుంది. విప్లవం ఎలా అయితే సామూహికమో, నాటకం కూడా సామూహికమే అవుతుంది. నాటకంలో వస్తువు ప్రజాజీవితాల నుంచి రావాలి. వారు బతికే బతుకులు, అణచివేత, దోపిడి, దుర్మార్గాలను, వాటి పరిష్కారాలను నాటకంలో చూపటం వలన ప్రేక్షకులు అక్కడ జరిగే సంఘటనలను తమ జీవితాలకు అన్వయించుకుని మంచి, చెడులను విశ్లేషిస్తారు. చైతన్యవంతమైన ప్రజలు పోరాటానికి సిద్ధమవుతారు. సాంస్కృతిక విప్లవాన్ని తీసుకు రావడానికి నాటకాలు చాలా బాగా ఉపయోగపడతాయి. వర్గపోరాటాన్ని చిత్రీకరించడానికి చెరబండరాజు నాటక ప్రక్రియను ఎంచుకుని వస్తు వైవిధ్యాన్ని చూపించాడు. ఆ నాటకాలను ఇక్కడ పరిశీలిద్దాం.

కీలక పదాలు:

విప్లవం, వర్గపోరాటం, పెట్టుబడిదారి వ్యవస్థ, శ్రామిక వర్గం, హింస, అన్యాయం, అణచివేత, కమ్యూనిస్టు, వర్గ శత్రువు. ప్రజాస్వామ్యం

ఉపోద్ఘాతం:

చెరబండరాజు తెలుగు సాహిత్యానికి ఒక విప్లవ పతాక. ఈయన తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలంలోని అంకుశాపురం గ్రామంలో 1944లో జన్మించాడు. మొదటి పేరు బాల నర్సింహ స్కూల్లో ఐదవ తరగతి చదివేటప్పుడు తన పేరు బద్దం భాస్కరరెడ్డిగా మారింది. మొదట ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయనను దేశంలో నెలకొన్న పరిస్థితులు దిగంబర కవిగా మార్చాయి. అదే సమయంలో రాజ్య నిరంకుశత్వంపై పశ్చిమ బెంగాల్‌లో మొదలైన ప్రజా భూపోరాటం తెలుగు ప్రాంతంలోని శ్రీకాకుళంలో ఎర్రని సూర్యునిలా ఉదయించింది. ఈ పోరాటాలు ఆయనలో విప్లవ ఆలోచనలను రగిలించాయి.

1970లో శ్రీశ్రీ షష్టిపూర్తి సభ జరిగింది. ఆ సభలో విశాఖ విద్యార్థుల పేరుతో ప్రకటితమైన 'రచయితలారా మీరేటు వైపు' అనే కరపత్రం రచయితలను తమని తాము ప్రశ్నించుకునేలా చేసింది. దేశంలో నెలకొన్న నిరుద్యోగం, పేదరికం కారణంగా నిరాశతో నిండిపోయిన యువత కవులను ప్రజల పక్షం వహిస్తారా? లేదా ప్రజల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వాల వైపు నిలబడతారా? అంటూ ఆ లేఖ ద్వారా సూటిగా ప్రశ్నించారు. ఫలితంగా రచయితలు ప్రజల పక్షం వహించారు. దేశ పరిస్థితులను మార్చడానికి, దోపిడీ వ్యవస్థను కూలదోసి శ్రామిక రాజ్యాన్ని స్థాపించడానికి విప్లవం సరైన మార్గమని నమ్మి శ్రీశ్రీ, కొ.కు, వరవరరావు, కె.వి. రమణారెడ్డి, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ వంటి కార్యవర్గంతో కలిసి 1970 జులై 4న చెరబండరాజు వ్యవస్థాపక సభ్యుడిగా 'విప్లవ రచయితల సంఘాన్ని' స్థాపించారు.

దిగంబర కవిగా వ్యాధిగ్రస్తమైన ఈ సమాజానికి తన కవితలతో శస్త్రచికిత్స చేయాలనుకున్నాడు. విప్లవకవిగా ప్రజలను చైతన్యం చేయడానికి పాటను ఒక ఆయుధంగా మలిచి అనేక పాటలను రాశాడు. ఇలా చెరబండరాజు కవిగా, రచయితగానే మనకందరికి తెలుసు, కానీ ఆయన విప్లవ నాటకాలు రాశాడని చాలా తక్కువ మందికి తెలుసు.

చెరబండరాజు రెండు విప్లవ నాటకాలను, నాలుగు నాటికలను రాశాడు. అందులో 1.గ్రామాలు మేల్కొంటున్నాయి 2.గంజినీళ్ళు నాటకాలు కాగా, 1.పల్లె పిలుస్తోంది 2.వెన్నెల్లో మంటలు 3.సంఘర్షణ 4.టెంపరరీ లేబర్ నాటికలు.

నాటకాలు:

'గ్రామాలు మేల్కొంటున్నాయి' మొదటి నాటకం. దీనిలో మూడు రంగాలు ఉన్నాయి. చెరబండరాజు ఈ నాటకాన్ని 1974 జులైలో రాశాడు. మధ్యయుగపు నాటి బూర్జువా ఆలోచనలను కలిగిన భూస్వామ్య వర్గాలు గ్రామాలలో శ్రామికులను ఎలా దోచుకుంటున్నారు? వారిని ఏవిధంగా అణచివేస్తున్నారు అనే విషయాలను తెలియజేస్తూ వర్గ

పోరాటాన్ని ప్రతిబింబించేలా ఈ నాటకాన్ని రాశాడు. ప్రజలను చిత్రహింసలు పెట్టి బ్రతికుండగానే పీక్కుతినే రాబందులలాంటి దొరలు, భూస్వాములు, రౌడీలు కాంగ్రెస్ పార్టీలో చేరి వాళ్ళు చేసే దుర్మార్గాలు ఈ నాటకంలో కనిపిస్తాయి. గ్రామాలలో ఆనాడు దొరలు చేస్తున్న అన్యాయాలను ఎదిరించి శ్రామిక వర్గం 'రైతు సంఘాలను' ఏర్పాటు చేసి ప్రజా చైతన్యంతో దొరల గడీల పాలనను అంతం చేసి వారిని గ్రామాల నుంచి పారిపోయేలా చేసిన సన్నివేశాలను నాటకంలో భాగం చేశాడు. దొరలు చేసే అన్యాయాలను ఎదిరించి ప్రజలకు అండగా నిలిచే కమ్యూనిస్టులను దొరలు, ప్రభుత్వాలు రాక్షసులుగా ఎందుకు చిత్రీకరిస్తున్నాయో నాటకంలోని సంఘటనలు తెలియజేస్తాయి.

రెండవ నాటకం 'గంజినీళ్ళు'. గంజినీళ్ళు నాటకం ఎలాంటి అంకాలుకానీ, రంగాలు కానీ లేకుండా రాసిన నాటకం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ప్రజలు తినడానికి తిండి లేక గంజినీళ్ళు తాగి బతికే పరిస్థితులు ఈ నాటకంలో కనిపిస్తాయి. నాటకం ప్రధానంగా ఓట్ల బహిష్కరణను గురించి తెలియజేస్తుంది. అలాగే ఆనాటి సమాజంలో ప్రజలు ఎదుర్కొనే పేదరికాన్ని, అందుకు కారణమైన ఆర్థిక, రాజకీయ పరిస్థితులను వివరిస్తుంది. వడ్డీల పేరుతో పేద ప్రజలను, వారి దగ్గర ఉన్న కొంచెం భూమిని, వస్తువులను దోచుకునే వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలను తెలియజేస్తూ, ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికి చేసే ప్రయత్నాలు ఈ నాటకంలో కనిపిస్తాయి. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు, పోలీసులు ప్రజలను హింసలకు గురి చేయడం లాంటి విషయాలు నాటకంలో చూడవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో జరగబోయే ఓట్లను బహిష్కరించాలని కమ్యూనిస్టు పార్టీ ప్రజలను కోరడం ప్రధానంగా కనిపిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ ప్రజాపక్షం వహించి దొరలు, వడ్డీ వ్యాపారస్తులు మోసం చేస్తూ శ్రామికుల శ్రమను, వారి ఆస్తులను ఎలా దోచుకుంటున్నారో ప్రజలకు చేసి దోపిడి వర్గాలపై పోరాటం చేయడానికి వారిని సన్నద్ధం చేయడం వంటివి నాటకంలో కనిపించే అంశాలు.

నాటికలు:

చెరబండరాజు రాసిన నాటికలలో 'పల్లె పిలుస్తుంది' మొదటిది. ఈ నాటికను చెరబండరాజు మూడు రంగాలుగా రాశాడు. ఈ నాటికను 1965 అక్టోబర్‌లో రాసినట్లు తెలుస్తుంది. ఆధునిక సమాజంలో విస్తరిస్తున్న పెట్టుబడిదారి విధానం వల్ల మనిషిలో స్వార్థంతో ఎలా పెరిగిపోతుందో ఈ నాటిక తెలియజేస్తుంది. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారి వ్యవస్థలకు నిలయమైన పట్టణాలలో పెరిగిన వ్యక్తి డబ్బు కోసం సొంత తండ్రిని చంపాలని ప్రయత్నించడం నాటికలోని ప్రధాన విషయం. ఒకవైపు పల్లె జీవితాన్ని, మరోవైపు పట్నం జీవితాన్ని చిత్రిస్తూ అందులో ఉండే మానవ సంబంధాలను గురించి చెరబండరాజు చర్చించాడు. ఆధునిక కాలంలో పెట్టుబడిదారి వ్యవస్థ మనిషిని యంత్రంగా మార్చేసింది. పట్టణాలలో యాంత్రిక జీవితం గడిపే మనిషిలో స్వార్థం, అహం పెరిగి వారు సంకుచిత ఆలోచనల వైపు అడుగులు వేస్తున్నారు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం మనిషిని వసుధైక కుటుంబ భావన నుంచి, వ్యష్టి కుటుంబ భావనవైపు నడిపిస్తూ విష బీజాలను నాటి, మనిషిలో విచక్షణ జ్ఞానాన్ని లేకుండా చేస్తున్నాయి. మనిషిలో పెరిగిపోతున్న విష భావజాలాన్ని చూపెడుతూ ఆ భావజాలం నుంచి మనిషిని కాపాడుకోవడానికి పల్లెల్లో ఉండే మానవ సంబంధాలు, నైతిక విలువలు ఎలా ఉపయోగపడుతాయో చెరబండరాజు ఈ నాటికలో చూపించాడు.

'వెన్నెల్లో మంటలు' రెండవ నాటిక. సమాజంలో కనిపిస్తున్న వరకట్న సమస్యను వస్తువుగా తీసుకుని రాసిన ఈ నాటికలో స్త్రీ జీవితాన్ని చిత్రించాడు. స్త్రీ తెచ్చే కట్నం కన్నా తాను చూపించే ప్రేమ ఎంత గొప్పగా ఉంటుందో ఈ నాటికలో వివరించాడు. వరకట్నాల కోసం భార్యలను చంపి, రెండవ పెళ్ళికి సిద్ధపడే భర్తలు ఆడపిల్లల జీవితాలలో ఎలా మంటలు రేపుతున్నారో ఈ నాటిక వివరించింది. తనను పెళ్లి చేసుకునే అమ్మాయి తెచ్చే కట్నంతో హాయిగా బతకాలనుకునే మగవాడి ఆలోచనలను ఎవ్వరు అంచనా వేయలేరు అనే విషయాలను పాత్రలలో స్పష్టంగా ఆవిష్కరించాడు. భర్త డబ్బు కోసం, కట్నం కోసం వేరే పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడ్డాడని, అందుకు అడ్డుగా ఉన్న తనను చంపాలని చూస్తున్నాడని తెలుసుకున్న భార్య, ఆ నేరం తన భర్తపై పడకూడదని తనే విషం తాగి చనిపోవాలని ప్రయత్నిస్తుంది. చనిపోతూ కూడా భర్త బాగుండాలని ఆలోచించిన ఆ స్త్రీ స్వచ్ఛమైన ప్రేమ ముందు భర్తకు డబ్బుపై ఉన్న మోహం పూర్తిగా తొలగిపోయి తను ఎంత పెద్ద తప్పు చేశాడో తెలుసుకుని పశ్చాత్తాపం పడతాడు. స్త్రీని శారీరక సుఖాలు తీర్చే బానిసగా చూడటం, అదనపు వరకట్నం కోసం వేధించడం, లేదా చంపటం, వంటివి చేస్తున్న ఈ సమాజానికి ఆమె గొప్పతనాన్ని, త్యాగ శీలాన్ని కుటుంబం పట్ల తనకున్న అంకిత భావాన్ని తెలియజేస్తూ ఆధునిక సమాజానికి స్త్రీ గొప్పతనాన్ని ఈ నాటిక ద్వారా తెలియజేశాడు.

చెరబండరాజు రాసిన నాటికల్లో మూడవది 'సంఘర్షణ'. ఈ నాటిక రచన కాలం 4-11-1971 అని తెలుస్తుంది. ఈ సమాజంలో ఒక్కొక్కరు ఒక్కొక్క ఆలోచనను కలిగి ఉంటారు. ఎవరు నమ్ముకున్న సిద్ధాంతాలను వాళ్ళు పాటిస్తూ

జీవిస్తుంటారు. ఒకరి అభిప్రాయంతో మరొకరికి పొందిక ఉండకపోవచ్చు. ఇలాంటి సమాజంలో జీవిస్తున్న వారు ఒకరు పెట్టుబడిదారీ ఆలోచనలను, ఒకరు కమ్యూనిజపు ఆలోచనలను, మరొకరు రాడికల్స్ సిద్ధాంతాలను నమ్ముకున్న వారు ఒకే కుటుంబంలో ఉంటే వారి మధ్య ఏర్పడే భావజాల వైరుధ్యం ఎలా ఉంటుందో ఈ నాటిక చిత్రీకరించింది. నాటికలో పెట్టుబడిదారుడికి పుట్టిన ముగ్గురు పిల్లలు తాము ఎంచుకున్న మార్గాల వల్ల ఒకరికి ఒకరు శత్రువులుగా ఎలా మారారో ఈ నాటిక వివరిస్తుంది. వీరు ఎంచుకున్న మార్గాల వల్ల వారి మధ్య వర్గ పోరాటం మొదలవుతుంది. పెట్టుబడిదారి భావజాలం ఉన్న తండ్రి, అతని పెద్ద కొడుకు కమ్యూనిస్టు ఆలోచనలు ఉన్న రెండవ కొడుకుని బంధిస్తారు. నక్సలైటుగా మారి వర్గ పోరాటంలో శ్రామిక వర్గం వైపు నిలబడి దోపిడి వ్యవస్థను నాశనం చేయడానికి పోరాటం చేస్తున్న మూడవ కొడుకును ఇద్దరు కలిసి చంపుతారు. వర్గ పోరాటంలో తల్లయినా తండ్రయినా వర్గ శత్రువు వర్గ శత్రువే. అలాంటి వాళ్ళ విషయంలో దయా దాక్షిణ్యాలకు తావులేదనే విషయాన్ని 'సంఘర్షణ' నాటిక ద్వారా తెలియజేశాడు.

నాలుగు నాటికలలో చివరిది 'టెంపరరీ లేబర్'. కంపెనీలలో పని చేసే టెంపరరీ లేబర్ల జీవితాలను ఈ నాటికలో చిత్రీకరించాడు. కంపెనీలలో పర్మినెంట్ లేబర్లకు, టెంపరరీ లేబర్లకు మధ్య తేడాలను వివరిస్తూ టెంపరరీ లేబర్ శ్రమను మరియు జీవితాలను కంపెనీలు ఎలా దోచుకుంటున్నాయో వివరించాడు. శాశ్వత కార్మికులకు ఉండే ఏ హక్కులు టెంపరరీ లేబర్లకు ఉండవు. కంపెనీలు కొంతకాలం పాటు పని చేయడానికి టెంపరరీ లేబర్లను నియమించుకుంటుంది. వీరికి ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కానీ ఉద్యోగ భద్రత కానీ ఉండదు. యాజమాన్యం ఎప్పుడైనా వీరిని తీసివేయవచ్చు. వీరికి పని చేసేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగినా కంపెనీకి బాధ్యత ఉండదు. అలాగే ప్రమాదానికి గురైన వ్యక్తికి మరియు అతని కుటుంబానికి ఎలాంటి నష్ట పరిహారం కూడా కంపెనీ చెల్లించదు. కంపెనీలు వారి శ్రమను దోచుకుంటున్నాయి కానీ వారికి ఎలాంటి భద్రతను ఇవ్వడానికి ఇష్టపడవు. వీరికి ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు రోడ్డునపడతాయి. కంపెనీలలో పని చేస్తూ దోపిడికి గురవుతున్న వారి జీవితాలను రచయిత ఈ నాటికలో చిత్రించాడు. నాటికలో టెంపరరీ లేబర్లను పర్మినెంట్ చేస్తే వారికి ఎలాంటి హక్కులు వస్తాయో కంపెనీ యజమానీ, గుమాస్తా సంభాషణల ద్వారా తెలుస్తాయి. అలాగే యాజమాన్యాల కింద పనిచేసే యూనియన్ నాయకులు తమని నమ్ముకున్న కార్మికులను వెన్నుపోటు పొడవటం వంటివి నాటికలో కనిపిస్తాయి. టెంపరరీ లేబర్ ప్రమాదంలో చనిపోతే యజమాని వారిపట్ల బాధ్యతగా వ్యవహరించకపోవడంతో కార్మికులందరూ కలిసి యజమానిని బెదిరించి అతని కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చేస్తారు. అలాగే తోటి కార్మికులకు అండగా నిలబడతారు. టెంపరరీ లేబర్లను పర్మినెంట్ చేయడం కోసం, అలాగే కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడానికి సిద్ధం అవుతారు. పెట్టుబడిదారి వ్యవస్థను అంతం చేసి, శ్రామిక వర్గాన్ని అధికారంలో నిలబెట్టడమే వర్గపోరాట అంతిమ లక్ష్యం అని నాటికలోని చివరి మాటలను పరిశీలిస్తే నాటిక ఉద్దేశ్యం అర్థమవుతుంది. కార్మిక హక్కుల కోసం జరిగే పోరాటాన్ని చిత్రీకరించిన ఈ నాటిక మొదటి ప్రదర్శన 1973లో హైదరాబాదులో మేడే ఉత్సవాల సందర్భంగా రాం నగర్, బోయిగూడా కార్మికవాడల్లో జరిగిందని రచయిత తెలియజేశాడు.

ముగింపు:

ప్రతి నాటకంలో వర్గ పోరాటం ప్రతిబింబించేలా చెరబండరాజు విప్లవ నాటకాలను రాశాడు. చెరబండరాజు విప్లవ సాహిత్యంలో నాటకాలను ఆయుధంగా వాడుకున్నాడని వాటిని చూస్తే అర్థమవుతుంది. 'టెంపరరీ లేబర్' నాటికను సృజన మాస పత్రికలో 1973 జులై నెలలో ప్రచురించారు. 'గంజినీళ్ళు' నాటకం అరుణతార పత్రికలో 1984 నవంబర్ నెలలో ప్రచురితమైంది. చెరబండరాజు నాటకాలను, నాటికలను మొత్తం ఆరింటిని కలిపి విప్లవ రచయితల సంఘం, విజయవాడ వారు 'గంజినీళ్ళు నాటకాలు-నాటికలు' పేరుతో 2003లో ప్రథమ ముద్రణగా తీసుకుని వచ్చారు. 'చెరబండరాజు సాహిత్య సర్వస్వం2'తో వచ్చిన రెండవ ముద్రణలో కూడా విరసం వారే ఈ నాటకాలను తిరిగి పునర్ముద్రించారు. ఈ నాటకాలలోని వస్తువు ద్వారా సమాజంలోని వర్గ పోరాటాన్ని చిత్రీకరిస్తూ విప్లవ సాహిత్యాన్ని స్పష్టంగా దృశ్య రూపకంగా ప్రదర్శించడంలో పరిపక్వతను సాధించారు.

ఉపయుక్త గ్రంథాలు:

1. అరుణతార పత్రిక, నవంబర్, 1984.
2. కాశీం, సి. 'తెలంగాణ సాహిత్యం.' హైదరాబాద్: స్నేహ ప్రచురణలు, 2015.
3. 'గంజినీళ్ళు నాటకాలు-నాటికలు.' విజయవాడ: విప్లవ రచయితల సంఘం, 2003 (ప్రథమ ముద్రణ)
4. రాజయ్య, అల్లం(సంపాదకుడు). 'చెరబండరాజు సాహిత్య సర్వస్వం 2.' హైదరాబాద్: విరసం ప్రచురణలు, 2022. (ద్వితీయ ముద్రణ).
5. సృజన పత్రిక, జులై 1973.

రచయిత: తెలుగుశాఖ, పరిశోధక విద్యార్థి, ఓయూ.

సాహిత్య
పరిశోధన

యాది-సదాశివ

వెంకన్న

వ్యాస సంగ్రహం

సామల సదాశివ తెలుగు సాహిత్యంలో విశిష్టమైన రచయితగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, సాంస్కృతిక చరిత్రకారుడిగా గుర్తింపు పొందారు. ఆయన రచనల్లో తెలంగాణ సామాజిక జీవితం, ప్రజల సంస్కృతి, భాష, సంగీతం, సాహిత్యం, కళలు, వ్యక్తుల జ్ఞాపకాలు వంటి అనేక అంశాలు సహజమైన శైలిలో ప్రతిఫలిస్తాయి. ముఖ్యంగా "యాది" వంటి రచనల్లో ఆయన తన జీవితానుభవాలను మాత్రమే కాకుండా, తన కాలంలోని సామాజిక-సాంస్కృతిక పరిణామాలను కూడా ఆవిష్కరించారు. సదాశివ రచనా శైలి సరళమైనదైనా భావగంభీరమైనది. ఆయన అనేక విషయాలను ప్రత్యక్ష అనుభవాల ఆధారంగా వివరిస్తూ, పాఠకుడికి ఆనాటి సమాజాన్ని కళ్లముందు నిలిపే ప్రయత్నం చేశారు. పండితులు, రచయితలు, కళాకారులు, గురువులు, మిత్రులు, సామాన్యులు ఇలా తన జీవితంలో పరిచయమైన అనేక వ్యక్తులను ఆయన ఆత్మీయంగా చిత్రించారు. వారి వ్యక్తిత్వంలోని విశిష్టతలను, మానవీయ గుణాలను, సాహిత్య సేవలను గుర్తుచేస్తూ జ్ఞాపకాలను సాహిత్యరూపంలో మలిచారు.

సదాశివకు ఉర్దూ, హిందీ, మరాఠీ, ఫార్సీ, ఆంగ్ల భాషలతో పరిచయం ఉండటం ఆయన రచనలకు విస్తృతమైన సాంస్కృతిక నేపథ్యాన్ని అందించింది. వివిధ భాషల సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా తెలుగు పాఠకులకు ఇతర భాషల సాహిత్య సంపదను పరిచయం చేశారు. సంగీతం, చిత్రకళ, సాహిత్యం వంటి కళారూపాలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన "యాది"లో స్పష్టంగా కనిపిస్తుంది. సదాశివ రచనల్లో తెలంగాణ మాండలిక జీవనశైలి, సామాజిక సంబంధాలు, ఆనాటి విద్యావ్యవస్థ, పత్రికా ప్రపంచం, సాహిత్య వాతావరణం వంటి అంశాలు సహజంగా చోటుచేసుకున్నాయి. ఆయన జ్ఞాపకాలను కేవలం వ్యక్తిగత అనుభవాలుగా కాకుండా ఒక కాలానికి సంబంధించిన సామాజిక-సాంస్కృతిక దస్తావేజులుగా మలిచారు. అందువల్ల "యాది" వ్యక్తిగత జ్ఞాపకాల సంకలనం మాత్రమే కాకుండా తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్రకు విలువైన ఆధారంగా నిలుస్తుంది. ఇటువంటి బహుముఖ ప్రజ్ఞ గల సదాశివ సాహిత్యాన్ని, విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ వ్యాసాన్ని రచించాను.

సాంకేతిక పదాలు

సామల సదాశివ, యాది, జ్ఞాపకాలు, తెలంగాణ సంస్కృతి, తెలుగు సాహిత్యం, ఉర్దూ సాహిత్యం, సంగీతం, కళలు, సాహిత్య విమర్శ, అనువాదం, మానవీయ విలువలు, సాంస్కృతిక చరిత్ర.

ఉపోద్ఘాతం

తెలుగు సాహిత్యంలో వ్యక్తిగత జ్ఞాపకాలను సామాజిక, సాంస్కృతిక చరిత్రతో మేళవించిన రచయితల్లో సామల సదాశివ ఒకరు. ఆయన రచనలు ఒక వ్యక్తి జీవితానుభవాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక సమాజపు జీవన విధానాన్ని, భాషా వైవిధ్యాన్ని, కళా సాహిత్య అభిరుచులను, మానవ సంబంధాలను ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా 'యాది' గ్రంథం ద్వారా సదాశివ తన బాల్యం, విద్యాభ్యాసం, పరిచయమైన వ్యక్తులు, సాహిత్య వాతావరణం, సంగీతం, కళలు వంటి అనేక విషయాలను ఆత్మీయంగా పాఠకులకు అందించారు.

ఈ రచనలో ఆయన చెప్పిన సంఘటనలు చిన్నవిగా కనిపించినప్పటికీ వాటి వెనుక ఒక కాలం యొక్క సామాజిక జీవితం దాగి ఉంటుంది. వ్యక్తుల జ్ఞాపకాల ద్వారా సమాజాన్ని, సమాజం ద్వారా తన కాలపు సంస్కృతిని పరిచయం చేయడం సదాశివ రచనా ప్రత్యేకత. అందుకే ఆయన రచనలు సాహిత్య విలువతో పాటు చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని కూడా సంతరించుకున్నాయి.

విషయ విశ్లేషణ

సదాశివ 'యాది'ని మాత్రం ఇక్కడ సూక్ష్మంగా విశ్లేషణ చేస్తున్నాను. యాది వ్యాసాలను సదాశివ ఆత్మకథ

అని చెప్పవచ్చు. సదాశివ జీవితంలో జరిగిన చాలా సంఘటనలు 'యాది'లో కనబడతాయి. తనకు జరిగిన సన్మానాలు మాత్రమే చెప్పుకోలేదు. అవమానాలను కూడా నిర్మోహమాటంగా చెప్పినాడు. అయితే తనను అవమానించిన వారి గురించి, ఏ మాత్రం కోపం ప్రదర్శించకుండా చాలా సంయమనంతో వివరించడం సదాశివ గొప్ప వ్యక్తిత్వాన్ని తెలియపరుస్తుంది. సదాశివ యాది గ్రంథంలో ఆనాటి సమాజం, విలువలు, బంధుత్వాలు, ప్రేమలు, ఆప్యాయతలు కనబడతాయి. వ్యాపారం చేసిన అందులో నిజాయితీ ఉండేదని. ఆప్యాయత ఉండేదని ఊటకుల్లమ్మ, చింతల నర్సమ్మ గురించి చెప్పిన విషయాల వలన అవగతమవుతుంది. అక్కడ సదాశివ చెప్పిన రెండు, మూడు మాటలు ఈనాటి సమాజంతో పోల్చి చూసుకోవాలనిపిస్తుంది. "ఆమెకు రూపాయల కంటే తన దగ్గర తినేవాళ్లు కడుపునిండా సంతృప్తిగా తినాలన్నదే ముఖ్యం. అన్నంలో సున్నం నీళ్లు కలిపే సంస్కారం లేదప్పటికి" ***(భోజనానికి రెండు రూపాయలు-యాది గ్రంథం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్ 2005, పుట సంఖ్యం 51).*** ఇటువంటి చక్కని ఆనాటి విషయాలు 'యాది'లో కొల్లలుగా ఉన్నాయి. సదాశివ రచించిన 'యాది'లోని విషయాలను విశ్లేషిస్తూ ఈ వ్యాసంను పూర్తి చేస్తున్నాను.

సదాశివ రచనా శైలి సుందరమైనది. తన రచనల వలన ఎందరో పాఠకులను సంపాదించుకున్నాడు. స్వతహాగ ఉపాధ్యాయుడు కనుక ఏ విషయాన్నైనా చక్కగా ఎదుటి వారికి సులభంగా అర్థమయ్యే లాగా ముచ్చట్లు చెప్పినట్లు చెప్తాడు. ఎట్లా చెప్తాడో అట్లా రాస్తాడు. సదాశివ ఇంటికి వచ్చిన వాళ్లు వారి సతీమణి తయారు చేసిన చాయి తాగి సదాశివ చెప్పిన అనేక విషయాలు విని ఆనందంగా వెళ్లిపోయేవారంట. అట్లా వచ్చిన వారిలో "శ్రీ ఫణి కుమార్ గారు ఒకరు. ఇతను ఉట్నూరు డిప్యూటి కలెక్టర్‌గా పని చేసేవాడు. సమయం దొరికినప్పుడల్లా సదాశివ ఇంటికి వచ్చి చాలా విషయాలు అడిగి తెలుసుకొని వెళ్లిపోయేవాడు. అలా వెళ్లిపోతు పోతూ 'సదాశివ మాస్టారు' అని ఒక వ్యాసం రాసి ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురించినాడు. తర్వాత ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఏటూరు నాగారంకు ఇంకా కొందరిని పరిచయం చేస్తూ ధారావాహికగా రాసిన వ్యాసాలన్ని కలగలిపి 'గోదావరి గాథలు' పేరిట పుస్తక రూపంలో తీసుకొని వచ్చినాడు. అయితే ఆనాటి నుండి చాలా మంది సదాశివ గారిని సదాశివ మాస్టారు అని పిలవడం మొదలుపెట్టినారు" ***(ఫణి కుమార్, గోదావరి గాథలు, పుట 51-57).*** అదే విధంగా సదాశివ ముచ్చట్లను విని ఆనందించి అక్కడితో ఊర్కోనకుండా 'మీ జ్ఞాపకాలను గ్రంథస్తం చేయడం నా పత్రికలలో ప్రచురిస్తాను అన్నవారు కే రామచంద్ర మూర్తి గారు. వార్తా దినపత్రిక సంపాధకులుగా ఉన్న రామచంద్ర మూర్తిగారు వార్తా దిన పత్రిక ఆదివారం సంచిక 08.02.2002 నుండి 06.07.2003 వరకు 55 వారాలకు 55 వ్యాసాలు రాసినాడు. ఈ యాది వ్యాసాలు పాఠకులను విశేషంగా అలరించినాయి. యాది వ్యాసాలకు శీర్షిక మాత్రం సదాశివకు స్ఫురించలేదు. కాని వార్తా పత్రికలోనే పని చేస్తున్న తెలిదేవర భానూమూర్తి గారు 'యాది' అనే శీర్షికను సూచించారని సామల రాజవర్ధన్ పేర్కొన్నాడు.

"సదాశివ గారు రాయడం మొదలుపెట్టినారు కాని దానికి శీర్షిక ఏదో నిర్ణయింలేదు. తెలిదేవర భానుమూర్తిగారు యాది అని సూచించినారట. ఈ విషయాన్ని కూడా సదాశివ గారు యాదిలో యాది చేసుకున్నారు. ఈ యాది ఎంతా ప్రచారం పొందిందంటే సదాశివ అంటే యాది సదాశివనేనా అనుకునేంత" **(రాజవర్ధన్ సామల, సదాశివ మోనోగ్రాఫ్, తెలుగు అకాడమీ, పుట 39)**. యాది వ్యాసాలు మొదలు కావడం కూడా గమ్మత్తుగా మొదలవుతాయి. సదాశివ గొప్ప ఉర్దూ పంటితుడు కనుక 'సఫీలఖ్నవి' అనే ఉర్దూ కవి గజల్‌తోని ఒక పంక్తితో మొదలుపెట్టినారు. 'జరా ఉమ్రెరఫ్తాకొ ఆవాజ్ దేనా!' గడిచిపోయిన నా జీవితాన్ని వెనక్కి పిలవరా! అని భావం. అంటే సదాశివ తన గత జీవితాన్ని వెనక్కి పిలిచి పాఠకులకు అందించబోతున్నాడు. ఎంత చక్కని ప్రారంభం. అయితే పాత ముచ్చట్లు ఎవరైనా వింటారా? అని ఎవరైనా అడగవచ్చు కదా! దానికీ సదాశివనే జవాబు చెప్తున్నారు. "జోసునా ఉస్కా భలా జో నసునా ఉస్కా భలా!" అంటే ఎవరు విన్నారో వాళ్లకు మేలగుగాక. ఎవరు వినలేదో వాళ్లకూ మేలగుగాక. ఇట్లా ప్రారంభమయ్యే యాది తమ గారాల మనుమడు సామల నాగ కార్తీక్ కు అంకితమిస్తూ 'వారీ కార్తీకా ఇగపటు' అన్నారు.

'యాది' వ్యాసాలు ఈ పుస్తకంలో 49 వున్నాయి. అయితే 'వార్త' ఆదివారం సంచికలో మాత్రం 55 వారాలు 55 వ్యాసాలు ప్రచురితమైనాయి. అంటే వార్తలో వచ్చిన కొన్ని చిన్న వ్యాసాలు రెండింటిని కలిపి కొంత పేరు మార్చి ఒకటిగా చేసినందున 55 వ్యాసాలు 49కి కుదించబడినాయి. 'యాది' వ్యాసాల వార్త ఆదివారం సంచికలో ప్రచురించ

బడుతూ వున్న కాలంలోనే అసంఖ్యాకమైన పాఠకులు ఉత్తరాల ద్వారా తమ ప్రశంసల వర్షం కురిపించినారు. తరువాత 2005వ సంవత్సరం విశాలాంధ్ర వారు యాదిని గ్రంథ రూపంలో విడుదల చేసినారు. అవన్నీ హాట్ కేకుల వలె అమ్ముడు పోయినాయి. చివరికి రచయిత వద్ద కూడా ఒక్క కాపీ లేకుండా పోయింది. ఈ నాటికీ పాఠకులు యాది పుస్తకం దొరుకుతుందా? అని అన్వేషిస్తూనే వున్నారు. కానీ, విశాలాంధ్ర వారు మలిముద్రణ వేయలేదు. యాది పుస్తకంలో సదాశివ హృదయం కనబడుతుందని ఆయన సాత్వికత, ప్రేమ గుణం మనకు స్పష్టంగా కనిపిస్తుందని శ్రీ ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు అభిప్రాయపడ్డారు.

'యాది' అంటే జ్ఞాపకం. సదాశివ గారిది ఆదిలాబాద్ జిల్లా, ఉర్దూ మాధ్యమంలో చదివినారు. నిజాం రాజ్యాన్ని చూసినవారు. మహారాష్ట్ర సరిహద్దుల్లోని జిల్లా వారు అందువల్ల ఉర్దూ, మరాఠీ భాషలు నేర్చినవారు. పారశీక, ఆంగ్ల, హిందీ భాషలు బాగా తెలిసిన వారు. తెలుగు అధ్యాపకులుగా పనిచేసినవారు. భారతి వంటి అగ్రస్థాయి పత్రికలలో వైదుష్య పూరిత రచనలు చేసినవారు. ఆయన పరిచయాలను మనం చదువుతున్నపుడు. ఆయన సాత్వికత, ప్రేమ గుణం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ యాది గ్రంథంలో ఈ లక్షణం తొణికిసలాడుతూ కనిపిస్తుంది. " 'యాది' ఇది జ్ఞాపకాలను గుదిగుచ్చిన వ్యాస సంపుటి. అయినప్పటికీ ఇందులో మనకు అక్షరాక్షరమూ వారి మేధోసంపత్తి కన్నా, వారి హృదయ స్పందనలే ఎక్కువగా కనిపిస్తవి. ఈ 'యాది'ని సదాశివ గారు గుండెతో రాశారు. అందువల్ల ఈ గ్రంథం మొదటి పుట నుంచి చివరి పుట వరకు ఏకబిగిన చదివిస్తుంది". అన్నారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య ***(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, ఏప్రిల్ 2006, పుట: 25, వ్యాస శీర్షిక: మనసున్న సదాశివ మహోన్నత జ్ఞాపకాలే యాది)***. దీనిని బట్టి సదాశివ యాది పాఠకులను ఏ విధంగా అలరించిందో తెలుస్తున్నది. ఒక్క యాదే కాదు సదాశివ రాసిన ఏదైనా అంతే ఆప్యాయితతో పాఠకులు ఆదరించినారు. ఏది రాసినా ఆత్మీయంగా రాయడం సదాశివ గారి తత్త్వం. విశ్వనాథ సత్యనారాయణ గారు ఎన్నో సందర్భాలలో సదాశివ గొప్పతనాన్ని వివరించారు. గొప్ప గొప్ప వాళ్ల గురించి ఎన్నెన్నో సంగతుల్ని తన జ్ఞాపకాల గని నుండి తవ్విపోశారు. అంటూ చాలా వివరంగా యాది గ్రంథాన్ని విశ్లేషించారు. చివరగా "ఇలాంటి అపురూపమయిన అనుభవాలతో మనల్ని కదిలించే మనోహర గ్రంథం యాది అని ముగించినారు" ***(ఆంధ్రభూమి దినపత్రిక 28 మే 2006, పుట: 13, వ్యాస శీర్షిక: సదాశివ జ్ఞాపకాలు. ఆనంద విషాద పార్శ్వాలు)***.

యాదిలో నవరసాలున్నాయి. ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా యాది నచ్చింది. కొందరికి యాదిలోని వ్యక్తులు వారి వ్యక్తిత్వాలు, స్నేహాలు, బంధుత్వాలు, బాంధవ్యాలు, గురుశిష్య పరంపర. గురువులపై శిష్యుల గౌరవాదరాలు. శిష్యులపై గురువుల ప్రేమ, వాత్సల్యాలు. సంగీత సాహిత్య విషయాలు మొదలైన రకరకాల భావాలను చాలా మంది పాఠకులు వ్యక్తం చేసినారు. డి.వి.ఆర్ భాస్కర్ గారికి యాది గ్రంథంలో ఉర్దూ సాహిత్య విషయాలు చాలా నచ్చడమే గాక ఉర్దూ సాహిత్యం మీద మక్కువ గౌరవం కలుగుతుందని భావించినారు. "సదాశివ యాది చేసిన విషయాలను చదువుతూ ఉంటే ఉర్దూ సాహిత్యం మీద మక్కువ గౌరవం కలగటం కద్దు. అలాగే ఉర్దూను ప్రేమించిన అన్యభాషీయుల గురించిన విషయాలు కూడ తెలుస్తాయి. ఎన్నో అద్భుతమైన పేర్లు, చక్కటి గజళ్ల గురించి వాటిని అందిచిన ఉర్దూ కవులు సాహితీ వేత్తల గురించి కనీసం రేఖా మాత్రంగానైనా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. భాషకు సాహిత్యానికి కులమతాలు లేవన్న నిజం అవగతమవుతుంది. "ఇన్ని పేజీలున్న ఈ పుస్తకం ఏ మాత్రం విసుగనిపించకపోగా చదువుతున్న కొద్దీ ఆసక్తి కలిగించేలా ఉంటుంది. ఈ విషయాలన్ని పుస్తకం చదివినట్లుగా కాక పిచ్చాపాటి కూర్చోని మాట్లాడుకుంటున్నట్లుగా అనిపించడం ఇందులోని గొప్పతనం. ఎన్ని ముచ్చట్లు చెప్పినా వాటిలో సమతుల్యత లోపించకపోవడం విశేషం'' ***(నవ్య, వారపత్రిక, 19.04.2006, పుట:41, వ్యాసం పేరు: తరగని తీపి జ్ఞాపకాల నిధి యాది)*** అంటున్నారు డి.వి.ఆర్ భాస్కర్ గారు.

సదాశివ గారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం 'స్వరలయలు' గ్రంథానికి 2011వ సం॥నికి గాను లభించింది. సదాశివ గారికే గాక వారి చాలా మంది అభిమానులు 'యాది' గ్రంథానికే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభిస్తుందని భావించినారు. సుప్రసిద్ధ రచయిత, పరిశోధకులు అయిన అక్కిరాజు రమాపతిరావు గారు ఈ విషయాన్ని గురించి ఆంధ్రజ్యోతిలో ఒక వ్యాసం రాస్తూ 'యాది' గురించి ఇట్లా అన్నారు. "శ్రీకాకుళం నుంచి చిత్తూరు

వరకు, అనంతపురం నుండి ఆదిలాబాద్ వరకు తెలుగు సాహిత్యాభిమానులు, తెలుగు ప్రేమికులు, తెలుగో తెలుగో అని ఉత్సాహపడేవాళ్లు, ఉద్రేకపడేవాళ్లు, ఆహా! ఇన్నాళ్లకు ఈ వార్తవిని, పత్రికలలో చూసి ఆహా! ఎంత మంచి వార్త అని సంబరపడిపోతారు. సాహిత్య అకాడమీని అభినందిస్తారు. ఎవరీ సామల సదాశివ? ఆయన ఎక్కడుంటారు? ఏం రాశారు? ఆయన రచనలు ఎక్కడ లభిస్తాయి? అనే జిజ్ఞాస ఇప్పటి యువతరం వారికి కలుగవచ్చు. వారి స్వీయ చరిత్ర పేరు 'యాది'. అది సంపాదించి దానిని చదివితే, ఆయన ఎంత సహృదయుడో, పెద్ద మనిషో, ఉత్తమ సాహిత్య, సంగీత సంస్కార సంపన్నుడో ఇట్టే తెలిసిపోతుంది. తెలుగులో సుమారు ఇప్పటికే 200 పైనే స్వీయ చరిత్రలు వచ్చాయి.

ముగింపు

సామల సదాశివ రచనలు తెలుగు సాహిత్యంలో జ్ఞాపక సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించాయి. 'యాది'లో వ్యక్తిగత అనుభవాలు, పరిచయమైన వ్యక్తుల జ్ఞాపకాలు, తెలంగాణ సమాజపు జీవనచిత్రాలు, భాషా వైవిధ్యం, సంగీత, సాహిత్య కళా సంపద సమన్వయమై కనిపిస్తాయి. సరళమైన భాషలో లోతైన భావాలను వ్యక్తీకరించడం ఆయన ప్రత్యేకత. సదాశివ జ్ఞాపకాలను రాయడం ద్వారా గతాన్ని మాత్రమే గుర్తుచేయలేదు, ఆ గతంలోని విలువలను, మానవ సంబంధాలను, సాహిత్యాభిరుచులను, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించారు. అందువల్ల "యాది" ఒక వ్యక్తి స్వీయ చరిత్రగా మాత్రమే కాకుండా తెలంగాణ సాహిత్య-సాంస్కృతిక జీవనానికి అద్దం పట్టే విలువైన గ్రంథంగా నిలుస్తుంది. తెలుగు పాఠకులు సదాశివ రచనలను చదివినప్పుడు ఒక రచయిత జీవితాన్ని మాత్రమే కాకుండా, ఒక కాలపు జ్ఞాపకాలను, ఒక సమాజపు సంస్కృతిని కూడా అనుభవించగలుగుతారు.

ఉపయుక్త గ్రంథసూచి

1. **సదాశివ మోనోగ్రాఫ్**, రచన: రాజువర్ధన్ సామల, ప్రపంచ తెలుగు మహా సభల ప్రచురణ. తెలుగు అకాదమా హైదరాబాద్-2017.
2. సదాశివ సామల, సొంత ప్రచురణ, **సాంబశివ శతకము**. నేత ప్రింటింగ్ ప్రెస్ హైదారాబాద్:1950.
3. సదాశివ సామల, సొంత ప్రచురణ, **నిరీక్షణము**, నేత ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్:1952.
4. సదాశివ సామల, సొంత ప్రచురణ, **మంచి మాటలు**, సీతప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్:1952
5. సదాశివ సామల, **మలయమారుతాలు**, తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాద్:2001.
6. సాముల సదాశివ ప్రత్యేక సంచిక. జయింతి సాహిత్య త్రైమాసిక పత్రిక, ఎప్రిల్ 9 సెప్టెంబర్:2012

రచయిత: పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఓయూ.

<u>రచయితలకు సూచనలు:</u>

1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.

2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.

3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.

4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.

5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.

ఉద్యమకవి దాశరథి

ఇమ్మిడి మహేందర్

తెలంగాణ నిత్య చైతన్యవంతమైన నేల. ఉద్యమాలకు మరో పేరు. పోరాటాలకు ఊపిరిలూదిన తల్లితనం తెలంగాణది. తరతరాలుగా దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటాను ఎగరవేసిన చరిత్ర దీని సొంతం. ఇక్కడి ప్రజలు సహనం వీడిన తర్వాత ఉద్యమాలకు పట్టం కట్టి, భారతదేశ చరిత్రలో తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమైన చరిత్రను నిర్మాణం చేసారు. సమాజంలోని అల్లకల్లోల పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన సామూహిక చైతన్య రథాలు ఇక్కడి ఉద్యమాలు. ఇంతటి చైతన్యం కలిగిన నేలలో పుట్టిన దాశరథి సహజంగానే ఉద్యమాలలో భాగం అయ్యాడు. తద్వారా ఉద్యమకవిగా తనని తను నెలకొల్పుకున్నాడు.

తెలుగు సాహిత్యంలో తెలంగాణ పోరాట అస్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టిన కవి దాశరథి. తెలంగాణలోని నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగిత, భూస్వామ్య పీడన, సామాజిక, రాజకీయ అంతరాలు, నిత్య నిర్బంధం, సాంస్కృతిక అణచివేత దాశరథిని కదిలించాయి. తనవంతు ప్రయత్నంగా తెలంగాణ సమాజాన్ని చైతన్యవంతం చేసాడు. తన కవిత్వం ద్వారా ప్రజలను ఉద్యమాలకు దగ్గర చేసాడు. ప్రజలు కోరుకున్న సమసమాజ సాధనలో ఒక కవిగా, సృజనకారుడిగా తనవంతు పాత్రను పోషించాడు. దాశరథి వ్యక్తిగత జీవితం మొదలు ఉద్యమ జీవితం వరకు అనేక మలుపులు ఉన్నాయి. నిజాం వ్యతిరేక పోరాటం, జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం, అభ్యుదయోద్యమం వంటి అనేక ఉద్యమాల్లో ప్రత్యక్షంగా, కొన్నిసార్లు పరోక్షంగా వెన్నుదన్నుగా నిలిచాడు.

1935వ సంవత్సరంలోనే దాశరథి కలం ఎత్తిపట్టి, అన్యాయాన్ని ఎదురిస్తూ కవిత్వం రాసాడు. తన చుట్టూ ఆవరించి ఉన్న దుఃఖం, అణచివేత, దౌర్జన్యాలు, దొరతనం, దురుసుతునం, పేదలు పడుతున్న కష్టాలు, బాధలను కళ్లారా చూసి హృదయం ద్రవించి, తన కవిత్వాన్ని ఈ సమాజంపై ప్రసరింపజేసాడు. ***"నిండు కుండలు నీల్గుతున్నాయి – నిదుర మత్తున ఒక్కమూలన, ఒట్టి కుండలు దొర్లుతున్నాయి –– ఒక్క మూలన దాహ వేదన"*** అంటూ అన్యాయాన్ని గుర్తించి, సమాజానికి చెప్పే ప్రయత్నం చేసాడు. ఆ తర్వాత దాశరథి కవిగా అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, మహాబోధి, నవమి, నవమంజరి, అమృతాభిషేకం, గాలిబ్ గీతాలు, కవితా పుష్పకం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, ధ్వజమెత్తిన ప్రజ, జ్వాలాలేఖిని వంటి రచనలను చేసాడు. ప్రతి పుస్తకంలో దాశరథిని భిన్నకోణాలలో దర్శించవచ్చు. దాశరథి కవిత్వంలో జాతీయ దృష్టి, రాష్ట్రీయ దృష్టి, తెలంగాణ దృష్టి ప్రధానంగా కనిపిస్తాయి. దాశరథి తాను భారతీయుడుని, తర్వాత తెలుగు వాడని గుర్తించమని అంటాడు. నిజానికి 1969 ఉద్యమంలో దాశరథి విశాలాంధ్ర వైపే నిలబడ్డాడు. భారత జాతీయ పతాకాన్ని చాలా గౌరవించేవాడు. అదే సమయంలో కవి అనేవాడు విశ్వమానవునిగా ఉండాలనే ఎరుకను కలిగి ఉండేవాడు. అందుకే తన కవిత్వంలో సామ్యవాద భావాలు ఎక్కువగా పరచుకొని ఉండేవి. పరులకు సహాయపడాలనే, అందరిని సమానంగా చూడాలనే చూపు దాశరథికి ఉంది కాబట్టే ఆయన అనేక ఉద్యమాలలో భాగస్వామ్యం కాగలిగాడు.

నిజాం వ్యతిరేకోద్యమం:

దాశరథికి కవి సమ్మేళనాలలో ఇష్టంగా పాల్గొనేవాడు. తన చదువు పూర్తవుతుండగానే నిజాంకి వ్యతిరేకంగా జరిగే అనేక రాజకీయ కార్యక్రమాలలో భాగస్వామ్యం అయ్యాడు. అప్పటికే ఆంధ్రజనసంఘం, ఆంధ్రమహాసభ వంటి సంస్థలు తెలంగాణ ప్రజలకు అందించిన చైతన్యాన్ని అంది పుచ్చుకున్నాడు. ఆనాడు ఆంధ్రమహాసభ నేతృత్వంలో జరిగిన అనేక రాజకీయ కార్యక్రమాలు ఆనాటి యువతను అమితంగా ఆకర్షించాయి. ఆంధ్రమహాసభ అందించిన రాజకీయ చైతన్యంతో గ్రామగ్రామాన నిజాం వ్యతిరేక ఉద్యమం ప్రారంభమయ్యింది. నిజాం ప్రజా వ్యతిరేక పోకడలకు వ్యతిరేకంగా, నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం నిర్వహిస్తున్నప్పుడు, బాధ్యత కలిగిన తెలంగాణ బిడ్డగా ఆ పోరాటాలలో భాగం కావాలని దాశరథి నిర్ణయించుకున్నాడు. కష్టపడి సృష్టించిన సంపద జీవించే ప్రతి మనిషికి దక్కాలనే

కమ్యూనిస్టుల ఆలోచన దాశరథి అమితంగా నచ్చింది. ఇంతటి భావచైతన్యం వెలుగులో దాశరథి ఒక సామ్యవాదిగా మారాడు. పోరాటంలో భాగస్వామ్యం అయ్యాడు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మారాడు. కొన్నాళ్లకు పార్టీ రహస్య కార్యక్రమాలను నిర్వహించాడు. ఆ క్రమంలో కవిగా నిజాం వ్యతిరేక కవిత్వాన్ని సృష్టించాడు. తద్వారా ప్రజల వైపు నిల్చుని, ప్రజా ఆకాంక్షలకు పట్టం కట్టాడు.

దాశరథి ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో కూడా తరచుగా పాల్గొంటూ ఉండేవాడు. 1944 వరంగల్ లో జరుగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలు జరగకుండా రాజాకార్లు అల్లకల్లోలం సృష్టించి, సభా మంటపాన్ని తగులబెడుతారు. అందరూ భయభ్రాంతులకు గురయి చెల్లా, చెదురైన సందర్భంలో దాశరథి ఆ కాలిపోయిన సభామంటపంలోకి ప్రవేశించి ***"జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని కవి సమ్మేళనం జరిపి తీరుతామని"*** ధైర్యంగా ప్రకటిస్తాడు. ఈ సంఘటన ఒక్క సంఘటన చాలు దాశరథిలోని ఉద్యమ చైతన్య దీప్తిని అర్థం చేసుకోవడానికి. ఈ సంఘటన తర్వాత దాశరథి జీవితంలో మిలిటెన్సీ ప్రభావాన్ని బయటపెట్టడంతో పాటు, నిజాం ప్రభుత్వానికి మోస్ట్ వాంటేడ్ గా మారిపోయాడు. తర్వాత ఉద్యమ కార్యాచరణలో భాగంగా పార్టీ రహస్య సమావేశానికి హాజరై వస్తున్న క్రమంలో అరెస్ట్ అవుతాడు. ఆ రాత్రి పోలీస్ స్టేషన్లో బంధించిన తర్వాత, అదను చూసుకొని అక్కడి నుండి అడవుల్లోకి పారిపోతాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు మళ్లీ అరెస్టు అయి జైలులో నిర్భందించబడతాడు.

ప్రజల తరపున పోరాడే, మాట్లాడే కవులకు జైలు గోడలు తప్పనిసరి. ఆ విధంగా నిజామాబాదు జైలులో దాశరథి నిర్బంధించబడతాడు. అక్కడ మరో ఉద్యమ తేజం వట్టికోట ఆళ్వారుస్వామి ఉంటాడు. వీరిద్దరి స్నేహం వలన దాశరథిలో మరింత ఉద్యమ భావాలు పాదుకుంటాయి. ఈ జైలులో పళ్లు తోముకోవడానికి ఇచ్చే బొగ్గుతో జైలు గోడలపై నిజాం వ్యతిరేక పోరాట పద్యాలను రాస్తాడు.

ఓ నిజాము పిశాచమా! కానరాడు
నిన్నుబోలిన రాజు మాకెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాల వీణ

అంటూ నిజాం వ్యతిరేక ఉద్యమాన్ని తన కవితల ద్వారా ప్రకటిస్తాడు. ఇలా దాశరథి రాసిన పద్యాలను జైలు అధికారులు తూడ్చివేసినా కొద్ది, వట్టికోట ఆళ్వారు స్వామి అన్ని గోడలపై రాస్తూ ఉండేవాడు. ఇలా తన జైలు జీవితం నిజాం వ్యతిరేక ఉద్యమ కవిత్వంతో ప్రారంభమైంది. ఒక ఉద్యమకారుడిగానే జైలులోకి వెళ్లాడు. అక్కడ ఒక ఉద్యమ కవిగా నిజాం వ్యతిరేకోద్యమాన్ని తన కవిత్వం ద్వారా ప్రచారం చేసాడు. ఇది నిజమైన ఉద్యమకారుడి కార్యాచరణకు జైలు గోడలు అడ్డంకి కావు అని నిరూపించాడు.

ప్రాణములొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి మంచి మా
గాణములన్ సృజించి ఎముకల్ నుసి చేసి పొలాలు దున్ని భో
షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే ముసలి నక్కకు రాచరికంబు దక్కునే?

అంటూ నిజాం రాజుని ముసలి నక్కగా పోలుస్తూ, తెలంగాణ అంటే రైతులది అని ప్రకటిస్తాడు. నిరంతరం చెమటలు చిందించి, రక్తాన్ని కరిగించి, రాజు సంపదను పెంచిన రైతుకే ఈ తెలంగాణ ఫలాలు దక్కాలని ఆరాటపడ్డాడు. అందుకొరకు అవసరమైన కార్యాచరణలో భాగం అయ్యాడు.

దాశరథి రుద్రవీణ అనే కవితా సంపుటిని 1950లో ప్రచురించాడు. ఇందులో పేద ప్రజల తరపున పోరాట కవిత్వాన్ని, చైతన్య కవిత్వాన్ని ఎత్తిపట్టాడు. ఉద్యమ కవి అంటున్నామంటే కేవలం పోరాటాన్ని మాత్రమే చిత్రించిన కవిత్వం కాదు, ప్రజలను చైతన్యం చేసే కవిత్వాన్ని కూడా ఉద్యమ కవిత్వంగా గుర్తించాలి. ఆ దిశగా రుద్రవీణలోని కవిత్వం ఉద్యమ కవిగా దాశరథి శిఖరాగ్ర స్థాయిలో నిలుపుతుంది. ***"సాగింతును రుద్రవీణ పయి నించుక వెచ్చని అగ్ని గీతముల్"*** అంటాడు. అలాగే ***"పేదల గూర్చి నేను మ్రోగింతును రుద్రవీణ/ పలికింతును విప్లవ గీతికావళుల్"*** అంటూ విప్లవానికి ప్రజలను చేరువచేసే లక్ష్యంతో కవిత్వాన్ని రాస్తున్నానని చెప్పుకుంటాడు.

ఈ భూమి మీది
ఈ సీమ మీది
నాగటి చాళ్లలో
నడిచే రైతులార!
మీ నిశ్శబ్ద గళాలు పాడిన
గీతా రహస్యాలను
బధిర లోకానికి వినిపించే
నా రుద్రవీణ ఇదో

అంటూ మహా ఉద్వేగంతో తానే రుద్రవీణగా మారిన సందర్భాన్ని కవిత్వంలో చూడవచ్చు. ఒక ఉద్యమ జీవిగా ఉండే కవి మాత్రమే ఈ విధమైన బాధ్యతను భుజాలపై మోయగలడు.

నిజాం వ్యతిరేక ఉద్యమం మూడు భిన్న సమూహాలు భాగం అయ్యాయి. ఒకటి ఇక్కడి ఆర్యసమాజం భావాలతో ఉన్న కార్యకర్తలు నిజాంని దింపడం ద్వారా, హిందువుల ఆధిపత్యాన్ని నెలకొల్పాలనే లక్ష్యంతో నిజాం వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు. కాంగ్రెస్ వాదులు నిజాం ఆధీనంలోని రాచరికాన్ని ఓడించి, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నెలకొల్పానే లక్ష్యంతో పనిచేసారు. కానీ, ఇక్కడి కమ్యూనిస్టులు పేద ప్రజలకు రాజ్యం దక్కి, దున్నే వాడికి భూమి దక్కాలని, భూస్వామ్య వ్యవస్థను పూర్తిగా నాశనం చేయాలనే లక్ష్యంతో ఉన్న కమ్యూనిస్టులకు ఆపరేషన్ పోలో ద్వారా లక్ష్యం నెరవేరలేదు. కనుక ఆపరేషన్ పోలో తర్వాత కూడా సాయుధ పోరాటం కొనసాగింది. దీన్ని ప్రస్తావిస్తూ దాశరథి ఈ కింది పద్యాన్ని రాసాడు.

"తెలగాణా! భవీయ పత్రకులలో తీంద్రించు వైప్లవ్య సం
చలన మ్మూరక పోవలేదు! వసుధా చక్రమ్ము సారించి ఉ
జ్వల వైభాతిక భానునిన్ పిలిచి దేశంబంతటన్ కాంతి వా
ర్థులు నిండించిరి, వీరు వీరులు పరార్థుల్ తెల్గుజోదుల్
బళా!"

అంటూ తెలంగాణ బిడ్డలలో పోరాటం ఇంకా సమసిపోలేదనే భావన వచ్చేలా కవిత్వాన్ని రాసాడు. తెలంగాణ ప్రజలు కోరుకున్న సమసమాజం, భూస్వామ్య వ్యవస్థ నాశనం, దున్నే వానికి భూమి వంటి లక్ష్యాలు నెరవేరని స్థితిలో తెలంగాణ ప్రజలు మళ్లీ పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు. అలా భాగస్వామ్యం అయిన విధానాన్ని ప్రతిబింబించే ఉద్దేశ్యంతో ఈ పద్యాన్ని రాసాడు.

అభ్యుదయోద్యమం:

ప్రజలకు మంచిని బోధిస్తూ, సామాజిక రుగ్మతల వల్ల దేశాన్ని కాపాడుకోవడం కూడా ఒక ఉద్యమ రూపమే. సామాజిక అంతరాలు తగ్గి, సమసమాజం వర్ధిల్లినప్పుడు నిజమైన ఆనందం

దాశరథి కృష్ణమాచార్య

కవులకు దక్కుతుంది. లక్ష్య సాధనే లక్ష్యంగా కావ్యాలను, కవిత్వాన్ని, రచనలను రాస్తూ పోతుంటారు. ఈ క్రమంలో ప్రజా బాహుళ్యంలో విరివిరిగా పెచ్చరిల్లుతున్న హేతురహిత భావాలను ఖండిస్తూ దాశరథి ఈ కింది పద్యం చెప్పాడు.

మతములబద్ధముల్, కులము మాటలు వట్టివి, లేమి కల్మి
సం
గతియును కృత్రిమం; బవని కత్తిని కుత్తుక నుత్తరించి గె
ల్చితి ననుమాట బూటకము, రేడని బంటని వింత
నామముల్
వెతకుట వట్టి నాటకము లెమ్ము; నిజమ్మొక రాగ బంధమే

అంటూ ప్రజల మధ్య మానవత్వం వెల్లివెరియాలని ఆకాంక్షించాడు. కవిగా కుల, మతాలను ధిక్కరించాడు. లేనివాడు ఉన్నవాడు అనే తేడా కృత్రిమమైనది, అది మానవ సృష్టి అని ప్రకటించాడు. రాజు – బంటు అనే తేడాలు వింతైన పదాలని, నిజానికి అవి వట్టి బూటకపు మాటలు అని చెప్పి, మనుషుల మధ్య అనురాగ బంధాలే నిల్చిపోతాయనే భావాన్ని వ్యక్తం చేసాడు.

అభ్యుదయ కవిగా దాశరథి అనేక కవిత్వాలు రాసాడు. ఆ క్రమంలో ధ్వజమెత్తిన ప్రజ అనే కవితా సంపుటి కూడా ఈ మార్గంలో వచ్చినదే. ఈ కవితా సంపుటిలో చాలా కవితలు ప్రజల పక్షం నిల్చొని రాసిన కవిత్వంగా గుర్తించవచ్చు. అభ్యుదయ కవిత్వం శ్రమజీవులు– శ్రామికులు, రైతుల పక్షం వహిస్తుంది. వారి శ్రమైకి జీవన సౌందర్యాన్ని చిత్రిస్తుంది. వాళ్ల ఆకాంక్షలు, లక్ష్యాలను ఎత్తిపడుతుంది. హక్కుల సాధన కోసం జరిగే పోరాటాలతో మమేకం అవుతుంది. పోరాటాలు చేస్తుంది. మార్క్సిజం వెలుగులో రైతులకు, శ్రామికులకు, సమస్త పీడిత ప్రజలకు దక్కాల్సిన వాటికోసం పోరాడుతుంది. ఈ విధంగా మార్క్సిజం వెలుగులో కార్మిక పక్షపాతిగా దాశరథి కొన్ని కవితలను రాసాడు.

కర్షక కార్మిక కవిగణ
హర్షాంచితి సువర్ణాలు
మనజాతి పతాకలోన
కనిపించే త్రివర్ణాలు

అంటూ జాతీయ పతాకంలోని మూడు రంగులు కర్షకులు, కార్మికులు, కవుల సమూహాలతో పోల్చాడు. ఈ దేశ సౌభాగ్యంలో వీళ్లు భాగస్వాములు కావాలని ఆకాంక్షించాడు. ఈ విధంగా పోల్చడం కొత్త కల్పన. అలాగే కవిని దేశ, కాలాలు కొంతవరకే పరిమితం చేయగలుగుతాయి. నిజానికి కవి విశ్వవ్యాప్తి. తన దర్శనం ద్వారా ప్రాపంచిక సమస్యలను ఊహించే, పరిష్కారాలు వెతికే ప్రయత్నం చేస్తాడు.

సామ్రాజ్యవాద – యుద్ధ వ్యతిరేకత:

సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలని కబలిస్తున్నది. వర్తమానమైన, గతమైన అమెరికా సామ్రాజ్యవాదానికి బలికాని దేశం లేదు. అణ్వస్త్రాల పేరుతో బెదిరించి, సోదర దేశాలను లొంగదీసుకునే ప్రయత్నం సామ్రాజ్యవాద దేశాలు చేస్తుంటాయి. అందుకొరకే ఉద్యమ కవిగా దాశరథి అణ్వస్త్రాలను వ్యతిరేకించాడు. ప్రపంచశాంతిని కోరుకున్నాడు. నిజానికి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా అణ్వస్త్రాలపై వ్యతిరేకత పెరిగింది. ప్రజల్లో శాంతి భావాలు పెంపొందాయి. అభ్యుదయ రచయితలు యుద్ధాన్ని వ్యతిరేకించారు. అణ్వాయుధాలను వ్యతిరేకించారు. ప్రపంచ శాంతి భావాలను తమ రచనల ద్వారా ప్రచారం చేసారు. అభ్యుదయ సాహిత్యం ప్రధానంగా ప్రజల యుద్ధాన్ని సమర్థిస్తుంది. పాలకుల యుద్ధాన్ని వ్యతిరేకిస్తుంది. ప్రజల యుద్ధాలు హక్కుల కోసం, దోపిడి హంతం కోసం జరిగితే, రాజ్య యుద్ధాలు ఆధిపత్యం కోసం, దౌర్జన్యాల కోసం జరుగుతాయి. అందువల్ల అభ్యుదయ రచయిత ప్రజా యుద్ధాన్ని గౌరవిస్తూ, పాలకుల, రాజ్య యుద్ధాలను వ్యతిరేకిస్తాడు. ఈ కోణం నుండి దాశరథి కవితను రాసాడు.

లక్షలమందిని కుక్షిన దాచే
రాక్షసరణమిక రాదనుకుందాం
అణ్వస్త్రాల విజృంభణమంతా
అంతరించునని భావింతాం...
విజ్ఞానం విశ్వశాంతికే
వినియోగించుట కర్తవ్యం
అండపిండ బ్రహ్మాండ మంతటా
ఉండబోదు ఇక దౌర్జన్యం

ఇటువంటి ఆశావాద దృక్పథం దాశరథిలో కన్పిస్తుంది. దాశరథి ఇరాన్ – ఇరాక్ దేశాల మధ్య దశాబ్ద కాలంగా కొనసాగిన యుద్ధాన్ని వ్యతిరేకించాడు. శాస్త్రజ్ఞులు జీవితాలు వెచ్చించి, సాధించిన అణుబాంబు విజ్ఞానాన్ని మానవాళి విధ్వంసం కోసం ఉపయోగించడాన్ని విమర్శించాడు.

బంగ్లాదేశం నీ కోసం వెతికింది
వియత్నాం నిన్ను పిలిచింది
అరబ్బు జనత నీకై అలమటించింది
అఖిల జగం నీకై కలవరించింది.
నీవు రాకుండా బాంబులతో
పకడ్బందీగా గోడలు కట్టించేవారికి
నీవు గగనాలు దాటి రాగలవని తెలియదు

అంటూ శాంతి ద్వారా ప్రపంచం వర్ధిల్లుతుందనే ఆకాంక్షను వ్యక్తం చేస్తాడు. తోటి జీవరాశి పట్ల, మనుషుల పట్ల స్నేహస్తం ఇవ్వలేని జీవితం వ్యర్థం. మనుషుల మధ్య, దేశాల మధ్య అనేక వైరుధ్యాలను సృష్టించి, భేదాలను, జాతి వైరాలను ఉసిగొల్పుతున్న వైనాన్ని మనకు తెలియజేస్తాడు.

కూడు లేని కోట్ల జనులు
గోడు గోడు మంటుంటే
కోట్ల ధనం ఆయుధాల

కొరకు ఖర్చు చేసేరు

తిండి లేక, కట్టుకోవడానికి బట్ట లేక దేశ జనాభా అల్లాడిపోతుంటే యుద్ధాల పేరుతో, ఆయుధ సంపత్తి పేరుతో కోట్లాను కోట్ల రూపాయలు ఆయుధాల కొనుగోలుకి వెచ్చిస్తున్నారు. ప్రజల సంక్షేమం, విద్య, అభివృద్ధి, వైద్యం వంటి కనీస అవసరాలను ప్రభుత్వాధినేతలు పట్టించుకోకుండా ఇతర దేశాలతో నిర్మాణం చేసుకున్న వైరాన్ని సాకుగా చూపించి, ప్రజా చైతన్యాన్ని తొక్కిపెట్టి, అణ్వాయుధాల తయారి, యుద్ధ సామగ్రీల కొనుగోలుల కోసం విపరీత ధనాన్ని ఖర్చు చేస్తారు. దేశంలో నిరంతర యుద్ధ వాతావరణాన్ని, శత్రు సమరాన్ని మానసికంగా సృష్టిస్తారు. అలాంటి మనిషికి సకల జ్ఞానం అందుబాటులోకి వస్తే, ఎంతటి విధ్వంసానికి కారణం అవుతాడోనని ఆందోళన చెందుతాడు.

అణువంత తెలియు మనిషికి
అణువు నస్త్రమ్ము జేసి హంతకుడాయెన్
మనిషికి సకలము తెలిసిన
మన బ్రహ్మాండమ్ము నెల్ల వాయించడొకో

అంటూ పరిమిత జ్ఞానంతో ఉండే మనిషి ఇంత విధ్వంసం సృష్టిస్తూ ఉన్నాడే. ప్రకృతి రహస్యాలన్నీ తెలిసి, సంపూర్ణ జ్ఞానం వస్తే ఇంకెంత విధ్వంసం సృష్టిస్తాడో అనే అనుమానాన్ని వ్యక్తం చేసాడు. కవిగా తనైనా, ఇతరులైనా చేయల్సిన బాధ్యతను ఈ కింది విధంగా ఎరుకపరుస్తున్నాడు.

నా మానని గాయాల
వజ్రాయుధాలతో
అధికారమదాంధుల
బధిర హృదయములను బద్దలు కొడతాను
తుపాకుల నోరు మూయిస్తాను
బాంబుల చెంపలు వాయిస్తాను

సమసమాజ స్థాపన లక్ష్యం:

అభ్యుదయ రచయిత ఏకైక లక్ష్యం సమసమాజ స్థాపన. దోపిడి, పీడనలు లేని వివక్షతకు తావులేని, అసమానతలు లేని పౌర సమాజ నిర్మాణమే లక్ష్యంగా అభ్యుదయ రచయితలు నిర్మాణమవుతారు. నిరంతర వర్గపోరాటాల ద్వారానే సమసమాజం సాధ్యమౌతుందని మార్క్సిజం చెబుతుంది. దాశరథి తెలంగాణ సాయుధ పోరాటం మొదలు మరణించే వరకు సమసమాజాన్నే కలగన్నాడు. ధనికస్వామ్యాన్ని నిరసించాడు.

అనాదిగా సాగుతుంది/ అనంత సంగ్రామం/ అనాథుడికి, ఆ గర్భ/ శ్రీనాథుడికీ మధ్య అంటూ వర్గ సంఘర్షణ గురించి, దానికి గల చారిత్రక, గతితార్కిక భౌతికవాద దృష్టిని కవిత్వంలో అందించాడు.

ధనస్వామ్యమిక చెల్లదులే
జనస్వామ్యమిక దుల్లదులే

అని తీర్పునిచ్చారు. అంతేకాదు....

నోట్ల చలామణీ మితిమీరిన ఆర్థిక వ్యవస్థలో
కోట్ల ధనం సంపాదించ వీలైన కుహనా వ్యవస్థలో
ఎక్కడుంది సమభావం

అని దేశ వాస్తవిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని, సమస్య తీవ్రత పట్ల ప్రశ్నను లేవనెత్తాడు. భారతదేశంలో సమసమాజం నిర్మాణం కావాలంటే వ్యవస్థలో మార్పు రావాలనే ప్రాథమిక, మౌలికమైన విషయాన్ని ఇందులో అందించాడు. ఆర్థిక దోపిడికి అవకాశం ఇచ్చే వ్యవస్థ కూలితే కాని, సమసమాజం నిర్మాణం కాదు. దాశరథి ఆర్థిక దోపిడిని మాత్రమే నిలువరిస్తే భారతదేశంలో సమసమాజం సాధ్యం కాదు అన్న విషయం దాశరథికి తెలుసు. అందుకే

కులమతాతీత రాజ్యవనంలో
సమతా కుసుమాలు పూయిస్తూ
సమమాజాన్ని దోచుకొని జీవించే
సైంధవులనే ముళ్లను తొలగిస్తూ
సమృద్ధి పదం మీంద నడవండి
జనశక్తిని తెలుసుకొని మెలగండి

అంటూ కుల, మత ధనాతీతమైన లౌకిక సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించాడు. దాశరథి ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ చైతన్యాలన్నింటిని తనలో ఇముడ్చుకున్న వైవిధ్యమైన ఉద్యమ కవి. తెలంగాణ ప్రాంత ఉద్యమం, ఆంధ్రరాష్ట్రోద్యమం, జాతీయోద్యమం, అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యతిరేకోద్యమం, మానవతోద్యమం వంటి అన్ని ఉద్యమాలకు ఆయన స్పందించాడు. తన కవితా వెలుగు ప్రసరించినంత వరకు చైతన్యాన్ని అందించాడు. అన్ని ఉద్యమాలకు ప్రతిస్పందించి, నిజమైన ఉద్యమకవిగా పేరు సంపాదించుకున్నాడు.

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్ (పిటి), ఓయు

'తెలంగాణ భాష' అవసరం తీరిందా?

డా. చంద్రయ్య శివన్న

భాష కేవలం భావ వినిమయ సాధనం మాత్రమే కాదు, అదొక భావోద్వేగ మహాసంపుటి. సాంస్కృతిక ప్రసరణకు మూలకందం. అంతమాత్రమేనా, భాష ఆధిపత్యపు ఆయుధం. అధికార సాధనం. భాషారాజకీయాల కేంద్రంగా దేశవ్యాప్తంగా ఇటీవల అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉత్తర, దక్షిణ భారతదేశం అనే భావన క్రమంగా హిందీ భాషాధిపత్యంవల్ల బలపడుతోంది. భాషారాజకీయాలవల్ల జరగాల్సిన మార్పులన్నీ రాత్రికి రాత్రే జరిగిపోతున్నాయి. సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కొంతమంది' యువతను ఉద్దేశించి 'బొద్దింక' (కాక్రోచ్)లతో పోల్చడం పెద్ద చర్చకు దారితీసింది. 'బొద్దింక' పదప్రయోగం రాజకీయ ప్రకంపనలను సృష్టించింది. ఈ మధ్యకాలంలో ప్రధాని నరేంద్ర మోదీ వాడిన 'దిమాగీ నక్సల్స్' పదం కూడా దాదాపు అటువంటి ప్రేరణనే కలిగించింది. పదాల ఎంపిక ద్వారా దేశవ్యాప్తంగా సున్నిత భావోద్వేగాలను రెచ్చగొట్టి, తమ రాజకీయ పలుకుబడిని, అధికారాన్ని నిలుపుకోవడానికి రాజకీయపార్టీలు పోటీపడుతున్నాయి. కాబట్టి, భారత రాజకీయాల్లో అధికారాన్ని నిలుపుకోవడానికి భాష ప్రధాన సాధనంగా ఎన్నడూ లేనంతగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇప్పుడు అదొక అధికార పెట్టుబడి. కాబట్టి, భాష అధికారాన్ని నిలుపుకోవాలన్నా, జాతి భావనను పెంపొందించాలన్నా బలమైన సాధనం అనే మాట చరిత్ర పొడువునా నిరూపితమైన సత్యం.

తెలుగునాట కూడా ఈ భాష-అధికార రాజకీయాలకు గల చరిత్ర పెద్దదే. భారతదేశంలో మొట్టమొదటగా భాషాప్రయుక్త రాష్ట్ర భావనతో భాషారాజకీయాలకు తెరతీసినవారు తెలుగువారు కావడం ఇక్కడ గమనించదగిన విషయం. మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న ఆంధ్రులు మొదట ఆంధ్రరాష్ట్రంగా ఆవిర్భవించారు. ఆ తరువాత తెలంగాణను కూడా కలుపుకొని ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడటానికి తెలుగు భాషే ప్రధాన సాధనంగా ఉపయోగపడింది. ఇది సాధారణ ప్రజలకంటే ఎక్కువగా దానిద్వారా అధికారాన్ని పొందాలనేవారికి ఉపయోగపడింది. ఇది తెలుగువారిని కలపడానికి తొలిదశలో ఉపకరించినా, దురదృష్టవశాత్తు ఈ భాషారాజకీయాలు ఆర్థికపుష్టి కలిగిన ఆధిపత్య ప్రాంతమైన కోస్తాంధ్ర పాలకులకు పాలనపై ఆధిక్యాన్ని కట్టబెట్టాయి. వీరు తమ 'క్యాపిటల్'ను విస్తరించుకోవడానికి 'తెలుగు భాష'ను ఒక సాధనంగా వాడుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఒకసారి ఎన్.టి.రామారావు రూపంలో తెలుగు జాతి, తెలుగు భాషాభావన ముందుకు వచ్చి అధికారాన్ని మరికొంత కాలం నిలుపుకోవడానికి సహాయ పడింది.

ఇదంతా ఒక కోణం. తెలుగువారిని కలపడానికి పనికొచ్చిన అదే తెలుగు భాష, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా విడిపోటానికీ పునాదివేసింది. దీనికి కారకులు కూడా కోస్తాంధ్ర పాలకవర్గాలే. మనందరిదీ ఒకే భాష అని చెప్పి కలుపుకొన్నవారు తరువాత, మా తెలుగు భాష గొప్పది. మీదంతా తౌరక్యాంధ్రం' అన్న భాషాధిపత్యపు మాటలకు జయశంకర్ లాంటివారు బాధపడి, 'తౌరక్యాంధ్రం అనడం న్యాయమా" (17జూన్, 2011. ఆంధ్రజ్యోతి) అని ప్రశ్నించారు. ఆ వివక్షను వ్యతిరేకిస్తూ, కాళోజీ, ఆంధ్రభాషకు-తెలంగాణ తెలుగుకు ఉన్న భేదాలమీద విస్తృతమైన అధ్యక్షోపన్యాసం (జూలై-సెప్టెంబర్.సోయి.2002) చేసారు. తెలంగాణ ప్రాంతంమీద ఆధిపత్యం చేలాయించటానికి తమ కోస్తాంధ్ర తెలుగును సాధనంగా వాడుకొన్నారు. పత్రికలద్వారా, మీడియాద్వారా, సినిమా మాధ్యమంద్వారా ఇట్లా అనేక రూపాల్లో తెలంగాణతోపాటూ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల తెలుగును తక్కువ చేసి చూపారు. తెలంగాణ ప్రాంతంపై ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆధిపత్యం చెలాయిస్తుంటే భరించారు కానీ, తెలంగాణ తెలుగునును అవమానించటాన్ని ఎంతమాత్రమూ సహించలేకపోయారు. తెలంగాణవారికి 'భాష' విషయంలో ఈ 'దగ్గరితనం' ఎప్పటినుంచో ఉంది. నిజాంరాష్ట్రంలో కూడా తెలంగాణ వారిని 'తెలంగీ బేదంగీ" అని అవమానిస్తే,



ఎదురుతిరిగి భాషాసాంస్కృతిక పోరాటాన్నీ, తదనంతరం సాయుధపోరాటాన్ని నిర్మించిన ఘనచరిత్ర తెలంగాణవారిది. ఆ తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమ సందర్భంలో 'స్వయం అధికారాన్ని' సాధించుకోవడంలో తెలంగాణ భాష, ఎటువంటి భావోద్వేగ పాత్రను పోషించిందో మన కళ్లముందరి చరిత్రగా ఇంకా సజీవంగానే ఉంది.

మలిదశ తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలుగు భాషలో ఉన్న వివిధ మాండలికాలపై, ప్రామాణికతపై విస్తృతమైన చర్చలు జరిగాయి. అవి; ఆంధ్రులది ఆంధ్ర భాష, తెలంగాణవారిదే అసలైన తెలుగు భాష అనేదాకా వెళ్లింది. ఆ క్రమంలో "యాసలు గోసలేనా... ప్రామాణిక తెలుగు వద్దా?" (పురాణం శ్రీ.శా.) అనే అభిప్రాయాలూ వచ్చాయి. "వాళ్ల యాసే ప్రామాణికమా?" (కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి) అనే ధిక్కారమూ తెలంగాణీయులు వినిపించారు. మాది యాస కాదు ప్రత్యేక భాష అని ఖండించారు. "మీ ఆంధ్రం మా తెలుగు వేరు వేరే" (దంటు కనకదుర్గ) అంటూ కొంత ఉద్వేగపడ్డారు. "అర్థరహితమైన వాదనలతో అర్థవంతమైన చర్చ జరగదు!" (బి.ఆర్. బాపూజీ) అంటూ భాషాశాస్త్రదృక్పథాన్నీ, "వర్గ, కుల, ప్రాంతాలవారీ భాషలుంటాయా?" (దివికుమార్) అంటూ స్టాలిన్ సిద్ధాంతాన్నీ అందించే ప్రయత్నాలూ జరిగాయి. ఈ చర్చల మర్మమెరిగిన కె. శ్రీనివాస్ లాంటివారు "రెండు రాష్ట్రాలు: ఒక తెలుగు" అని తేల్చేసారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలోనూ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సమయంలోనూ తెలుగువారిని కలపడానికి, ఆధిపత్య ప్రాంతాల అధికారాన్ని నిలుపుకోవడానికి ఉపయోగపడిన తెలుగు భాష, ఆశ్చర్యకరంగా తెలంగాణ విడిపోవడానికి, ఇక్కడి పాలకవర్గాలు తమ అధికారాన్ని దక్కించుకోవడానికి ఉపయోగపడింది. ఈ మూడు సందర్భాల్లోనూ తెలుగును 'అధికారం' ఎట్లా ఉపయోగించుకుందో అర్థమౌతుంది. 'భాష–అధికారం' ఒకదానిలో ఒకటి, ఒకదానితో ఒకటి కలిసి ఎలా నడుస్తాయో చూడవచ్చు.

తమ అధికారాన్ని స్థాపించుకోవడానికి తెలంగాణ ప్రజలతో కలిసి రాజకీయవర్గాలు తెలంగాణ భాషను ఉపయోగించుకున్నాయనడంలో ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. అయితే, ఇది ప్రజాస్వామిక ఉద్యమమనే పేరుండటంవల్ల రాజకీయవర్గాల అధికారకాంక్ష కంటే ప్రజల ఆకాంక్షలే ఎక్కువగా వ్యక్తమయ్యాయి. ఉద్యమ సమయంలో కోస్తాంధ్ర భాషాధిపత్యానికి వ్యతిరేకంగా ఒక పోరాటరూపంగా ఇది పైకి కనిపించినా, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కొత్తపాలకులు

భాషను నిర్మాణాత్మక అధ్యయనం చేయడంలో చూపాల్సినంత చొరవచూపలేదు. వారు కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవడం అనే కోణంలోంచే 'తెలంగాణ భాష'ను చూసారనే విషయం అర్థమౌతుంది.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడూ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాతా తెలంగాణ భాష స్వరూప స్వభావాలను వివరించే ప్రయత్నం భాషాభిమానులనుంచి జరిగినంత ఎక్కువగా ప్రభుత్వంవైపునుంచి జరగలేదనే చెప్పాలి. ఉద్యమం జరుగుతున్నంతకాలం పదే పదే 'తెలంగాణ భాష' అనే పదబంధాన్ని వాడిన రాజకీయ నాయకులు, తెలంగాణ రాగానే 'ప్రపంచ తెలంగాణ మహాసభలు' అనే పేరుకు బదులు 'ప్రపంచ తెలుగు మహాసభలు' పేరుతోనే సభల్ని నిర్వహించడం మనందరికీ తెలిసిందే. ఇక్కడే పాలకులకు 'తెలంగాణ భాష' అవసరం తీరింది' అని చెప్పవచ్చు. ఏర్పడ్డ రెండో ప్రభుత్వమూ గడిచిన రెండేళ్లలో తానూ 'అదే తానుముక్కే'ననిపించుకుంది.

మరోవైపు ప్రజలు 'తెలంగాణ భాష'కు కట్టుబడే ఉన్నారు. పదికిపైగా పదకోశాలను, ఒక పదప్రయోగ సూచీని వెలువరించారు. తెలంగాణ భాషపై విశ్వవిద్యాలయాల్లో పిహెచ్.డి. పరిశోధనలు, జాతీయ సదస్సులు జరిగాయి. విశ్వవిద్యాలయాల వెలుపలా ఔత్సాహికులైన భాషాపరిశోధకులు భాషావ్యాసాలు, వ్యాకరణాలను రచించారు. పత్రికల్లో, సినిమాల్లో, టీవీల్లో తెలంగాణ భాషకు విపరీతమైన ప్రాధాన్యం పెరిగింది. స్టార్ హీరోలతో తెలంగాణ భాషలో వాణిజ్య ప్రకటనలూ వెలువడ్డాయి. మొత్తం రాజకీయ, ఆర్థిక రంగాలు కొంతకాలం తెలంగాణ భాష చుట్టూనే తిరిగాడాయంటే అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు. బాధాకరమైన విషయం ఏంటంటే, తెలంగాణ భాష స్వరూప, స్వభావాలు నిరూపించటానికి అవసరమైన ఒక్క నిర్మాణాత్మక కృషి అంటూ ప్రభుత్వంనుంచికానీ, విశ్వవిద్యాలయాలనుంచి కానీ జరగకపోవడం. తెలంగాణ భాషావినియోగం పెరిగినమాట ఎంతవాస్తవమో "ఇదీ తెలంగాణలో మాట్లాడే తెలుగు 'ఫ్లేవర్" అని పట్టిచూపించడానికి ఒక్క శాస్త్రీయగ్రంథమైనా లేదనేది అంతే వాస్తవం. ప్రస్తుత సందర్భంలో ఈ చరిత్ర తవ్వకాలు, ఈ వలపోత ఎందుకంటే, ఇంత భాషాచైతన్యం కలిగిన తెలంగాణవారు స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత 'భాష' బాగోగులు పట్టించుకోలేదనే కఠిన వాస్తవాన్ని చర్చకు పెట్టడంకోసమే. మరి నిజంగానే తెలంగాణవారిలో ఆ భాషాస్పృహ కొరవడిందా అని ఆలోచిస్తే, లేదు అనే సమాధానం వస్తుంది. ఈ మధ్యకాలంలో 'ఇదుపుకాయితం' అనే తెలంగాణ భాషాపదాన్ని ఒక సినిమా పేరుగా పెట్టారు. ఆంధ్రప్రాంతానికి చెందిన ఓ బాధ్యతారాహిత్యమైన వ్యక్తి 'పేరు ఒకటే తెలంగాణ భాషలో ఉంటుందా? దానికి ఏమైనా 'సబ్ టైటిల్స్' వేస్తారా? అంటూ అహంకారపూరిత వ్యాఖ్యలు చేసాడు. ఈ సందర్భంలో తెలంగాణవారు స్పందించిన తీరు వారిభాషపై వారికున్న భావోద్వేగ సంబంధాన్ని వ్యక్తంచేసింది. కాబట్టి, తెలంగాణ భాష అవసరం అధికార వర్గాలకు తీరిందేమో కానీ ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా అలానే ఉంది. వచ్చిన చిక్కంతా ఆ భావోద్వేగాన్ని నిర్మాణాత్మకం, శాస్త్రీయం చేయకపోవడమే.

తెలంగాణప్రాంత రాజకీయ నాయకులెవరైనా తెలంగాణ భాషను తమకు అధికారాన్ని సాధించిపెట్టే ఒక పెట్టుబడి సరుకుగానే చూసారు తప్ప ఏనాడూ దాని నిర్మాణాత్మక అభివృద్ధికి పాటుపడలేదు. ఆంధ్రపాలకులూ ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివారు సుమా! జాతి భావనతో ఆంధ్రపాలకులు, తెలంగాణ భాష భావనతో తెలంగాణ పాలకులు ప్రజల్లో భావోద్వేగాలను కలిగించి, ఉద్యమ తీవ్రతను పెంచటానికి ఉపయోగించుకున్నారే కానీ భాషాభివృద్ధికి ఇసుమంతైనా చిత్తశుద్ధి చూపలేదనే చెప్పాలి. కాబట్టి, పాలకులు తెలుగు భాషాభివృద్ధికి ప్రణాళికలు రచిస్తారనే భ్రమలనుంచి భాషాభిమానులు బయటపడాలి. ఇంతకాలం భాషను పాలకులు తమ రాజకీయ అధికారాలను సుస్థిరంచేసుకోవడంకోసం ఉపయోగించుకున్నది చూసాం. కానీ, ఇకనుంచి ప్రజలు తమ భాషాభివృద్ధి ప్రణాళికల్ని అమలు జరుపుకోవడమనే అధికారంకోసం తెలుగు భాషను ఒక సాధనంగా ఉపయోగించుకోవాల్సి ఉంది.

(సెప్టెంబర్ 9 కాళోజి జయంతిని పురస్కరించుకుని జరుపుకునే తెలంగాణ భాషాదినోత్సవం సందర్భంగా...)

రచయిత:

అసిస్టెంట్ ప్రొఫెసర్ (పిటి), నిజాం కళాశాల

అణగారిన వర్గాల జాడలు-చైతన్యప్రకాశ్ (రేణ) కథలు

డా. ముత్యంపేట గంగాధర్



"కొండాపురం వాగొడ్డున గడిపిన బాల్యం
కొచ్చెర్వు కట్ట బొందల గడ్డ మీద
చదివిన కవిత్వం
ఉరుస్తున్న గుడిసెలోంచి చూసిన ప్రపంచం
నిద్ర లేని రాత్రుల దుఃఖాలు
నిలువునా మింగుతున్న రాజ్యపు దృశ్యాలు
చెప్పరానివీ.... చెప్పొచ్చేవి
ఎన్నెన్నో.... తలచి కలచి
ఈ కథలు -
అమ్మ, ఆవు కాదు.......
అవ్వ, ఆకలి నేర్చుకున్న వర్ణమాల కదా!"

అని నా మాటగా రచయిత రాసుకున్న ముందుమాట. ఈ మాటలను బట్టి రచయిత రాసే కథలు ఎలా ఉంటాయో అంచనా వేయవచ్చు" ఈ కథలు అమ్మ ఆవు కాదు.... అవ్వ, ఆకలి నేర్చుకున్న వర్ణమాల" అనడంలో రచయిత సమాజంలో చూసిన పోకడలను తను అనుభవించిన బాధలు నుండి ఆవేదనల నుండి జాలువారిన రచనలు అని మనం అర్థం చేసుకోవచ్చు. రచయిత చైతన్య ప్రకాశ్ "రేణ" కథల సంపుటిని రాసారు.

చైతన్య ప్రకాశ్ గారి గ్రామం కిషన్ దాస్ పేట, పోస్ట్ కొండాపూర్, జిల్లా రాజన్నసిరిసిల్ల. ఈ పుస్తకాన్ని నయనం ప్రచురణలు సిరిసిల్ల వారు 2001లో ప్రచురణ చేశారు. ఈ పుస్తక ముద్రణకు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఆర్థిక సహాయం అందించారు. రేణ కథల సంపుటి రచయిత తండ్రి చిన్నబాలు బాలయ్య, రచయిత మిత్రుడు నీరటి రాజయ్య గార్లకు అంకితం ఇవ్వబడింది.

"రేణ" కథల సంపుటిలో ఎనిమిది కథలు ఉన్నాయి. అందులో మొదటిది "బతుకురేవు" కథలో రజకుల జీవన విధానాన్ని, వారి వృత్తిలోని యాచక బానిస తత్వాన్ని తెలిపినది. అగ్రవర్ణాల దౌష్ట్యంలో అణిగిపోయిన రజక స్త్రీల ఆర్తనాదాలను తెలుపుతుంది. చాకిరేవు మురికిలో చేతులు, ఒళ్ళు కౌసు వాసనలో కష్టిని మోసి, బుక్కెడు బువ్వకు ఒర్రెలో ఈదిన మల్లవ్వ, రాములు, పద్మల జీవితగాథ బతుకురేవు కథ. బతుకు రేవు కథలో కొండాపురం గ్రామంలో మల్లవ్వ, వెంకటయ్య అక్క తమ్ముళ్లు ఉండేవారు. మల్లవ్వకు రాములు జన్మించగానే పదో ఏటా భర్త చనిపోతాడు. వెంకటయ్యకు పద్మ జన్మించిన తర్వాత భార్య చనిపోతుంది. వీరి రెండు కుటుంబాలు కులవృత్తి మైల బట్టలు ఉతుకుతూ, ఇంటింటికి తిరిగి చలిదోబులిదో అడుక్కచ్చుకొని జీవనం సాగించేవారు. అదే ఊరిలో సాంబయ్య అనే శావుకారి పేదల అవసరాలను గుర్తిస్తూ, వడ్డీలకు ఇస్తూ ధనికుడైనాడు.

రాములు మిత్రుడు శంకర్. ఇదే ఊరిలో నారాయణరావు అనే కీచకుడు ఉండేవాడు. రాములు తండ్రి చనిపోవడంతో తల్లి మల్లవ్వ రోగాలతో మంచంపై నుండి లేవలేని స్థితిలో రాములు చదువు అర్థాంతరంగా ఆగిపోయి, కులకష్టి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇలా సాగుతున్న కాలంలో రాములుకు, పద్మకు వివాహం జరుగుతుంది. ఇంట్లో ఖర్చులు పెరగడంతో కులవృత్తితో చేసే పనులతో డబ్బులు సరిపోక రాములు బొంబాయి వెళ్ళడం జరుగుతుంది. ఒకనాటి వర్షాకాలం రోజు సాయంత్రం పద్మ ఉతికిన బట్టలు ఇండ్లల్లో వేసి, అన్నం తీసుకుని ఇంటికి వస్తున్న సమయంలో వర్షం ఎక్కువ కావడంతో నారాయణరావు ఇంటి గోడ పక్కన నిలబడుతుంది. గమనించిన నారాయణరావుకు ఆ ఊరి వ్యక్తి

పద్మ అందాల గురించి చెప్పిన విషయాలు గుర్తుకు వస్తాయి. నారాయణరావు పద్మను ఇంట్లోకి పిలవడం అకస్మాత్తుగా ఇంటి తలుపులు ముసుకపోతాయి. పద్మ నోటిలో బట్టలు గుక్కడం, అన్నం గంప బోర్లపడటం, అగ్రవర్ణాల దాష్టీకంలో పద్మ జీవితం చీకటిలో కలిసిపోయింది. ఈ విషయం రాములుకు తెలిసి పిచ్చివాడిగా మరిపోతాడు. ఈ తతంగమంతా తెలిసిన నోరు మెదపలేని ఊరి జనం. ఏ సత్తువ లేని రజక కులం. ఓ నాటి రాత్రులలో రక్తపు మడుగులో నారాయణరావు కనిపించడం, ఆ ఊరికి ఉషోదయం లాంటిది. శంకర్ లేడని పేపర్లో రావటం, జనాలలో న్యాయం జరుగక యువకులు జంగల్ బాట పట్టడంతో ఈ కథ ముగుస్తుంది.

రెండవ కథ "అమీనా" ఈ కథ షాబొద్దీన్ అనే ముస్లిం కుటుంబానికి చెందినది. పిల్లల్ని నివారించే ఆపరేషన్ దైవ విరుద్ధమని షాబొద్దీన్ నమ్మకంతో ఆరుగురి ఆడపిల్లలను కన్నాడు. అందులో చివరి అమ్మాయి పేరు అవిరీనా. బతుకు దెరువు కోసం తన గ్రామాన్ని వదిలి వేరే గ్రామానికి వలస పోతారు. ఐదుగురు అమ్మాయిలకు వివాహాలు చేసి షాబొద్దీన్ మరణిస్తాడు. దానితో అవిరీనా తన తల్లి చాయ్ హోటల్ నడిపిస్తున్నారు. అమీనా తల్లి డబల్ రొట్టె, అల్లంబురబ్బా తయారుచేసి ఊళ్లో అమ్మకొచ్చేది. ఆ ఊరి మగరాయుల్లు, ఐదుగురు బావలు అమీనాను హారతిలా వాడుకునేవారు. ఇలా మోసపోతున్న రోజులలో పరశురాములు అనే వ్యక్తి హోటల్‌కి వచ్చాడు. పరశురాములు చదువుకున్న వ్యక్తి చైతన్యం కలిగిన వాడు. సామాజిక స్పృహ కలిగి, విప్లవాత్మక, అభ్యుదయ భావాలు గలవాడు. అమీనాకు, పరశురాములు ఇద్దరి మధ్య మంచి సాంగత్యం ఏర్పడింది. దీనితో వెలి బతుకు ఉన్న అమీనాకు కొత్త వెలుగు తీసుకువచ్చాడు. ఇలాంటి వ్యవస్థపై పరశురాములు అమీనాను భార్యగా స్వీకరించి పురుష ప్రపంచము తలలు మాడ్చే కాగడా అయిన చక్కని స్ఫూర్తి కథ.

మూడవకథ "రేణ" పనిపాటా కబుర్లు, బతుకు అన్నింటి నుంచి నిక్కపొడుచుకొని చూస్తున్న వారి ఆలోచనలు, సమాజ ధిక్కార స్వరాలు, సామాజిక సాలోచన వరాలు, జనంతో కలివిడి నైజం, పనులతో ప్రజలతో స్వేదం చిందే సహచర్యం, రహస్య మిత్రులతో రక్తం చిందే కరచాలనం ఇదే దళిత కుటుంబ జీవన సమరం. ఒక ఊరిలో చిన్న వ్యవసాయ ఆధారిత కుటుంబం వీరయ్య లక్ష్మిలది. వీరి కూతురు పేరు రేణ. నాటి పరిస్థితుల్లో వీరయ్య ఇంటికి రాత్రులలో సంఘం వారు వచ్చి తిని పోయేవారు. వారి కలయికతో వారి బాటలోనే సంఘంలో కలిసిపోయాడు వీరయ్య. దొంగ ఎన్కౌంటర్లో వీరయ్య మరణిస్తాడు. అప్పటి నుండి లక్ష్మీ, రేణ చిన్న వ్యవసాయ పనులు చేస్తూ, వ్యవసాయ పనులు లేనప్పుడు గుట్టకు వెళ్లి కట్టెలు మోస్తూ ఊళ్లో తిరిగి అమ్ముకునేవారు. నారాయణ, రాజనర్సయ్యలు వీరయ్య ఉన్నప్పుడు ఇంటికి వచ్చి వెళ్లే కామ్రేడ్స్. వీరి ప్రోత్సాహంతోనే సంఘంలో కలిశాడు వీరయ్య. నారాయణ, రాజనర్సయ్య ఇద్దరు అడవి నుండి సమాజ బాట పట్టి ప్రజల్లో కలిసిపోయి హాయిగా జీవనం సాగిస్తున్నారు. కానీ, సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి సిద్ధాంతం కోసమే మరణించాడు. ఒకనాటి రోజున కట్టెలు అమ్ముకోవడానికి ఊరూ వాడలు తిరుగుతుండగా రాజనర్సయ్య పిలవడంతో ఆ సందర్భంలో లక్ష్మికి రాజనర్సయ్యకు మధ్య జరిగిన సంభాషణలో భాగంగా "మేమెందుకు పతనమయినమ్ సార్! పనిజేసుకుని బతకడం పతనమంటే, కడుపు కోసం కట్టెలు మోసైనా బ్రతకాలనుకోవడం దిగజారడం అనుకుంటే, ఇంతకంటే దరిద్ర్యం మరోటుందా? ఎక్కడి నుండి మీరీ మాటలు నేర్చుకున్నారో... ఆ శ్రామిక ఉద్యమాలకే అవమానం. ఏ పోరాటమైనా సరే ఓటమిని నేర్పదు. గెలుపునే నేర్పుతుంది. గెలుపునకు మార్గాల్ని చూపెడుతుంది. కేవలం వ్యక్తి సుఖాల కోసం.... దోపిడీ వ్యవస్థలో అతికొద్ది మందికుండే అవకాశాల్లోకి జొరబడే విధానాన్ని జీవితాన్ని గెలుచుకోవడం అంటారా?". అని రాజనర్సయ్యతో లక్ష్మి పలికిన మాటలు. ఈ కథలో ఏ విముక్తి కోసం బయలుదేరాయో ఉద్యమాలు ఆ పీడితుల్ని మరింత పీడుతులుగా, ఏ కులహీనుల కోసం పోరాటం అన్నారో ఆ కులహీనులే నీచంగా దిగజారి పోయే వాతావరణం ఈ పార్టీ వల్ల జరిగాయని తెలిపే కథ . ఏది ఏమైనా ఆశయం కోసం వీరయ్య లక్ష్మీ లాంటి కుటుంబాలు సంఘంలో చేరి సమాజం కోసం తమ జీవితాలను పణంగా పెట్టినటువంటిదే ఈ రేణ కథ.

నాలుగోవది "సారూప్యం" కథ పేరుకు తగినట్లే ప్రేమ అనేది రెండు శరీరాల మధ్య కాదు, మనసులతో మమేకం గలది అని చెప్పే కథ సారూప్యం. ముస్లిం అమ్మాయి, హిందూ అబ్బాయి మధ్య జరిగిన కథ. అభ్యుదయ ఆలోచనలు, చైతన్య భావాలు కలిగి, నక్సలిజంతో సంబంధాలు గల అబ్బాయికి, బతుకు దెరువుకు హోటల్ నడిపిస్తున్న అమ్మాయి మధ్య జరిగిన ప్రేమ వృత్తాంతం. ఈ కథలో ముస్లిం భావజాలాలు వారి జీవన విధానాలు తెలుస్తాయి. అమ్మాయి తండ్రికి క్యాన్సర్ వస్తే వారి

కుటుంబానికి చేదోడు వాదోడుగా హిందూ అబ్బాయి నిలబడటం మనం చూడవచ్చు. నవ సమాజ నిర్మాణం కోసం అబ్బాయి అన్నల్లో చేరి మోసపూరిత ఎదురు కాల్పుల్లో అమరుడౌతాడు. అయినా ముస్లిం అమ్మాయి, ఆ అబ్బాయినే తలుచుకుంటూ భౌతికంగా దూరమైన మానసికంగా మరింత బలంగా దృఢచిత్తంగా హృదయంలోనే ఉన్నాడని తననే స్మరించుకొన్న చక్కని కథ.

ఐదవ కథ “వల” కొండాపురం ఊళ్లో జరిగిన హృదయ విషాదాకరమైన గాథ. నరసయ్య, రాజవ్వలకి ముగ్గురు సంతానం. వీరిలో బిడ్డ గంగ. ఆమె భర్త చనిపోవడంతో గంగ మంచాన పడి టీబీ వ్యాధితో బాధ పడుతుంది. కుటుంబం ఎల్లదీయడానికి నరసయ్య చేయని పని లేదు, ఎత్తని అవతారం లేదు. బట్టల బేరం, తోపుడు బండి, అరటిపండ్లు అమ్మడం, సైకిల్ టెక్స్, పాన్ డబ్బా, పవర్ లూమ్స్, బట్టలకు రంగులద్దడం చివరకు హోటల్ నడిపి బతుకు కష్టమై ఉన్న ఇల్లు జాగా అమ్ముడుపోయాయి. బొంతకు కుట్టిన దారంలా అనేక వృత్తుల్లోకి చొరబడి చివరకు బ్రతుకు నెర్రలు వారినట్లు అయింది నర్సయ్య జీవితం. కుటుంబ సారథ్యం కోసం బిడ్డ మందుల కోసం నరసయ్య తన దోస్తు సత్తయ్యతో జతకట్టి చెరువులో దొంగతనంగా చేపలు పట్టడానికి వెళ్తారు. చెరువులో దిగిన తరువాత బెస్తవాళ్ళు రావడంతో వారికి దొరకకుండా పరిగెత్తే సమయంలో ఈత ముళ్ళు గుచ్చుకోవడం, మరిచెట్టు మొదలు తగిలి పడితే నడుము, మోకాలు బొక్కలు విరుగుతాయి. దానితో పరుగెత్తడం చేతకాక బెస్తవాళ్లకు దొరకడంతో వాళ్ళు బాగా కొడుతారు. ఆ దెబ్బలకి నర్సయ్య మగతలోకి జారుకుంటాడు. కన్నకొడుకులు ఇద్దరు దూరంగా బతకడం. భార్య, బిడ్డలను రక్షించుకునే సందర్భంలో నరసయ్య చనిపోవడం పాఠకులకు కన్నీటిని తెప్పించే కథ. మధ్యతరగతి కుటుంబాల దుస్థితిని హృదయ అవిసేలా వివరించిన కథ.

ఆరవ కథ “దేవ” గ్రామాలలో పెద్దరికం ముసుగులో అగ్రవర్ణాల అఘాయిత్యాలను చూపించిన కథ. మల్లారెడ్డిపటేలు గంగయ్య, దేవల దళిత కుటుంబానికి సహాయం చేస్తున్నట్లు నటిస్తూ అప్పులు ఇవ్వడం చేసేవాడు. ఇలా సహాయ రూపంలో అప్పులు ఇస్తూ దేవపై ఖాయిష్షు పెంచుకున్నాడు మల్లారెడ్డి. దానితో గంగయ్యను ముంబైకి పంపించి గంగయ్య భూమిని అచ్చు కట్టించి, చదును చేసి, పంటకు సిద్దంగా తయారుచేసి, ఖర్చులను అప్పు కాగితంగా రాయించుకోవడం మల్లారెడ్డి చేసిన ఎత్తుగడ. నాటి నుండి నేటి వరకు అగ్రవర్ణాల రూపం ఏం మారలేదు అనేది ఈ కథ ద్వారా తెలిసే నీతి. గంగయ్య ఊరులో లేని రోజు చూసి మల్లారెడ్డి తన భార్యను వాళ్ళ ఇంటికి పంపించి, దేవను ఇంటికి పిలిపిస్తాడు. మల్లారెడ్డి ఇంటికి వెళ్లే దాకా మల్లారెడ్డి మనసులో దేవపై ఉన్న కోరిక ఉన్నట్లు దేవకు తెలియదు. దేవకు చాలా మంది మల్లారెడ్డి గురించి చెప్పిన ఈ పటేలు అట్లాంటి వ్యక్తి కాదు అనేది. చివరకు మల్లారెడ్డి చేస్తున్న పనికి మోసగాడివి అని తిడుతుంది. చాలా వారించి బయటకు వెళ్లే సందర్భంలో తన అప్పు రెండు రోజుల్లో కట్టాలని చివరి అస్త్రాన్ని ప్రయోగించాడు మల్లారెడ్డి. అంత డబ్బు ఒకేసారి ఇవ్వలేని పరిస్థితి, ఇలాంటి కాలం తీసుకొచ్చిన దేవుడిని తిట్టుకుంటూ, ఏడ్చుకుంటూ స్తబ్దతగా నిలబడిపోతుంది. “ఎక్కువ కులం వారినే నమ్మవద్దు. మారిండ్రు అంటరు గని... ఏది...? కొంచెం మాట్లాడే పద్ధతి మార్చుకుండ్రు గంతే. ఎల్లుగాని ఎల్లయ్యంటుండ్రు. బలత్కరించే కాడ బతిమిలాడినట్టు ఉ ంటుండ్రు.... గంతే గంతే......గీ కాలంల గూడా...... మేకతోలు గప్పుకున్న పులులు అని అనుకున్నది. అలాగే పటేండ్ల రూపం మారిందే గాని గుణం మారలేదు”. అనే వాక్యంతో కథ ముగుస్తుంది.

ఏడవ కథ “కడుపు మంట” ఈ కథ యాచకులు అయిన బాలసంత కులానికి చెందిన కొమురయ్యకు సంబంధించినది. కొమురయ్యకు ఐదుగురు సంతానం. అందులో నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు. వాని పేరు రాజిగాడు. రాజిగాని పుట్టుకతో తల్లి బాలింత రోగంతో చనిపోతుంది. ముగ్గురు ఆడపిల్లలకు చిన్నతనంలోని పెళ్లిళ్లు చేసాడు. కొమురయ్యతో రాజిగాడు నాలుగో కూతురు పోశి ఉన్నారు. ఊళ్ళు తిరుగుతూ ఊరు ఆవతల వాయిలి బరిగెలతో గుడిసె వేసుకొని, ఆ ఊరు యాచిన కాగానే వేరే ఊరికి వెళ్లడం కొమురయ్య వృత్తి. పోశికి జ్వరం వచ్చి లేవలేని పరిస్థితిలో ఉంది. ఆ ఊరిలోని రాంరెడ్డి, వెంకట్ రెడ్డి పిల్లలు ప్రవీణ్, సురేష్ రెడ్డిలు రాజిగానితో స్నేహం చేయడం ప్రారంభిస్తారు. రాజిగాడు వారికి ఈత నేర్పిస్తాడు. రెడ్డి పిల్లలతో స్నేహం ఎక్కువ కావడంతో గమనించిన కొమురయ్య రెడ్డిల పిల్లలతో “సూడు పటేలా! మీరు మావోని సోపతికి రావద్దు. మీ వోళ్ళ కెర్కయితే మమ్ముల ఊళ్లలోకేయ్ ఎల్లగొడ్తరు. అతిలావు కోపమత్తే పాణం తోటి గూడ ఉంచరు. మీరు పిల్లలు మీకెర్కలేదు... ఏదో మేం.... బిచ్చగాళ్లం. ఆడనాల్గిండ్లు,ఈడ నాల్గిండ్లు అడుక్కుతిని బతికేటోళ్ళం...... మీ దండం బెద్త బాంచెన్ మా పోరని సోపతికి

రాకుంన్రి!." అని చెప్పిన వారు వినకుండా రావడంతో రాజిగాని సోపతి మూలాన పిల్లలు చదువుకోకుండా బడిమాని ఈతలకు వెళ్ళడం, తిరగడం చేస్తున్నారని రాజిగాన్ని కచేరి దగ్గర చెట్టుకు కట్టేసి ముళ్ళుగర్రతో బాగా ఇష్టం వచ్చినట్టు కొడతారు. ఆ ఊరిలో రామిరెడ్డికి ఎదురు చెప్పే వాళ్లే లేరు. ఇలా సామాన్యుడిపై, యాచకులు, అమాయకులపై గ్రామాల్లోని అగ్రకులాలవారు అహంకారంతో చేసినటువంటి దుష్ట చర్యను చక్కగా వివరించాడు రచయిత. కొమురయ్య నెత్తినోరు కొట్టుకుంటూ ఈ దౌర్జన్యాన్ని ఎదిరించే శక్తి లేక నిస్సహాయతతో రక్తం ముద్దగానున్న రాజిగాన్ని జబ్బపై వేసుకొని, ఏడ్చుకుంటూ శాపనార్థాలు పెడుతూ వేరే గ్రామానికి పోతుంటాడు. పోశి తండ్రిని అనునయిస్తూ చాప చుట్టుకొని వెళుతుంది. వారితో ఓ కుక్క జతగా పోతుంది . ఇంత అన్యాయాన్ని అక్కడి అక్కపెల్లి గుట్ట గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయింది.

ఎనిమిదో కథ "చంద్రకళ" ఈ కథలో చంద్రకళ, సూర్యం ఇద్దరు ప్రేమికులు. ఈ కథలో పురుషుల అహంకారంతో స్త్రీలను అణచివేసే విధానం గురించి స్త్రీ, పురుష సంబంధాల గురించి వివరించిన కథ. సూర్యం కవి, రచయిత తిండి మీద ధ్యాస ఉండదు. ఒకటే రాత ఒకటే చదువు ఆడపిల్ల ఆలోచనలను , ఇష్టాలను ఎప్పుడు అర్థం చేసుకుంటాడు అని చంద్రకళ పదేపదే దిగులు పడుతుంది. తల్లిదండ్రులు తెచ్చిన సంబంధాలలో ముక్కూమొకం తెలియని వాడిని చేసుకోవడం దేనికి..? తనకు నచ్చిన వాడిని చేసుకుంటే ఆనందంగా ఉ ండవచ్చు అని చంద్రకళ ఆలోచన. స్త్రీలకు స్వేచ్ఛ లేకుండా ఓడిపోవడానికి అలబడ్డ విధానాల గురించి రచయిత సూర్యం, చంద్రకళ ఇద్దరి మధ్య జరిగిన సంఘటనలో ప్రేమామృతంలో మునిగితేలిన స్వేచ్ఛ జీవుల కథ చంద్రకళ. ఎనిమిది కథల్లో ఈ కథ కొంత భిన్నమైనది. ఫెమినిజాన్ని గొప్పగా చూపెట్టాడు రచయిత.

రచయిత కథల్లో వాడిని సామెతలు:

గుడ్డి దీపం గుడిసె చీకటి, మోసె టోనికెరుక కావడి బరువు , సేత్తామంటే పనిలేదు సేతులొక్క పైసాలేదు, ఎప్పటి శిప్ప ఎనుగుల్నే, మొఖం మంచిగ లేక అద్దం నాలేకు గొట్టుడు, నడుమంత్రం సిరి నడి నెత్తిమీది కొప్పు.

రచయిత కథల్లో వాడిన యాస పదాలు:

కప్పి, రంజి, తుర్తి, ఇసారం, అయిసతి, ఉప్పోస, పుర్సతి, ఎరం, అయిస్క్రేట్లు, నళ్ళు, శెత్త, అయిసు, గుద్దం, నశీవ, దొబ్బ, కవుసు, గల్మ, అంబటాళ్ళ, పాతముర్వతి, గండగరువు, ఎన్కంతల, దుర్జెట్ట, మాలిమి, దబీల్న, బరిబాత, సోద్దెం, బీరాలు, బడాయి, పుణుకుడు.

జాతీయాలు:

పత్తికాయ పగిలినట్లు, గుండెల్ని పిండుతుంటాయి, అరిరామగోస, సిలుకకు జెప్పినట్లు జెప్పుడు.

ఉర్దూ పదాలు:

బాజాప్త, ఫసలు, జరూర్, సవులత్, పైజామా, షేల్వార్, ఫైల్వాన్, జల్ది, టకిల్న, కబురు, ఉషారు, ఖాతరు, సరంజామా, నామోషీ, ఖాయిసు.

జత పదాలు:

రప్ప రప్ప, ఒగోళ్ళ కొగోళ్ళు, పుండుపుండు, కొట్టుమిట్టు, సుర్ర సుర్ర, బరబర, చరచర, నంగినంగి, గిరగిర, కైకిలిగంబడి, పిడపపిడ, జువజువ, లొడలొడ, పులుకు పులుకు, కరకర, గుస గుస.

ముగింపు

రేణ కథల సంపుటిలోని కథలు సామాజిక చైతన్యం కోసం, అణగారిన వర్గాల జీవన శైలిని, మధ్యతరగతి కుటుంబాల బాధ్యతలను అలాగే నక్సలిజం సంఘాల పనితీరును, నాటి తెలంగాణ పరిస్థితులను ఈ కథలు వివరిస్తాయి. అలాగే పల్లెల్లో భూస్వాముల అరాచకాలను, అగ్రకుల అహంకార పూరిత విధానాలను, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థల విధానాలను కన్నులకు కట్టినట్లు చూపించాయి. ఈ కథలలో వాడిన భాష పల్లెలో మాట్లాడుకునే బాసతో పాత్రలను అనునయించారు రచయిత. ఫక్కా గ్రామీణ పలుకుబడితో చిత్రించారు. ప్రతి కథ కూడా గ్రామీణ నేపథ్యాన్ని తెలియజేస్తుంది. సామెతలు, నుడికారాలు, వాక్యాలు సన్నివేశానికి తగినట్లుగా కథకుడు తన ముందు జరిగిన తన అనుభవంలోనున్న యదార్థ సంఘటన తీసుకొని రాసినట్లు ఉన్నాయి. రచయిత గ్రామమైన కొండాపూర్ చుట్టూ గుట్టలు, మానేరు వాగులాంటి ప్రాంతాలను పరిచయం చేస్తూ, రాసిన గొప్ప కథల సంపుటి రేణ కథల సంపుటి.

రచయిత:తెలుగు ఉపాధ్యాయులు

జీవన వాస్తవికత-సిద్దెంకి యాదగిరి ‘తప్న’ కథలు

● అరిగె కమలాకర్

పరిచయం:

నాటి నుంచి నేటి వరకు మానవుని జీవితంలో అంతర్భాగమైన కథకు ఎంతో ఆదరణ ఉంది. ఆధునిక కాలంలో శాస్త్ర సాంకేతిక మార్పులు వచ్చి పుస్తక పఠనం తగ్గినప్పటికీ కథకు ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదు. జీవితంలో వచ్చే అనేక సంఘర్షణలకు పరిష్కారాలను చూపడం, బుద్ధి కుశలతను పెంపొందించడం కథల ప్రధాన లక్ష్యం. వాస్తవిక జీవితాన్ని కళాత్మకంగా చిత్రించడం కథల యొక్క లక్షణం. స్వరాష్ట్ర ఏర్పాటులో కూడా కథ ప్రధానమైన పాత్ర పోషించింది. అలాంటి కథలను అందించిన కథ పుస్తకం సిద్దెంకి యాదగిరి “తప్న”. “ఒక కథకుడికి రచన సామర్థ్యం లేకపోయినా సరిచేయవచ్చు కానీ జీవితము తెలియకపోతే సరి చేయడం ఎవరివల్లా కాదు” అన్నాడు కొడవటిగంటి కుటుంబరావు. మనవుని జీవితాన్ని ముడిసరుకు చేసి జీవిత వాస్తవికతను కళాత్మకంగా వ్యక్తీకరించి పాఠకుడిని ఆలోచింపచేయగలిగిన కథకులు సిద్దెంకి యాదగిరి. కథ మనిషి జీవితంలో అంతర్భాగం... మనిషి జీవిత ప్రతిబింబం కథ.



సిద్ధంకి యాదగిరి కథలు నిత్యనూతనంగా ఉంటాయి. కథ వస్తువు నవ్యత తో పాటు సామాజిక వాస్తవిక జీవితానికి దృశ్య రూపకంగా తోస్తుంది. కథను వినూత్న రీతిలో వ్యక్తీకరించడం, కథలోని మాలుపులు పాఠకులలో ఆలోచన రేకెత్తించి, ఉత్సుకథ కలిగిస్తాయి. కథను ఆకట్టుకునేలా రాయడంలో సిద్దెంకి కథలా ప్రధాన లక్షణం. తప్న లో మొత్తం 15 కథలు ఉన్నాయి.”ఆత్మ గౌరవ సాధన నినాదంతో ప్రయాణించిన మహనీయులకు మరియు సిద్దెంకి యాదగిరి నాయినమ్మ సిద్దెంకి మల్లవ్వకు” అంకితం ఇచ్చారు.

సిద్దెంకి యాదగిరి తప్న కథలలో మొదటిది ‘ విరిగిన కల’ ఈ కథ ఎంతో వైవిధ్యంతో కనబడుతుంది. ఈ కథ పేరులోనే రచయిత యొక్క శిల్పనైపుణ్యం తెలుస్తుంది. కలలు కనడం మానవ సహజం.... కానీ ఆ కలలను సహకారం చేసుకునే కృషే ఈ కథ. ఈ కథలోని పాత్రలు ఊశయ్య, ముత్యాలు, ఈరమని. ఊశయ్య, ముత్యాలు భార్యాభర్తలు. వారికి చాలా కాలం వరకు సంతానం కలగలేదు. భార్య ముత్యాలు ఒత్తిడి వల్ల ఊశయ్య రెండవ పెళ్లి చేసుకుంటాడు. ఇది ఈ కథ యొక్క ఇతివృత్తం. వారు సంతానం కోసం “ మొక్కని దేవుడు లేడు తిరగని తీర్థం లేదు”. భర్తకు భోజనం పెట్టి ముత్యాలు ఇలా అన్నది “ ఇగో మిట్టపల్లి కాడ తల్లి చచ్చిపోయిన బిడ్డ ఉ

న్నాడట. తెచ్చుకుందాం సాదుకుందాం. నంగునూర్ల తండ్రి సచినపోరగండ్లు నల్గురున్నారట. ఒక్కరిని ఇస్తారట ఏమంటవు''. అనడంలో తల్లితనంకై ఆరాటాన్ని ఆవిష్కరించినాడు. స్త్రీ త్యాగానికి మారుపేరని, అరమరికలు లేని ప్రేమ కు నిదర్శనం అని నిరూపించాడు. సంతానం కోసం ఊశయ్యకు గర్భవతి అయినా ఈరమనితో ముత్యాలు వివాహం చేయడం కథ మరింత పరిపుష్టం అయింది. సంతానం కలవడంతో ఒకరోజు ఊశయ్య , ఈరమని మందలించడం. ఈరమని భర్తను కూడా లెక్కచేయకుండా ప్రవర్తించడంతో కథ ముగుస్తుంది.

''ఒగోల్ని అనడు.. ఓగోల్తోటి అనిపించుకోడు, పిల్లగాడంటే గట్లుండలె'' అనే అన్మంతు అనే పాత్రతో పల్లెటూరులో ఉండే వావి వరుసలు, అనుభవ పాఠాలను అశు వుగా అందించిన గురువులుగా అందించాడు.

"పైసలు చేయని పని మనుషులు జేత్తరు" అనడంలో పల్లెలో ఉండే సహకార భావన ఉంది. ఎవరు ఎలాపోయే నాకేంటి నేను బాగుంటే చాలు అనే ప్రస్తుత సమాజానికి బుద్ధిచెప్పే మాటే ఈ" బుద్ధి మాట "కథ.

మనుషుల మనసులు కదిలించిన కథ" బోధ". చదువు ద్వారా సమసమాజ స్థాపన జరుగుతుంది. "పాఠశాల చిన్న సమాజం" అందులో పుస్తక పాఠాలు కాదు... జీవిత పాఠాలు నేర్చుకుంటారు. భారతదేశంలో కులాలు, ఉపకులాలు అనేకం ఉన్నాయి. పూర్వం నుండి కులాల మధ్య అస్పృశ్యతలు సహజంగా కనిపిస్తాయి. కానీ ఉప కులాల మధ్య కూడా అనేక అస్పృశ్యతలను గుర్తించి బోధ కథను నిర్మించడం రచయిత యొక్క పరిశీలన దృక్పథానికి తార్కానంగా చెప్పవచ్చు."బల్లె కులానికి ఒకడు చదువుతాడు అన్లా అందరికంటే తక్కువ కులపోలు మనమే కదా? అవునా కాదా ? నా తోటోళ్లు నేను కలిసాదుకుంటునం. కలిసి చదువుకుంటున్న''. అని మానవులంతా ఒక్కటేనని బాలయ్య పాత్ర ద్వారా తెలియజేశాడు. జంతువుల మధ్య లేనటువంటి ఈ భేద భావం మానవుల్లో ఎవరు కలిగించారు అని వ్యతిరేకిస్తూ "ఎవరైనా మట్టి పని చేసిన సరే అందరూ మీ పొరగాండ్లను బడికి సదవడానికి పంపుండ్రి " అని చదువు యొక్క ఆవశ్యకతను రఘుపతి రెడ్డి అనే మరొక పాత్ర ద్వారా చెప్పించాడు రచయిత. సమాజంలో అందరూ జ్ఞానవంతులైనప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుంది. కొడుకు పుట్టాడన్న సంతోషం తీరకముందే, కళ్ళారా చూడకముందే దేశం కోసం దేశ రక్షణలో ప్రాణాల సైతం తృణప్రాయంగా వదిలినట్టి సైనికుడి కదే రేపటి సూర్యుడు.ఇది గుండెను పిండేసిన కథ."చనువాళ్ళతోపాటు కన్నీళ్లు కూడా సేవిస్తున్నాడు నాన్న దృష్టిలో రేపటి కమాండర్" అన్న ఈ మాటలుకు కనులు చెమ్మగిల్లక తప్పదు. ఇది సైనిక పరాక్రమాలతో పాటు, గ్రామీణ జీవనానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. రాయి తగిలి చచ్చిపోయే వాళ్లు, ప్రమాదంలో ఆయువు మోడిన వాళ్లు, పగలతో కొట్టుకొని చనిపోయే వాళ్లు, ప్రతి ఒక్కరు ఏదో ఒక తీరుగా, ఎప్పుడూ ఒకప్పుడు చనిపోతారు. చావడం తప్పనప్పుడు ప్రజల కోసం, దేశం కోసం, చావడంలో అమరత్వం ఉంటుందని రచయిత తెలియజేశారు.

మార్పు కథ మరో భిన్నమైన జీవితాన్ని పట్టుకున్నది. ఏదైనా ఒక విషయాన్ని కంటితో చూడడం సహజం కానీ ఒక విషయాన్ని హృదయాంతరాల నుంచి వెలికి తీయడం రచయితకు సాధ్యం. రోడ్డు పక్కనో, సిగ్నల్ దగ్గరనో, బస్ స్టాపుల్లో, రైల్వే ప్లాట్ఫారంపై చాలామంది బాలల దుస్థితిని మనం చూస్తూనే ఉంటాం. కానీ వాటిని కొంత సమయంలో మర్చిపోవడం జరుగుతుంది. రచయిత మాత్రం దానిని దేశ ముఖచిత్రంపై దారిద్యం యొక్క జాడలకు నిదర్శనంగా నిలబెట్టారు. రచన సామాజిక చైతన్యానికి, బాధ్యతకు నిదర్శనమని నిరూపించారు.

సునీల్ అనే ఉపాధ్యాయుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగి స్పీడ్గా వెళ్తుంటే 8 సంవత్సరాల పిల్లవాడు చింపిరి జుట్టు మోసిన బట్టలతో ఎదురొచ్చి కాళ్ళ మీద వాడతాడు. అలాగే సునీల్ కాళ్లపై కూడా ఆ పిల్లవాడు పడడం. పది రూపాయల కోసం అతని ఆరాటం ఆకలి పోరాటాన్ని గమనించి అరడజన్ అరటి పండ్లు కొని అతని ఆకలి తీర్చాడు."ఏపూర్రా మీది?"

"ఏమో తెలియదు"

"సదువుకో పోయినావురా?"

"సదువనియ్యారు"

"అదే?"

"మేం అడుక్కొచ్చి మాయ్యవ్వలకు రోజు పైసలు ఇవ్వకపోతే తిండి పెట్టరు".

ఈ సంభాషణ ఆకలి తీవ్రతను బాల కార్మికుల దుర్భర పరిస్థితిని మన కళ్ళకు కడుతుంది. కన్న తల్లిదండ్రులు కూడా ఇలా ప్రవర్తించడం ఎంత అమానవియం. పసివాడని చూడకుండా పక్క బొక్కలు ఇరిగేదాకా కొడతారా సోయి తప్పి పడిపోయిన పట్టించుకోని తల్లిదండ్రులు ఉంటారని? మనం ఊహించగలమా! పిల్లవాడికి సోయి వచ్చిన తర్వాత తను పక్కనే తాగుతూ మాట్లాడుకుంటున్న తల్లిదండ్రులు గాని తల్లిదండ్రుల మాటలు విని చెత్తకుండీలో తెచ్చుకున్నారని గుర్తించాడు. పిల్లవాడు కంట్లో యాసిడ్ పోసి గుడ్డివాడిని చేయాలన్న వారి ఆలోచన విని కన్నీటి సంద్రం అయ్యాడు పిల్లవాడు. ఆ పిల్లవాడినే కాకుండా వాళ్ళ తమ్ముడిని, చెల్లెల్ని పరిస్థితులను వివరించాడు. హాస్టల్లో చేరితే సమయానికి ఆహారం దుప్పట్లు ఇస్తారని చెప్పిన పిల్లవాడు మాటలు, బాల కార్మికుల భావోద్వేగాలు పాఠకుల హృదయాలు స్పందింప చేస్తుంది.

తప్ప కథలో చదువుకున్న వారిలో పైకి కనిపించని కులవివక్ష ఎలా ఉందో వివరించాడు. గుడిసెలాంటి మిద్దె ఇంట్లో తన కంట్లో దీపం వెలిగించుకుని చదివి ఉద్యోగం సంపాదించిన నర్సయ్యను కులం నొసటిమీద పత్స బొట్టై వెక్కిరించింది. ఉద్యోగరీత్యా సిద్దిపేటలో కిరాయి రూంల కోసం వెతుకుతున్నపుడు రూం కిరాయికి ఇవ్వం అని మొఖం మీదనే చెప్పడం.కుల రక్కసి రకరకాలుగా వేధించినప్పుడు ఎలాగైనా ఇంటి స్థలం తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు.కొంత జాగా తీసుకొని ఇల్లు కట్టుకున్నాడు. ఇందులో కులం నిన్ను ఏ స్థాయిలో ఉన్నా విడిచిపెట్టదు అని నిరూపించాడు. వెల్కమ్ నగర్లో నడకతో రోజును ప్రారంభించే అందరూ ఉద్యోగస్తులే అయినా కులం వారిలో విభజన రేఖలను గీసింది.

కన్నయ్య దంపతులు ఇంటికి వచ్చి బొట్టు పెట్టి ఆహ్వానించడం ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది రాకేశ్ సార్ని. తను ఆహ్వానించగానే అంబేద్కర్ వాంచించిన ప్రపంచం ఆవిష్కృతమైందని సంతోషంతో పొంగిపోతున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్పాలని ఉవ్విళ్లూరుతున్న రాకేష్ సార్ కు. లోకల్ కు వెళుతున్న నర్సయ్య సార్ కనిపించాడు.కన్నయ్య సార్ వాళ్ళు కార్డు ఇచ్చిండ్రా? అని అడిగాడు...లేదు ఇవ్వలేదే? అని ప్రశ్నార్థకంగా మొఖం పెట్టిండు నర్సయ్య సార్. వాళందరిది బిల్డింగ్లు ధనికవర్గం. నాది రేకుల షెడ్డు బీద వర్గం. ఎప్పుడైనా ధనికులందరూ ఒక్కటే అని అనుకున్నాడు. ఇది ఒక్క వ్యక్తికి జరిగిన అవమానం అనుకుంటే పొరపాటే అవుతుంది. ఇది ఆత్మగౌరవ జరిగిన అవమానం."నిన్నొక తీరు. నన్నొక తీరు పెండ్లికి పిలిచారు. నర్సన్నను ఇప్పటివరకు పిలువనేలేదు" దేశం నరాలలో పారుతుంది రక్తమా?లేక కులమా? అన్నట్లు ఉంది. రాకేష్ సార్, వెంకటయ్య సార్, నర్సయ్య సార్లు పోతే అందరం పోదాం.లేకుంటే లేదు. అని తప్ప చేసుకున్న తీరు ఈ కథకు పతాకస్థాయికి తీసుకొచ్చాడు రచయిత.

ఈ కథలు మట్టిలో పుట్టిన ఉభయ తెలుగు రాష్ట్రాలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ గ్రంథ పురస్కారముగా కథా ప్రక్రియలు 2019వ సంవత్సరానికి ఎంపికైనది.

మామూలు జీవితాలే అయినప్పటికీ మహోన్నతంగా తీర్చిదిద్దిన సిద్ధంకి యాదగిరి కథ రచన నైపుణ్యం పాటకున్ని ఎంతగానో హత్తుకునేటట్లు చేస్తుంది. ఈ కథలలో చదివించే గుణం కలదు.

సిద్దెంకి యాదగిరి కథలు క్లుప్తంగా, నిర్దిష్టంగా ఉంటాయి. భావుకతతో కూడిన కథలు అందించడంలో రచయితది అందెవేసిన చేయ్యి. పాత్రల మధ్య సంఘర్షణ, సమస్యల సంక్లిష్టతను చూపడం జరిగింది. కథాంశాలు ఎక్కడ సడలిపోకుండా ఎత్తుగడలు ప్రదర్శించడం.

ఈ కథశిల్పం పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేస్తుంది. సిద్దెంకి రచనల్లో పల్లె మట్టిసౌరభాలు, సామెతలు, పలుకుబడులు తెలంగాణ భాషాయాస మూలాలను నిలుపుతాయి. అచ్చమైన పల్లెజీవనము, సహకార, ఆదర్శతత్వాలు పాఠకుల హృదయాలను తట్టిలేపుతాయి. సిద్దెంకి కథలు తెలంగాణ భాషాయాసలను చిరునామాలుగా నిలుస్తాయి.

రచయిత: తెలుగు భాషోపాధ్యాయులు, సిద్ధిపేట్

మానవ నాగరికతతో పెనవేసుకున్న రైతు ఆత్మకథా చిత్రం

బాలసుధాకర్ మౌళి

ఉపోద్ఘాతం:

కవిగా గౌరునాయుడు మాస్టారి స్వభావం ఎక్కడా చెదిరిపోకుండా ఒక కొత్త దృష్టితో వచ్చిన ఈ సంపుటే ఈ 'నదికీ ఒక భాష ఉంది'. 'నదిని దానం చేసాక', 'ఎగిరిపోతున్న పిట్టలకోసం' తర్వాత సుమారు పదేళ్ల తర్వాత వచ్చిన సంపుటి 'నదికీ ఒక భాష ఉంది'. బాల్యం నుంచి ఇప్పటివరకు అతని అనుభవసారం ఈ కవిత్వంలో ప్రతిధ్వనించడం మనం గమనిస్తాం. అంతకు ముందరి కవిత్వానికి ఈ కవిత్వానికి ముఖ్యమైన తేడా ఇదే.

అంతకుముందు సంపుటాల్లో లేని ఒక విశాలత ఈ సంపుటిలోకి రావడం గౌరునాయుడు మాస్టారు సాధించిన ఒక విశిష్టత.

ఏమిటా వైశాల్యత ?

ఒక పొలిటికల్ స్పష్టత- ఈ సంపుటిలోకి వచ్చి చేరింది. 2006లో వచ్చిన 'నదిని దానం చేశాక'లోనూ, 2014లో వచ్చిన 'ఎగిరిపోతున్న పిట్టల కోసం'లోనూ ఒక పల్లెకు చెందిన ఒక పేద రైతుగొంతుగానే ధ్వనించిన గౌరునాయుడు మాస్టారు ఈ సంపుటి ద్వారా గ్రామ సరిహద్దులను దాటి బయటకు రావడమనేది ప్రధానంగా జరిగింది.

పల్లె నడిబొడ్డున నిలబడి- పల్లెల విధ్వంసాన్ని, దుఃఖాన్ని కలగలిపి పాడిన గౌరునాయుడు మాస్టారులో మూలాలను మరవకుండానే ఒక కొత్త చూపు, ఒక కొత్త వేకువ పొడచూపింది అనడానికి ఈ సంపుటి సాక్ష్యం.

మూలాల నుంచి ఒక్క అడుగు కదపకుండానే ఈ పనిని కవిగా గౌరునాయుడు మాస్టారు చేశారనడంలో సందేహం లేదు.

అందుకు తార్కాణం అతను రాసిన నాగావళి నేపథ్య కవితలు. మట్టిది నదిది వదిలిపెట్టలేని బంధం. గత రెండు సంపుటాల్లో మట్టిని గురించి గాఢంగా కలవరించిన కవి, ఈ సంపుటి ద్వారా నదిని గాఢంగా హత్తుకోవడం నేనన్న మాటకు రుజువు.

ఒక పక్క రైతుగా మూలాల పట్ల నిమగ్నమై వుండటమే కాదు, ఇంకోపక్క వర్తమాన రాజకీయ చిత్రపటాన్ని గ్రహించడమూ వుంది.

ఈ సంపుటి ద్వారా గౌరునాయుడు మాస్టారు సాధించిన విస్తృతి ఇదే.

'అక్షరాల పుట్టుక కుట్ర కాదు,
పదాలు ప్రాణగీతాలు కావడం కుట్ర కాదు,
అక్షరాలు పదాల్లో వొదగడమూ కుట్ర కాదు,
పదాలు వాక్యాలు వాక్యాలుగా ప్రవహించడం కుట్ర కానేకాదు,
వాక్య రహిత సమాజాన్ని ఊహించడమే అసలు కుట్ర.'

అని అంతకు ముందు ఈ స్పష్టతతో గౌరునాయుడు మాస్టారు అనలేదు. రాజకీయ దుశ్చర్యల పట్ల అవగాహన వున్నాసరే ఈ సూటిదనం అంతకు ముందు ఇంత బలంగా అభివ్యక్తం కాలేదనే చెప్పాలి.

'ఎత్తుపల్లాల్ని సరిచేసి హృదయకేదారాల్లో
పాటలపంటలు పండించాలనుకునే వాక్యాల్ని
ముక్కలుముక్కలుగా నరికి, ఉక్కుపాదాలకింద నలిపి,
వికటాట్టహాసం చేసే కుట్రదారులెప్పుడూ వుంటారు'
అని అంటాడు.

ఇక్కడ ఒక స్టాన్ స్వామి, ఒక జి.ఎన్. సాయిబాబా గుర్తుకు రాకుండా మానరు.

కవిత తదుపరి స్టాంజాలో

'ప్రశ్నలై కళ్లకడ్డంపడే వాక్యాల్ని తునాతునకలు చేసి,
ఏకఛత్రచ్ఛాయలో నిశ్చింతగా నిద్రపోవాలని
కొందరి ఆశ కావచ్చు'

అని అన్నప్పుడు- వర్తమాన ఆధిపత్య రాజకీయ స్వభావాన్ని తేటతెల్లం చేస్తుంది.

ఇదే కోవలో 'సూర్యనమస్కారం' కవిత వస్తుంది.

'సూర్యుణ్ణి చుట్టుముట్టి ఛిద్రం చేయాలనుకునే
చీకటిచారికల్ని చూస్తే జాలేస్తుంది'
అంటాడు కవి.

జి.ఎన్. సాయిబాబ మీద రాసిన 'ఈ ఖాళీలనెవరు పూరించగలరు?' కవితలో సాయిబాబ సహచరి వసంత గొంతుకగా ధ్వనించాడు ఇక్కడ కవి.

'నిన్ను మోసీ మోసీ తేలికైన నా వొళ్ళిప్పుడు
నువ్వు దిగిపోయాక
ఎవరూ కదపలేనంత బరువైపోయింది' అంటాడు.

'యోధుడా కౌగిలించుకోనీ..!' కవిత కవిగా గౌరునాయుడు మాస్టారి రాజకీయ వ్యక్తీకరణకు ప్రతీక.

'ధ్వంసమైన పచ్చని పళ్ళతోటను చూసి అలల ఉయ్యాలలూగుతూ
కొలనులో కొంటెగా నవ్వుతుంది కమలం'
అని కమల రాజకీయాలను అవగాహనలోకి తెస్తాడు.

'అలగ వొదిలీకండ్రా..' కవితదీ ఇదే దారి.

అంతకు ముందు సంపుటాల్లోలేని under currentగా వున్న రాజకీయ వ్యక్తీకరణ ఈ సంపుటి ద్వారా బలంగా బయటకు రావడం జరిగింది.

'అలగ వొదిలికండ్రా.. ఎవలకైనా సూపించండ్రా
సిత్రసిత్రమైన యేసాలేత్తన్నాడాడు
పెద్ద పెద్ద టోపీలెట్టుకోని పిట్టల్దొరలాగ ఒకరోజొత్తాడు
మెడనిండ రుద్రాక్షమాలలు దిగేసుకోని ఒకసారొత్తాడు
సాదు సన్నాసుల్తోటి మరొకసారొత్తాడు
ఆడి సిన్నమెదడు సితికిపోయింది గావాల
పెద్ద మెదడు పిగిలిపోయింది గావాల
అలగ వొదిలీకండ్రా...! ఎవలకైనా సూపించండ్రా...!'

అని అన్నప్పుడు కవి ఎవరిని ఉద్దేశించి setirecalగా మాట్లాడుతున్నాడో తెలిసిపోతుంది. అంటాడు–

'ఆడికి పుట్టుగు నేదట, అందర్లాగ అమ్మకడుపులపుట్టనేదట,
ఆడికాడే ఆకాశింకాసి ఊడిపడ్డాడట
ఆడికి మొదులు, కొసా నేవట,
అదేదో గొప్పకార్యం సెయ్యమని బగమంతుడే
ఆడినీభూమ్మీదికి పంపించేడట'

కవిగా గౌరునాయుడు మాస్టారు సాధించిన political angle ఇది.

'సిగ్గుగా ఉంది' కవిత యుద్ధానికి సంబంధించిన కవిత.

'నదికీ ఒక భాష ఉంది' సంపుటిలో ప్రధానంగా ఒక నాలుగు పాయల గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఒకటి– అంతకు ముందరి సంపుటల్లో లేని ఒక స్పష్టమైన పొలిటికల్ గొంతు, వర్తమానానికి వర్తించే పొలిటికల్ గొంతుగా ఈ సంపుటిలో ఉంది. రెండు– కవిగా గౌరునాయుడు మాస్టారు మొదలవడమే వ్యవసాయ కవిగా మొదలయ్యాడు. కాబట్టి ఆ మూలాల నుంచి వ్యవసాయ గొంతు, అదే నదితో పెనవేసుకున్న వ్యవసాయ గొంతు అనేది ఈ సంపుటిలో బలమైన వ్యక్తీకరణగా బయటపడింది. మూడు– కళింగభాషతో కళింగ బతుకును చిత్రించడం అనేది ఎప్పటిలాగే చాలా బలంగా వచ్చింది. నాలుగు– జీవితంలో సుదీర్ఘకాలం అనుభవం సంపాదించడం మూలాన వ్యక్తిగత తాత్వికతలోతు కూడా గౌరునాయుడు మాస్టారులో పెరిగిందన్నదానికి తార్కాణంగానూ ఈ సంపుటి నిలుస్తుంది. మిగిలిన మరికొన్ని పాయలూ ఉన్నాయి. కరోనా నేపథ్యంలో కవితలు రాశారు, భూషణం, వంగపండు, అట్టాడ, చాగంటి తులసి, జాషువా– వీరి మీదా కవిత్వం రాయడం జరిగింది

ఆయనకథ కూడా కవితే నాకు. గౌనా మాస్టారి సాహిత్య తాత్వికత ప్రధానంగా వ్యవసాయమే. సిద్ధాంతం వ్యవసాయమే.

నదితో పెనవేసుకుపోయిన ఒక రైతు ఆత్మకథాచిత్రం 'నదికీ ఒక భాష ఉంది'.

వ్యవసాయమే తన జీవితానికి, తన సాహిత్యానికి అస్తిత్వంగా గల ఒక సృజనకారునికి నది కూడా అస్తిత్వ చిహ్నమే అన్న మాటకి ఈ సంపుటి ఉదాహరణ.

కవి దేనిమీద ఎన్ని కవితలు రాశాడు అని లెక్క వద్దు. ఈ సంపుటి ద్వారా కవి ప్రకటించిన తాత్వికత ఏమిటి? అనేది ముఖ్యం. గౌనా మాస్టారి కవిత్వమే కాదు మొత్తం సాహిత్యతాత్వికత అంతా వ్యవసాయమే. ఆయన వ్యవసాయ కవి. ఈ సంపుటిలో ప్రధానంగా నదిని గురించి కలవరిస్తాడు. నది ఆనందాలను, దుఃఖాలను జీవితంతో పోల్చుకుంటాడు.

కె. సచ్చిదానందన్ golden river అను ఒక collection of Indian poems తీసుకొచ్చాడు. Keki n daruwala అను ఒక కవి river poems తీసుకొచ్చాడు. ఒరియా కవి జయంత్ మహాపాత్ర మహానది మీద river అను ఒక సంపుటిని తీసుకొచ్చాడు. మన గౌరునాయుడు మాస్టార్ నాగావళిమీద ఎక్కువ కవితలున్న సంపుటిని తీసుకొచ్చారు. Indian river poemsతో గౌనా poemsను పోలికగట్టాలి. సరిపోల్చాలి.

ప్రతి కవిత్వసంపుటానికి తాత్వికత అనేది వుంటుంది– వుండాలి కూడా. ఒక డెబ్బై సంవత్సరాల వ్యక్తి అనుభవ సాంద్రత గౌనా మాస్టారి కొత్త సంపుటిలో పరుచుకుంది.

రచయిత: స్కూల్ అసిస్టెంట్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల– కొండపాలెం, విజయనగరం జిల్లా

నేటికీ వర్తించే “నడుస్తున్న చరిత్ర”

బాషిపాక నవీన్

కవిత్వం పేరుతో భావ కవిత్వం, ఆత్మాశ్రయ కవిత్వం కుప్పలు తెప్పలుగా వస్తున్న రోజుల్లో విప్లవాన్ని కాంక్షించి, శ్వాసించిన శివసాగర్ తన ప్రతీ కవితలోనూ విప్లవ ఆశావాదాన్ని పలికించాడు. శివసాగర్ ప్రపంచ విప్లవ సాహిత్యంలోనే అరుదైన, అపురూపమైన కవి. ఆయన లేని తెలుగు సాహిత్యాన్ని, విప్లవ సాహిత్యాన్ని ఊహించడం కష్టం. “కుంభం జ్ఞాన సత్యమూర్తి” అలియాస్ కె. జి. సత్యమూర్తి, శివసాగర్ – మాజీ నక్సలైట్, ప్రముఖ విప్లవ రచయిత. ఈయన శివసాగర్, శివుడు, రెంజిమ్ అనే కలం పేర్లతో రచనలు చేశాడు. తెలుగు సాహిత్య చరిత్రలో ఒకవైపు పెన్ను, మరోవైపు గన్ను పట్టుకొని ఉద్యమాన్ని, కవిత్వాన్ని సమపాళ్లలో నడిపిన తొలి కవి శివసాగర్. “గెరిల్లా విప్లవ గీతాలు, జనం ఊపిరితో, పది వసంతాలు, నెలవంక, ఉద్యమం నెలబాలుడు, నడుస్తున్న చరిత్ర, యుద్ధ చంద్రుడు” వంటి కవితా సంపుటాలను రచించాడు. సత్యమూర్తి నక్సలైట్ ఉద్యమంలో చేరిన సమయం నుండి శివసాగర్ అనే కలం పేరుతో కవితలు రాయడం మొదలుపెట్టాడు. ఉద్యమంలో పని చేస్తున్న సమయంలో ఆయన ఒక కుట్ర కేసులో అరెస్టు అయ్యి జైలు శిక్ష కూడా అనుభవించాడు.

బెంగాల్ నక్సల్బరీ ఉద్యమ స్ఫూర్తితో ఆంధ్రాలో నక్సలైట్ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాడు. పీపుల్స్ వార్ గ్రూపు వ్యవస్థాపక సభ్యుడైన శివసాగర్ కమ్యూనిజంతో పాటు అంటరానితనం, సామాజిక అసమానతలు, అంబేద్కర్ భావజాలం, కుల వివక్షపై గొంతు ఎత్తడం లాంటివి చేశాడు. ఆ తర్వాత పార్టీలో వచ్చిన విభేదాల కారణంగా పార్టీ నుండి బయటకి వచ్చారు. ఆ తరువాత సి.పి.ఐ. (ఎం.ఎల్) ప్రజా ప్రతిఘటనలో చేరి ఆ బృందం లక్ష్యాన్ని వర్గ పోరాటం నుండి కుల పోరాటం వైపుకు మళ్లించాడు. శివసాగర్ మార్క్సిజాన్ని, గతితార్కిక భౌతికవాదాన్ని బలంగా నమ్మాడు. ఉద్యమం నెలబాలుడు కవితా సంపుటి కొనసాగింపే “నడుస్తున్న చరిత్ర” అని శివసాగర్ ప్రకటించాడు.

ఆధిపత్య సంస్కృతిని ధ్వంసం చేయడానికి, దళిత సంస్కృతిని, సౌందర్యాత్మకతని ప్రతిపాదించాడు. దళిత కవిత్వం కూడా గణనీయంగా రాసిన శివ సాగర్ విప్లవ కవిత్వానికి బ్రాండ్ అంబాసిడర్ అయ్యాడు. ఈయన రాసిన “ఉద్యమం నెలబాలుడు, నర్రెంక చెట్టు కింద నరుడో భాస్కరుడా!, చెల్లీ చంద్రమ్మ, తూర్పు పవనం వీచెను” మొదలైనవి ప్రసిద్ధమైన గేయాలు.

**“నేనే నిప్పును, నీరును
రణరంగంలో పోరాడే
లక్షలాది సైనికుల్లో
నేనొక సైనికుణ్ణి
సైనికుణ్ణి నేనే
రణ రంగాన్ని నేనే”**

అంటూ శివసాగర్ విప్లవ కవిత్వ కాంక్షని తన నడుస్తున్న చరిత్ర కవితా సంపుటి ముందు పేజీలో రాసుకున్నాడు. ఉద్యమం నెలబాలుడు నుండి నడుస్తున్న చరిత్ర దాకా సాగిన నాలుగు దశాబ్దాల కృషిలో సాయుధ పోరాట ప్రతి ధ్వనులు విజృంభించాయి. “నడుస్తున్న చరిత్ర” కేవలం దళిత కవిత్వం మాత్రమే కాదు, విప్లవ దళిత కవిత్వం – దళిత విప్లవ కవిత్వం. ఒక రచయిత ఏ రచన చేయడానికైనా వారిపై స్థల– కాలాదుల ప్రభావం ఉంటుంది. ఈ నడుస్తున్న చరిత్ర కవితా సంపుటిని దళిత ఉద్యమం, దళిత విప్లవం ఆధారంగా రాయడానికి గల కారణం కూడా అదే. అలాగే దళిత కవిత్వపు సౌందర్యాన్ని, దళిత జీవితం ఉన్నవారు మాత్రమే రాయగలరు. శివసాగర్ దళిత జీవితాన్ని అనుభవించాడు కాబట్టే ఆయన కలం నుండి దళిత సౌందర్యం జాలువారింది.

**“శంబూకుడు పెదాల మీద చిరునవ్వుతో
రాముని్న వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును
గొడ్డలితో నరుకుతున్నాడు”**

లాంటి కవితా పాదాలను నడుస్తున్న చరిత్ర అనే కవితలో వ్యతిరేక దృక్పథంతో వర్ణించాడు. దళిత సాహిత్యాన్ని కేవలం ఇంద్రియ జ్ఞానానికి కట్టుబడి చేసి చారిత్రక, రాజకీయ, తాత్విక దృక్పథం నుండి వీక్షించకపోవడం వల్ల అది సంక్షోభంలో పడిందని రచయిత అభిప్రాయం. ఆధునిక కాలంలో సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయాల్సిన స్థితిని, కొత్త రాజకీయ పరిజ్ఞానాన్ని అందించింది. బ్రాహ్మణవాదంలో చండాలుడు పరమ హీన చరిత్రకు సంకేతం. కానీ, దళిత వాదంలో చండాలుడు తిరుగుబాటుకు సంకేతం. చండాల చరిత్ర = తిరుగుబాటు చరిత్ర. దళిత సౌందర్య శాస్త్రాన్ని చెప్పాలనే ప్రయత్నంతో “మండుతోన్న మాదిగ డప్పు” అనే కవితను రాశాడు.

"మందే మాదిగ డప్పులా
ఉదయిస్తోన్న సూరీడుపై
చిర్రా, చిటికెన పుల్ల తీసుకుని
తొలకరి పాటకు దరువేస్తున్నాను"

అనే కవిత ద్వారా దళిత ఈస్థటిక్స్‌ను శివసాగర్ అభివృద్ధి పరిచారు. మందే మాదిగ డప్పు, చిర్రా, చిటికెన పుల్ల, లందెలు, వరికీళ్లు, దరువు, ఆరె వంటి పదాలు కొత్త అభివ్యక్తికి తోడ్పడ్డాయి. దళిత జీవనంలోని విభిన్న అంశాల్ని కవితామయం చేయడమే దళిత ఈస్థటిక్స్. దీనికి పునాదులేసిన శివసాగర్ ప్రభావం అనేక దళిత కవులపై పడింది. దళిత కవిత్వం అంటే కేవలం ఆగ్రహ వ్యక్తీకరణగా భావించే వారికి కవిత్వంలో సౌందర్యం ఎలా ఉంటుందో "నల్లాటి సూరీడు" పాట ద్వారా చక్కని ఉదాహరణ ఇచ్చాడు.

"సిక్కోలు కొండల్లో సీమలబారు సూరీడు
గోదారి వరదలకు ఎదురీదే సూరీడు
తెగిపడ్డ శంబూకుని శిరస్సులాంటి సూరీడు
ఏకలవ్యుని తెగిన బొటనవేలు సూరీడు"

అనే కవితా పాదాలు శివసాగర్ దళిత దృక్పథంలోని విశాలత్వాన్ని సూచిస్తాయి. సిక్కోలు(శ్రీకాకుళం) కొండలు అనే ప్రస్తావనతోనే దళిత విముక్తి మార్గం ఏమిటో చెప్పకనే చెప్పినట్టయింది. శైలీ, శిల్పాల రీత్యా "నల్లాటి సూరీడు" పాట ఎంతో విశిష్టమైనది. తాత్వికంగానూ, రాజకీయంగానూ దళిత ఉద్యమం అందుకోవాల్సిన శిఖరాగ్ర స్థాయిని ఈ పాటలో శివసాగర్ సూచించాడు. కానీ, అది జరగలేదనేది ఇప్పుడు కనిపించే వాస్తవం. ఎప్పటికైనా ఆ స్థాయిని అందుకోవడం దళిత సాహిత్య ఉద్యమానికి అనివార్యమైన కర్తవ్యం.

ఆకాశపు అంచుల్లో ఎగురుతూ వయసు మళ్లిన తర్వాత మళ్లీ నేల మీది మంటల్లోకి దూకి బూడిద అయ్యే ఫీనిక్స్ పక్షి. ఆ బూడిద నుండి యవ్వనంగా తిరిగి లేచి నింగికి ఎగిరిపోతుంది. ఈ "ఫీనిక్స్" అనే కవితలో విప్లవం ఎప్పటికీ అణిచి వేయబడదు అనే భావజాలంతో ఫీనిక్స్ పక్షిని విప్లవానికి ప్రతీకగా వాడాడు. మరొక కవితలో "గో ధూళి వేల అరచేతిలో గోరింటాకు ఎరుపెక్కే వేల తిరిగి లేస్తాను" అనే కవితా పాదాలు విప్లవ కాంక్షను రేకెత్తిస్తాయి. విప్లవోద్యమంలో అమరులైన కా. నల్లా యాదిరెడ్డి, యర్రంరెడ్డి సంతోష్ రెడ్డి, మురళి ప్రభృతులకు అంకితంగా "ప్రతీ గాయం నుండి హృదయమున్న బుల్లెట్ పుష్పిస్తుంది" అనే కవితా పాదాలలో బూటకపు ఎన్‌కౌంటర్లు, హత్యల ద్వారా ఉద్యమం ఆగిపోదు, అది నిత్య యవ్వనంతో తిరిగి ప్రకాశిస్తుంది అంటూ "అమరులు మిణుగురు పురుగులు" అనే కవిత రచించాడు.

కంచికచర్ల కోటేశు అంటరాని ప్రేమ ఉదంతాన్ని స్ఫురింపజేసే కవిత "పిచ్చివాడి పాదముద్ర"లో కూడా దళిత సౌందర్యాన్ని చూపించాడు శివసాగర్. తిలక్ రాసిన అమృతం కురిసిన రాత్రిలోని పరారైన వ్యక్తి కోసం అనే కవితా ప్రభావంతో "చిక్కడు దొరకడు – బిన్ లాడెన్(ఒసామా బిన్ లాడెన్ మీద వ్యంగ్య కవిత)" గురించి కవితని రచించాడు. జనవరి 2002 ఖమ్మం అడవిలో శివసాగర్ పనిచేస్తున్న రాజకీయ పాఠశాలను పోలీసులు చుట్టుముట్టినప్పుడు, తప్పించుకున్న తర్వాత "జీవితమా! నా యవ్వనాన్ని తిరిగి నాకివ్వు" అనే ఆవేదన కవిత్వం రచించాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్యాపిలి అనే ప్రాంతంలో వినాయకున్ని ఊరేగించాలనుకున్న దళితులపై అగ్రవర్ణ నాయకుల అమానుష దాడికి నిరసనగా "ప్యాపిలి! ప్యాపిలి!" అనే కవిత రాశాడు.

నడి వీధిలో తలెత్తుకొని
సగర్వంగా ఊరేగాలని
సాహసించినందుకు
రాళ్ల వర్షం, పట్టుడు కట్టెలు
వేట కొడవళ్ళు, నెత్తుటి గాయాలు!" .

నా దేశం అసలు పేరు ప్యాపిలి, అది చిరు చీకటిలో రేపటి జాబిలి అంటూ దళిత యువకులపై జరిగిన దాడిని ఖండించాడు. తీవ్రవాది అనే నెపంతో అస్సాం రైఫిల్స్ కు చెందిన "మనోరమ" దేవిని అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి, మానభంగం చేసి, కాల్చి చంపేసారు. ఈ దురంతానికి నిరసనగా అస్సాం రెజిమెంట్స్ బ్యారెట్స్‌కు ఎదురుగా మహిళలు దిగంబర ప్రదర్శన చేశారు.

భారత సైనికులారా! రండి! దమ్ముంటే మమ్మల్ని రేప్ చెయ్యండి! మనోరమను చేసినట్లే చెయ్యండి! అని సవాల్ విసిరారు. ఈ సంఘటన స్ఫూర్తిగా "రండి మమ్మల్ని రేప్ చెయ్యండి" అనే కవితని రచించాడు. తిరుగుబాటుకు స్ఫూర్తిగా ఈ కవిత చెరిగిపోని ముద్ర వేసింది. ఈ విధంగా కొన్ని విప్లవాత్మకమైన సంఘటనలు, దళిత సౌందర్య శాస్త్రం, దళిత విప్లవ కవిత్వం – విప్లవ దళిత కవిత్వం వంటి కవితల ద్వారా నడుస్తున్న చరిత్రను రూపొందించాడు శివసాగర్. "నడుస్తున్న చరిత్ర" కవితా సంపుటిలో దళిత అస్తిత్వం, విప్లవ పోరాటం, ఉద్యమ స్ఫూర్తి లాంటి అంశాలను కళ్లకు కట్టినట్లు చూపించాడు. ఇప్పుడు నడుస్తున్న చరిత్ర పరమ చండాల చరిత్ర అంటూ చండాల చరిత్ర అంటే తిరుగుబాటు చరిత్ర అని చెప్పాడు. అంటరానితనాన్ని అనుభవిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ పుస్తకంలో ఉన్న దళిత సౌందర్యం, విప్లవ కవిత్వం ప్రేరణనిస్తాయి. తన రచనలతో విప్లవ సాహిత్యంలో, దళిత కవిత్వంలో చెరిగిపోని ముద్ర వేసిన శివసాగర్‌కు విప్లవాభివందనాలు.

రచయిత: తెలుగు విద్యార్థి, ఓయూ.

విత్తనాలు అక్షరాలై మొలకెత్తుతాయ్..!

డా. ఎ.రవీంద్రబాబు

పరిచయం:

కవిత్వానికీ రుచి ఉంటుంది. అది ఫ్రిజ్ లో పెట్టి తింటే శరీరానికే కాదు, మనసుకూ మంచిది కాదు. సహజంగా పండించింద్దై, తాజాగా వండింద్దై ఉండాలి. అప్పుడే కదా వంటైనా, కవిత్వమైనా మనోల్లాన్ని కలిగించేది. పది మందికి చేరేది. మన్నన పొందేది. వర్తమాన కాలానికి పట్టిన నిద్దుర వదలగొట్టేది. సమాజాన్ని మేల్కొలిపేది. చైతన్యాన్ని రగిలించేది. అచ్చంగా అలాంటి కవిత్వాన్నే అగ్గిరాజేసేలా అల్లుతున్నాడు హనీఫ్. వీరి "నువ్వు గింజవైతే" కవితా సంపుటిలోని కవితలు చదువుతుంటే ఖచ్చితంగా ఇదే అనుభూతూతి కలుగుతంది.

ఈ కవితల్లో హనీఫ్ భగ్గుమంటున్న పచ్చని అడవితల్లికోసం శోకిస్తున్నాడు. మొక్కలు, పూలు, పచ్చని ప్రకృతి కావాలని తపిస్తున్నాడు. వెచ్చదనం, చల్లదనం ఈ సృష్టిలో సహజం. వాటి నుంచి మనిషిని దూరం చెయ్యొద్దని విన్నవించుకుంటున్నాడు. అవసరమైతే అక్షరంతో పోరు చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాడు. తుపాకుల పహారాతో, ఆదివాసుల అండతో అడవితల్లిని రక్షించుకుంటానని వాగ్దానం ఇస్తున్నాడు. కోల్పోయిన బంధాలకు ఖరీదు కట్టలేనని విలపిస్తున్నాడు. మానవ సంబంధాల్లోని ఆత్మీయతల్ని తలపోస్తున్నాడు. పుట్టిన ఊరిని, ప్రేమ పంచిన స్నేహితుల్ని కుల మతాలకు అతీతంగా ఆలింగనం చేసుకుంటా అంటున్నాడు. చిచ్చుపెడుతున్న రాజకీయ, సాంస్కృతిక వైరుధ్యాల్ని, పుట్టగొడుగుల్లాంటి వైషమ్యాల్ని పెకలించాలని ప్రకటిస్తున్నాడు. హనీఫ్ కవిత్వం నిండా అతని వైయక్తిక జీవితంలోంచి సామాజిక వాస్తవికతలోకి ప్రయాణించడం కనిపిస్తుంది. వ్యక్తినుంచి వ్యవస్థలోకి కవి కట్టిన వారధిపై నడిచి నిజాలను కనుగొన్నట్లు అనిపిస్తుంది.

"బంగాళాఖాతంలో / నిత్యం వస్తున్న తుఫానులా / వాడి సంసారం / నిన్ననే రజస్వల ఐన పిల్ల / అబార్షన్ సర్టిఫికెట్ తో / ఇంటికి చేరుకుంది / 'బేటీ పడావో, బేటియాం బచావో' / ఏడి విఫల వాచ్ మెన్? / సాకర్ మ్యాచ్ కు రెఫరిగా / నియమించబడ్డాడు" ఇలా మధ్యతరగతి బతులను, పిల్లలపై సైతం జరుగున్న అత్యాచారాలను. ప్రభుత్వ ఊకదంపుడు



ప్రవచనాలను, మాటలకు చేతలకు సంబంధం లేని పాలకులను ఒకేసారి ఇలా ఎండగడుతున్నాడు.

వీరి కవిత్వంలో జాలి గొలిపే దృశ్యాలు దొరుకుతాయి. జెండా ఎత్తి పోరుబాటలో నడిచిన వీరుల త్యాగాలు కనిపిస్తాయి. సబ్బండ వర్ణాల జీవితాల్లోని ఎత్తుపల్లాలు ఏకమై పిలుస్తుంటాయి. మంచులా గడ్డకట్టిన బతుకులు కన్నీటితో వర్ణించబడతాయి. పాదరసంలా ప్రవహించే దోపిడీలు వర్ణింపబడతాయి. చెట్టు, పుట్ట, ఆకు, అడవి, సూర్యుడు, చంద్రుడు, మంచు.. అన్నీ ప్రతీకలై నేటి మనుషుల జీవితాల్లోని అల్లకల్లోలాల్ని, అంతుచిక్కని అగాథాల్ని, చీకటి మూగిన రాత్రుల్ని, కొలనుల్లో దాగిన కన్నీటి రహస్యాల్ని విశ్లేషిస్తాయి. వివరిస్తాయి. విస్ఫోటనంలా పేల్చుతాయి.

అడవుల్లో ఆదివాసీల ఉనికిని సైతం ఖాళీ చేయిస్తున్న దృశ్యాల్లోంచి, వారికి అండగా ఉన్న నెక్సలైట్లను చంపుతున్న శబ్దాల్లోంచి నూతనాక్షరాలని పూయిస్తూ .. "ఎవరి దుఃఖం

ఇంకెవరూ తుడవలేరు / మన కన్నీళ్లను మన జ్ఞాపకాల్లోంచి కార్చాలి, సానుభూతిలో కూడా / మాసిపోయిన నీడల్ని ఉన్నతీకరించాలి! " అని ఒక కవితలో హనీఫ్ గొంతెత్తి పిలుస్తాడు.

రాజ్యం చేస్తున్న దుర్మార్గాల్ని.. కులం, మతం పేరుతో మైనారిటీలపై సాగిస్తున్న దోపిడీల వికృతాల్ని, విన్యాసాల్ని బట్టలిప్పి బజార్లో నిలబెడుతుంది ఈ కవిత్వం. ప్రజాస్వామ్యానికున్న అర్థాన్ని, పరమార్థాన్ని తేలిక పరిచి, విశధీకరిస్తుంది. నిన్ను, నన్ను, మనది.. అనే మాటలను పాతిపెట్టి అందరిది, అందరం అనే బహుజన సైద్ధాంతికతను అతి సామాన్యంగా, సామరస్యంగా మనలోకి ఒంపుతుంది. బాధితుల పక్షాన నిలబడి బలవంతుల గొంతు నొక్కాలని వీపు మీద చరచి మరీ చెప్తుంది. అస్తిత్వమే సమైక్యతకు పునాది అని నిర్మొహమాటంగా సిద్ధాంతీకరించి చూపుతుంది. ఇందుకు ప్రకృతినే ఉదహరణగా చూపుతుంది. సత్యాన్ని రుజువు చేస్తుంది.

మత విద్వేషాలను, ముస్లీములపై జరిగే మూక దాడులను ఖండిస్తూ, మేం ఈ దేశ వాసులమే.. ఇక్కడే పుట్టాం, ఇక్కడే పెరిగాం, ఇక్కడే ఆడుకున్నాం, పాడుకున్నాం, చదువుకున్నాం.. మేం ఎలా శత్రువులమవుతాం అంటూ "నా మిత్రులు కాఫిర్లా మారారని / మనసు ఒప్పుకోవడం లేదు / నేనిక్కడ పాడి, పంటను కదా– / మూకలు తగులపెడుతున్నారు" అని విలపిస్తుంది. అగమ్యగోచర బతుకు వర్తమానాన్ని ఎలుగెత్తి చాటుతుంది.

ప్రతి మనిషి ఓ గింజై మొలకెత్తి అడవిని అందమైన పూలవనంలా మార్చాలని కోరుకుంటుంది. ఎదిగే క్రమంలో వచ్చే అడ్డంకులను ఎలా ఎదుర్కోవాలో మట్టి తల్లి, నీటి చుక్క, సూర్యకిరణం సాక్షిగా కవిత్వీకరిస్తుంది. పాలక వర్గాల గుట్టు రట్టు చేసి, ప్రజా పక్షాన నిలబడి చెయ్యెత్తి జై కొడుతుంది. మనల్ని కొట్టమని చెప్తుంది.

పాలకుల కపటత్వాన్ని, రాజకీయ ఎత్తుగడలను బట్టబయలు చేస్తూ.. "పాలకులు కూపస్త మండూకాలు, వాళ్లకు / ప్రజలంటే ఓట్లు, GST.\Tఅని వాళ్ల భావజాలాన్ని, దోపిడీ స్వభావాన్ని ప్రజల ముందు పరుస్తుంది. కర్తవ్య బోధన చేస్తుంది. పేగు బంధాలను, బంధుత్వాలను వదిలి విదేశాలకు వెళ్లే వాళ్ల ఆలోచనల్ని పసిగట్టిన ఈ కవి "ముల్లెడు డాలర్లు ధారపోసి / పిడికెడు మట్టి తర్పణం కోసం" అని డబ్బుకోసం వెపర్లాడే మేధో వలసల వలలను తెంచేస్తాడు.

హనీఫ్‌కు పాత బాటలు, పాత మాటలు, పాత అలంకారాలు గిట్టవు. తనదైన బాణిలో తనదైన వాణిలో తనదైన వాక్యాల్ని తనే సృష్టించుకోవడం ఇష్టం. కవితా శీర్షికల నుంచి కొత్త పదబంధాలు, భావచిత్రాలు, రూపకాలు, ప్రతీకలు, వాక్య నిర్మాణాలను తను ఎంచుకున్న వస్తువుకు అనుగుణంగా మనోలోకంలో తనే తయారు చేసుకుంటాడు. "మూడు సందర్భాలు, తుమ్మెదల విలాపం, లెజండరీ, ఎల్లమ్మ, నీడల్ని ఉన్నతీకరించాలి, చేదెక్కిన నేల, ఏడు రంగులు పది నిజాలు, కనికరం యుద్ధక్షేత్రమే, పైగాం, పెనవేతలు, ఎవరింటింకి వెళ్తున్నావ్?, ఎప్పుడైనా..." లాంటి అనేక శీర్షికల్లో ఆశ్చర్యాలు, ప్రశ్నలు, సంఖ్యావాచకాలు, సాంస్కృతిక చిహ్నాలు, కవిత్వీకరణ పదబంధాలు, సంస్కృతపదాలు, భావకవిత్వ చిహ్నాలు, అచ్చమైన గ్రామీణ గుర్తులు... ఎన్నో కనిపిస్తున్నాయి.

వీరి కవితల ముగింపుకో ప్రత్యేకత ఉంది. "దూది పింజ" కవిత "మొక్కను నరికినంత తేలిక కాదు / దాన్ని వృక్షంగా మలచడం" అని ముగిసి ఆత్మ నిర్భరతని ప్రశ్నిస్తుంది. "దోస్తానా" కవిత "అ మానవుడు / అకవి / అద్దం ముందు నిలవలేను" అంటూ మతం పేరుతో కొత్తగా చూస్తున్న తన పాత స్నేహితుల్ని ప్రశ్నిస్తుంది. "కల్లోల ప్రయాణం" కవిత "కుటుంబ వ్యవస్థ శ్మశానం (వృద్ధాశ్రమాలు) వాకిట్లో / సేద తీరుతుంది" అని నేటి సామాజిక జీవన చిత్రాన్ని కళ్లపైన గీస్తుంది. అలాగే "ఎప్పుడైనా..!" కవిత "ఎప్పుడైనా–/ విజేతను అడివే కంటుంది" అని అడివిని, విప్లవవీరుడ్ని కనే అమ్మగా భావిస్తూ ముగుస్తుంది.

కవిత్వ పదబంధాల పరంగా "ఇంటి చెట్టుకు దిగుళ్లు పూస్తాయి, సంఘటనల మూట, దహనాల సువాసన, బరిబత్తల వీధి, హృదయ మెమరీ, మంచు బతుకు, బాధ్యతల అగ్గి, పాకుడు పట్టిన బండలా భూగోళం, నేల విడిచిన పేగు, విఫల సముద్రం, ఐస్ క్యూబ్ గొంతు.." వంటి ఎన్నో సరికొత్త ప్రయోగాలు ఈ కవితల్లో తళుక్కున మెరుస్తాయి. కవితార్థాన్ని నిగూఢంగా ఎలా చూడాలో నేర్పిస్తాయి. ప్రతి కవితా ఓ సందేశాన్నో, సంఘర్షణనో, సజీవాన్నో, మరణాన్నో, మారణహోమాన్నో, యాదార్థ సత్యాన్నో గుండెలపై చెక్కి అలా వెళ్లిపోతుంది. వెళ్లిపోతూ మనల్ని నిక్కచ్చిగా, నిజాయితీగా ఆలోచించమంటుంది.

నువ్వు గింజవైతే (కవిత్వం). కవి: హనీఫ్. పేజీలు: 137. వెల: 200, ప్రతులకు: 9247580946.

రచయిత: సీనియర్ జర్నలిస్ట్

తెలుగులో యుద్ధతంత్ర శాస్త్రకావ్యాలు-అనుశీలన

డా. కె.రమేశ్

1. పరిశోధన శీర్షిక (Title of the Research)

తెలుగు సాహిత్యం కేవలం కావ్య, ప్రబంధ, నాటక, కథా సాహిత్యాలకే పరిమితమైనది కాదు. తెలుగు భాషలో వివిధ శాస్త్రాలకు సంబంధించిన అనేక గ్రంథాలు కూడా వెలువడ్డాయి. ఆయా శాస్త్రగ్రంథాలు తమ కాలంలోని శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సామాజిక జీవన విధానం, వృత్తి నైపుణ్యాలు, ఆయుధ నిర్మాణం, వైద్య విజ్ఞానం, వ్యవసాయ పరిజ్ఞానం, జంతు, వృక్షశాస్త్ర విజ్ఞానం వంటి ఎన్నో విషయాలను ప్రతిబింబిస్తాయి. ఈ శాస్త్ర వాఙ్మయంలో యుద్ధతంత్రానికి సంబంధించిన గ్రంథాలు ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే తెలుగు సాహిత్యంలో యుద్ధతంత్రాన్ని ప్రధాన విషయంగా చేసుకుని వచ్చిన శాస్త్రకావ్యాలపై సమగ్ర పరిశోధన ఇప్పటివరకు పరిమితంగానే జరిగింది. ఈ నేపథ్యంలో 'తెలుగులో యుద్ధతంత్ర శాస్త్రకావ్యాలు-అనుశీలన' అనే అంశంపై పరిశోధన చేసాను.

పరిశోధన నేపథ్యం (Background of the research)

మానవ పరిణామక్రమంలో ఆయుధాలకు విశిష్టమైన స్థానం ఉంది. ఆదిమ మానవుడు ఆహారాన్వేషణ, వేట, ఆత్మరక్షణ కోసం ఉపయోగించిన సాధనాలు క్రమంగా ఆయుధాలుగా పరిణమించాయి. సమాజ వ్యవస్థలు, రాజ్యాలు ఏర్పడిన తరువాత రాజ్యరక్షణ, శత్రునిరోధం, అధికార విస్తరణ వంటి అవసరాల కోసం ఆయుధాలు, యుద్ధతంత్రాలు మరింత అభివృద్ధి చెందాయి. భారతీయ సంప్రదాయంలో యుద్ధం కేవలం శక్తిప్రదర్శనగా కాకుండా ధర్మరక్షణకు సంబంధించినదిగా కూడా ఉన్నది. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలలో ఇలాంటివి లేకపోలేదు.

పరిశోధన పరిధి(The Scope of the Research)

ఈ పరిశోధనలో ప్రధానంగా నాలుగు శాస్త్రగ్రంథాలను పరిశీలించాను. అవి కృష్ణమాచార్యుల 'ధనుర్విద్యా విలాసం', నవనప్ప రచించిన 'ఖడ్గలక్షణ శిరోమణి', అజ్ఞాతకర్తృక 'తుపాకిశాస్త్రం', మనుమంచిభట్టు 'హయలక్షణ విలాసం'. వీటిలో 'తుపాకిశాస్త్రం' వచనరూపంలో ఉండగా, మిగిలిన గ్రంథాలు ప్రధానంగా పద్యరూపంలో ఉన్నాయి. వీటి ద్వారా ప్రాచీన, మధ్యయుగ తెలుగు సాహిత్యంలో యుద్ధవిజ్ఞానం, ఆయుధ పరిజ్ఞానం, జంతుశాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.


తెలుగులో యుద్ధతంత్ర శాస్త్ర కావ్యాలు - అనుశీలన
హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టా కోసంసమర్పించిన పరిశోధన గ్రంథం

పరిశోధన
కె. రమేశ్

పర్యవేక్షణ
ఆచార్య పిల్లలమర్రి రాములు

తెలుగు శాఖ
మానవీయ శాస్త్రాల విభాగం
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
గచ్చిబౌలి, హైదరాబాద్ -500046
తెలంగాణ,2017.

యుద్ధతంత్రానికి సంబంధించిన 'ఫిరంగి శాస్త్రం' వ్రాతప్రతి కోసం కూడా ప్రయత్నించాను. మద్రాస్ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ఉన్నట్లు సమాచారం లభించినప్పటికీ, రెండు పర్యాయాలు వెళ్లినా ఆ వ్రాతప్రతి లభించలేదు. అయితే తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో 'తుపాకిశాస్త్రం', 'ధనుర్విద్యా విలాసం'కు సంబంధించిన తాళపత్ర వ్రాతప్రతులను పరిశీలించే అవకాశం లభించింది.

పూర్వ పరిశోధనల సమీక్ష (Review of the literature)**-విషయసేకరణ**

తెలుగులో శాస్త్రసాహిత్యంపై జరిగిన పరిశోధనలు పరిమితంగానే ఉన్నాయి. గుంటూరు మస్తాన్‌రావు 'తెలుగులో సాంకేతికశాస్త్ర వాఙ్మయం', జొన్నలగడ్డ మార్కండేయులు 'తెలుగు సాహిత్యంలో ధనుశ్శాస్త్రము' వంటి పరిశోధనలు ఈ రంగానికి ప్రాథమిక ఆధారాలు. అయితే యుద్ధతంత్రానికి సంబంధించిన వివిధ శాస్త్రకావ్యాలను ఒకే పరిశోధనా పరిధిలోకి తీసుకొని సమగ్రంగా పరిశీలించిన అధ్యయనం అవసరమని భావించాను. అందులో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ, సిటీ సెంట్రల్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ, కాకతీయ విశ్వవిద్యాలయ, డాక్రి (DACRI) గ్రంథాలయాలు, సాలార్‌జంగ్ మ్యూజియం, పురావస్తు శాఖకు చెందిన సంస్థలను సందర్శించి విషయసేకరణ చేశాను. ప్రాచీన నిఘంటువులు, సంస్కృత శాస్త్ర, చారిత్రక గ్రంథాలు, భాషాశాస్త్ర సంబంధిత పరిశోధనలు కూడా ఆధారాలుగా ఉపయోగించాను. క్షేత్రపర్యటనల ద్వారా విశ్వకర్మ వృత్తివర్గాలకు చెందిన అనుభవజ్ఞులను కలిసి ఇనుము, ఉక్కు

పరికరాలు, ఆయుధాలు, వాటి తయారీ విధానాలు, పనిముట్ల వినియోగం వంటి విషయాలపై ప్రత్యక్ష సమాచారాన్ని స్వీకరించాను.

ఈ అంశ పరిశోధనలో భాగంగా పరిశీలన, విశ్లేషణ, తులనాత్మక అధ్యయనాల్ని నమూనాగా చేసుకొని సాంకేతిక భాష పదజాలాన్ని ప్రత్యేకించి చూడడానికి నిఘంటువుల అధ్యయన పద్ధతిని కూడా అనుసరించాను.

అధ్యాయ విభజన (Chapter division)

నా సిద్ధాంత గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాను. అవి:

1. తెలుగు సాహిత్యంలో శాస్త్రసాంకేతిక విజ్ఞానం-అధ్యయన ఆవశ్యకత
2. ధనుర్వేదం-ధనుర్విద్యా విలాసం
3. ఖడ్గ శాస్త్రం-ఖడ్గలక్షణ శిరోమణి
4. తుపాకిశాస్త్రం
5. అశ్వశాస్త్రం
6. శాస్త్ర సాంకేతిక పారిభాషిక పదజాలం

పై అధ్యాయాల్లోని ప్రధాన అంశాల్ని పరిశీలిద్దాం:

ధనుర్విద్యా విలాసంలో ధనుర్విద్యకు సంబంధించిన అనేక శాస్త్రీయ అంశాలు కనిపిస్తాయి. ధనుస్సు, బాణాల రకాలు, వింటినారి నిర్మాణం, బాణం ఎక్కుపెట్టే విధానం, అంగుళీత్రాణం, హస్తం, అమ్ములపొదుల రకాలు, లక్ష్యంపై ఏకాగ్రత, బాణప్రయోగ పద్ధతులు, ధనుర్విద్యకు అవసరమైన కౌశలాలు వంటి అంశాలు ఇందులో వివరించబడ్డాయి. ధనుర్విద్యా గురువు, శిష్యుడు, ధనుర్ధారి లక్షణాలతోపాటు ధనుర్విద్యాభ్యాసానికి అనుకూలమైన కాలాన్ని కూడా గ్రంథకర్త పేర్కొన్నాడు.

పరిశోధన ఉద్దేశం, లక్ష్యం (aims &objectives)

ఖడ్గలక్షణ శిరోమణి ఖడ్గశాస్త్రానికి సంబంధించిన ప్రత్యేక గ్రంథంగా గుర్తించవచ్చు. ఇందులో ఖడ్గాల రకాలు, వాటి లక్షణాలు, ప్రమాణాలు, వినియోగ విధానాలు, ఖడ్గధారుల లక్షణాలు, ఖడ్గయుద్ధంలోని మెళకువలు కనిపిస్తాయి. అంతేకాకుండా ఈ గ్రంథంలోని పారిభాషిక పదజాలం, అన్యదేశ్య పదాలు, ప్రమాణ సంకేతాలు, ఛందస్సు వంటి అంశాలు తెలుగు భాషా చరిత్ర, శాస్త్రపరిభాష పరిశోధనకు కూడా ఉపయోగపడతాయి.

తుపాకిశాస్త్రం నాలుగు ఆశ్వాసాలుగా ఉన్న అముద్రిత గ్రంథం. దీని రచయిత తెలియదు. ఇందులో తుపాకి మందు, తుపాకికి ఉపయోగించే తాడు తయారీ, జంతువుల వేట పద్ధతులు వంటి విషయాలతోపాటు భూతవైద్యం, ఆయుర్వేద వనమూలికలు, వాటితో ఔషధాల తయారీ అంశాలున్నాయి. అయితే తుపాకితో నిర్వహించే యుద్ధతంత్రం కంటే వేట విశేషాలు ఎక్కువే. ఈ గ్రంథం అముద్రితంగా ఉండటం, వ్యాఖ్యానాలు-టీకాలు అందుబాటులో లేకపోవడం పరిశోధనలో ఒక ముఖ్యమైన సవాలుగా నిలిచింది. హయలక్షణ విలాసంలో అశ్వశాస్త్రాంశాలు ప్రధానంగా ఉన్నాయి. గుర్రాల ప్రశంస, సుడుల లక్షణాలు, ఆయుఃప్రమాణం, దంతదోషాలు, వాటివల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణ పద్ధతులు మొదలైన అంశాల్నిందులో చూడవచ్చు. యుద్ధంలో గుర్రాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవడానికి ఈ గ్రంథం ముఖ్యమైన ఆధారంగా నిలుస్తుంది.

పరిశోధన ఫలితాంశాలు(research findings)

ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఉన్న శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని వెలికితీయడం. ఈ గ్రంథాల్లోని శాస్త్రపరిభాష, సాంకేతిక పదజాలం, ఆయుధాల నిర్మాణం, వినియోగ పద్ధతులు, యుద్ధతంత్రాలు, జంతుశాస్త్ర విజ్ఞానం వంటి అంశాలను విశ్లేషించడం ద్వారా తెలుగు వారి శాస్త్రవిజ్ఞాన చరిత్రను కొంతవరకు పునర్నిర్మించవచ్చు. ఈ శాస్త్రకావ్యాల భాష గ్రాంథికంగా ఉండటం, సంక్లిష్టమైన పారిభాషిక పదజాలం వినియోగించడం, కొన్ని గ్రంథాలు అముద్రిత వ్రాతప్రతులుగా ఉండటం పరిశోధనలో క్లిష్టతను కలిగించాయి. కొన్ని పదాలకు కాలక్రమంలో అర్థపరిణామం, ధ్వనిపరిణామం సంభవించడం వల్ల వాటి మూలార్థాన్ని నిర్ణయించడం కూడా కష్టమైంది. అందువల్ల నిఘంటువులు, సంస్కృత శాస్త్రగ్రంథాలు, చారిత్రక ఆధారాలు, ఇతర భాషల్లోని పరిశోధనలను తులనాత్మకంగా ఉపయోగించాను.

ముగింపు-భావి పరిశోధకులకు సూచనలు:

తెలుగు సాహిత్యంలో యుద్ధతంత్ర శాస్త్రకావ్యాలు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ, వాటి విజ్ఞాన విలువ అపారమైనది. ఇవి కేవలం ఆయుధాలు, యుద్ధపద్ధతులను వివరించే గ్రంథాలు మాత్రమే కావు. ఆయా కాలాల సాంకేతిక పరిజ్ఞానం, వృత్తిజ్ఞానం, భాష, సంస్కృతి, సామాజిక జీవనం, జంతుశాస్త్రం, రసాయనిక పరిజ్ఞానం వంటి అనేక అంశాలకు ఆధారాలుగా నిలుస్తాయి. ధనుర్విద్య, ఖడ్గవిద్య, మల్లయుద్ధం వంటి సంప్రదాయ యుద్ధవిద్యలు కాలక్రమంలో మార్పులకు లోనైనా, వాటి ఆధునిక రూపాలు వివిధ క్రీడలు, శిక్షణా విధానాల రూపంలో కొనసాగుతున్నాయి. తుపాకీ, ఫిరంగి వంటి ఆయుధాల పరిణామం ఆధునిక ఆయుధ సాంకేతికత అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి చారిత్రక నేపథ్యాన్ని అందిస్తుంది. అందువల్ల తెలుగు శాస్త్రకావ్యాలను వెలికితీసి, పరిష్కరించి, ముద్రించి, వ్యాఖ్యానించి, ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని నా భావన.

పరిశోధకుని వివరాలు: డా. కె. రమేష్, దొంతాపూర్, ధర్మపురి, జగిత్యాల, తెలంగాణ. ఫోన్: 9640450114

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376

Address for communication

Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007